బుధవారం
19•6•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 8 • సంచిక 355
• పేజీలు: 16 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




# వైభవంగా కాళేశ్వరం



మంగళవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.

## పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలతో చక్కటి ఫలితాలు

మహారాష్ట్ర సహకారంతోనే కాళేశ్వరం సాకారం.. అదే బాటలో కర్ణాటక • కాళేశ్వరంతో 80 శాతం తెలంగాణకు సాగు, తాగునీరు

ఈ ఏడాది సీతారామ, దేవాదుల పూర్తి • ప్రాజెక్టుల విషయంలో అహోరాత్రులు శ్రమించా.. నేను అచీవర్‌ని: సీఎం కేసీఆర్

**ఉద్యోగులకు పీఆర్సీ, రిటైర్మెంట్ వయసు పెంపుతో ఒకే ప్యాకేజీ**

**త్వరలో కొత్త మున్సిపల్ చట్టం • జూలైలోగా మున్సిపల్ ఎన్నికలు పూర్తి • పటిష్ఠంగా పంచాయతీరాజ్ చట్టం అమలు**

**(హైదరాబాద్, నమస్తే తెలంగాణ)**

తెలంగాణను సస్యశ్యామలంచేసే కాళేశ్వరం ప్రాజెక్టును వైభవంగా ప్రారంభించుకొంటున్నామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. 45 లక్షల ఎకరాలకు సాగునీటిని, 80 శాతం తెలంగాణకు తాగునీటిని అందించే, పారిశ్రామిక అవసరాలు తీర్చే ఇలాంటి బృహత్తర ప్రాజెక్టు ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంగా కాళేశ్వరం ప్రాజెక్టును సీఎం అభివర్ణించారు. సముద్రంలోకి వృథాగా పోతున్న దాదాపు ఐదువేల టీఎంసీల నీళ్లను తెలంగాణ, ఏపీలోని ప్రతి అంగుళానికి అందించాలని నిర్ణయించామని సీఎం కేసీఆర్ తెలిపారు. గత ప్రభుత్వం గిల్లికజ్జాలు పెట్టుకోవడం వల్ల గత ఐదేండ్లలో చాలారకాలుగా నష్టపోయామని.. ఇకపై అలా జరిగే ఆస్కారం లేదన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లతో స్నేహసంబంధాలు కొనసాగిస్తామని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో మహారాష్ట్ర సహకారం మరువలేనిదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో సంబంధాలు ప్రభుత్వం మారిన తర్వాత మెరుగుపడ్డాయని.. వీటిని కొనసాగిస్తూ ఇరురాష్ట్రాల మధ్య అన్ని అంశాలను సామరస్యంగా పరిష్కరించుకొంటామని సీఎం చెప్పారు. ఈ నెల 27న కొత్త సచివాలయ, శాసనసభ భవనాలకు శంకుస్థాపన చేస్తామని సీఎం ప్రకటించారు. ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు పెంపుదలతోపాటు, పీఆర్సీని కలిపి ఒకే ప్యాకేజీగా ఇస్తామని ప్రకటించారు. జూలైలోగా మున్సిపల్ ఎన్నికలను నిర్వహిస్తామన్నారు. పంచాయతీరాజ్ చట్టాన్ని పటిష్ఠంగా అమలుచేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీఆర్‌ఎస్ పార్టీ భవనాలకోసం భూములను కేటాయించాలని మంత్రిమండలి నిర్ణయించినట్లు సీఎం చెప్పారు. సినీదర్శకుడు శంకర్‌కు స్టూడియో నిర్మాణానికి ఐదెకరాలు, శారదాపీఠానికి రెండెకరాలు కేటాయిస్తున్నామని తెలిపారు. మంగళవారం రాష్ట్ర మంత్రిమండలి సమావేశం అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. వివిధ అంశాలపై సీఎం పేర్కొన్న వివరాలు ఆయన మాటల్లోనే..

'ఇరుగుపొరుగు రాష్ట్రాలతో కొనసాగించాల్సిన సంబంధాలు.. దాంతో వచ్చే ఫలితాలు.. తద్వారా రాష్ట్ర పురోగతికి దోహదపడే అంశాలపై విస్తృతస్థాయి చర్చ జరిగింది. ఇరురాష్ట్రాల్లో ఉన్నటువంటి ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ఇది చక్కని శుభవార్తగా భావిస్తున్నాను. తప్పకుండా ఆంధ్రప్రదేశ్‌తో స్నేహపూర్వక సంబంధం కొనసాగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇటీవలికాలంలో జరిగిన పరిణామాలు, ఏపీలో ప్రభుత్వ మార్పు, తదనంతరం ఆ రాష్ట్ర సీఎంతో వివిధ సందర్భాల్లో జరిగిన చర్చల దరిమిలా ఏపీ ప్రభుత్వం ముందుకొచ్చి భేషజాల్లేకుండా హైదరాబాద్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు తెలంగాణ ప్రభుత్వానికి అప్పగిస్తున్నటువంటి పరిణామాలు.. వీటన్నింటి నేపథ్యాన్ని పురస్కరించుకుని చక్కటి వాతావరణం ఏర్పడింది. గతంలో మహారాష్ట్ర, కర్ణాటకతో రోజు బస్తీ మే సవాల్ అన్నట్లు పంచాయితీలుండేవి. అనేక విషయాల్లో అనేకరకాల వివాదాలుండేవి. కోర్టు

మిగతా 2వ పేజీలో

### ఏపీతో స్నేహపూర్వక సంబంధం

- తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి అంగుళానికి నీరు అందిస్తాం
- నేడు ఏపీ భవనాల అప్పగింత
- 27 హైదరాబాద్‌కు ఏపీ డెలిగేషన్
- సామరస్యంగా విభజన సమస్యల పరిష్కారం
- జగన్ యువకుడు.. ఉత్సాహవంతుడు
- టీఆర్‌ఎస్ పార్టీ భవన నిర్మాణాలకు అన్ని జిల్లాల్లో భూ కేటాయింపు
- డైరెక్టర్ శంకర్‌కు స్టూడియో నిర్మాణానికి 5 ఎకరాలు
- శారదాపీఠానికి రెండెకరాలు
- మేం ఎన్డీయేలో భాగస్వాములం కాదు
- ఫెడరల్ ఫ్రంట్‌కు కట్టుబడి ఉన్నా
- మోదీని మొదట విమర్శించింది నేనే
- నిధుల విషయంలో షాను క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశా
- నచ్చిన చోట సమర్థించా.. నచ్చనిచోట విమర్శించా
- కేంద్రరాష్ట్ర సంబంధాలు రాజ్యాంగబద్ధంగానే ఉంటాయి
- క్యాబినెట్ సమావేశం అనంతరం రాష్ట్ర సీఎం కేసీఆర్ వెల్లడి

## నేడు టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణభవన్‌లో జరుగనున్నది. ఇటీవల ముగిసిన పార్లమెంట్, పరిషత్ ఎన్నికల ఫలితాలపై, త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే అంశంపై సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నది. పార్టీ భవిష్యత్ కార్యాచరణపైనా చర్చిస్తారని సమాచారం. పార్టీ నూతన కార్యాలయాల నిర్మాణాలు, పార్టీ సభ్యత్వ నమోదు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నదని తెలిసింది.



మీడియా సమావేశంలో నూతన సచివాలయం నమూనాను చూపుతున్న సీఎం కేసీఆర్

## శాసనసభకూ కొత్త భవనం

ఎర్రమంజిల్‌లో రూ.100 కోట్లతో నిర్మాణం

ఇప్పుడున్నచోటే కొత్త సచివాలయం

6 లక్షల చదరపు అడుగులు.. 400 కోట్ల ఖర్చు

27న రెండింటికీ శంకుస్థాపన

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాసనసభకు కొత్త భవనాన్ని నిర్మించాలని మంగళవారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఎర్రమంజిల్‌లోని ఎత్తయిన ప్రాంతంలో కొత్త భవనాన్ని నిర్మించనున్నారు. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న స్థలంలోనే సచివాలయం కొత్త భవనాన్ని కూడా నిర్మిస్తారు. ఈ రెండు భవనాలకు ఈ నెల 27న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తారు. పార్లమెంట్ భవనాన్ని పోలినవిధంగా అసెంబ్లీ

మిగతా 2వ పేజీలో



## లోక్‌సభ స్పీకర్‌గా ఓమ్ బిర్లా!

రాజస్థాన్ ఎంపీని తమ అభ్యర్థిగా ప్రకటించిన ఎన్డీయే

మద్దతు పలికిన కాంగ్రెస్, యూపీఏ పక్ష పార్టీలు 8

నేడు ఎన్నిక లాంఛనప్రాయమే

## గడికింత భూమి మాయం!

- అసలైన వారసులకు హక్కులేకుండా చేశారు
- చొప్పదండిలో రెవెన్యూ అధికారుల లీలలు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితులు



పిల్లలమర్రి చంద్రమౌళి వారసులు లక్ష్మి, ఆమె ఇద్దరు కుమారులు

**భూమి పెరుగును..** అని నిరూపించిన అధికారులను చూశాం! ఇది.. ఉన్న భూమిని క్రమక్రమంగా మాయం చేసిన జాదూల కథ! రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనేందుకు మరో ఉదాహరణ! ఒకరి పేరిట ఉన్న భూమిని ఏడాదికి కొంత చొప్పున మరొకరి పేరిట పహాణీలో రాసి.. అసలు పట్టాదారులకు ఏకంగా భూమి లేకుండా చేశారు కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం అధికారులు! పోనీ ఏమైనా ఆధారాలను బట్టి భూమిని ఇతరుల పేరిట

**ధర్మగంట**

రాశారా? అంటే అదీలేదు! తన బిడ్డలకు వారసత్వంగా దక్కాల్సిన భూమి.. ఇతరుల చేతికి వెళ్లడంతో బాధితురాలు.. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది! దీంతో తన ఇద్దరు కుమారులతో కలిసి ధర్మగంటను ఆశ్రయించిన బాధితురాలు.. తమకు జరిగిన అన్యాయాన్ని మొరపెట్టుకున్నారు! 4

### బానోత్ బాల్య భూమిని సర్వే చేయిస్తాం

అర్హత ఉంటే పాస్‌బుక్ జారీచేస్తాం

'పట్టా పాస్‌పుస్తకం ఇప్పించండి..' కథనంపై చెన్నారావుపేట తాసిల్దార్ 4

## 3430 కోట్ల రైతుబంధు

33.70 లక్షల మంది రైతులకు జమ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

వానకాలం పంటల పెట్టుబడి కోసం రైతుబంధు పథకం కింద మంగళవారం నాటికి 33.70 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.3,430 కోట్లు జమచేసినట్టు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి వెల్లడించారు. మిగిలిన రైతులకు కూడా విడుతలవారీగా సొమ్ము జమచేస్తామని తెలిపారు. ఈ వానకాలం సీజన్‌లో రైతుబంధు పథకం కింద ఎకరానికి రూ.5 వేల చొప్పున 54.50 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.



17 సిక్సర్ల..

## మొనగాడు మోర్గాన్!

- వన్డేల్లో సరికొత్త ప్రపంచ రికార్డు
- అఫ్ఘనిస్థాన్‌పై వీరవిహారం
- ఇంగ్లండ్ భారీ విజయం

వివరాలు ఆటలో

### ఒక చెట్టు నరికితే ఐదు మొక్కలు నాటాల్సిందే

పటిష్ఠంగా వాల్టా చట్టం

జిల్లాలు, డివిజన్లవారీగా నిర్వహణ కమిటీలు ఖరారు 8

చెట్ల నరికివేత, బోర్లకు అనుమతి తప్పనిసరి

### నేడు రాష్ట్రంలో అక్కడక్కడ వానలు

ఉత్తర తెలంగాణలో వడగాడ్పులు వీచే అవకాశం 5

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

డ్రైవింగ్ లైసెన్స్‌కు.. 8

### కనీస విద్యార్హత అవసరం లేదు!

నిబంధనను తొలిగిస్తున్నట్లు కేంద్రం వెల్లడి














మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రివర్గ భేటీ అనంతరం ప్రగతిభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు మహమూద్ అలీ, ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, నిరంజన్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, జీ జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి

# వైభవంగా కాళేశ్వరం

మొదటిపేజీ తరువాయి...

వ్యాజ్యాలుండేవి. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కర్ణాటకతో సత్సంబంధాలు పెట్టుకున్నాం. అవి కొనసాగుతున్నాయి. మూడు సార్లు వాటర్‌ను ఎక్స్చేంజి చేసుకున్నాం. మొట్టమొదటిసారి తెలంగాణ అడిగితే వారు నీరివ్వడం, వారు అడిగితే ఆర్డీఎస్ ద్వారా నీరు ఇవ్వడం.. మళ్లీ మొన్న జూరాల కోసం అవసరమైతే మూడోసారి కూడా మూడు టీఎంసీల నీరిచ్చారు. ఇది నిజంగా మంచి డెవలప్‌మెంట్. అదే పద్ధతిలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పెండింగులో పెట్టినటువంటి ప్రాజెక్టుల సంగతి మనకు తెలుసు. లోయర్ పెన్‌గంగ.. ఐదు దశాబ్దాల నుంచి పెండింగులో ఉన్నది. అది కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల నినాదం. ఆ ప్రాజెక్టు ఈ రోజు చనాకా కొరాట రూపంలో చకచకా నిర్మాణం జరుగుతున్నది. షార్ట్‌లీ కంప్లీట్ కానున్నది. ప్రపంచమే అబ్బురపరిచే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించుకొనే దశకు వచ్చింది. దానికి ఇంకా కొన్ని పనులు కావాల్సి ఉన్నవి. కొన్ని రిజర్వాయర్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. యాభై శాతం పూర్తికావాల్సి ఉన్నది. కొన్ని జరుగుతున్నాయి. పూర్తి సత్ఫలితాలు రావడానికి మరికొంత సమయం పడుతుంది. ఇంత చక్కగా పనులు జరగడానికి మహారాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహమే కారణం. చివరి దశలో మొన్న కూడా 15 ఎకరాల ప్రైవేటు భూమి, 25ఎకరాల అటవీభూమిని ఇప్పించారు. కరకట్టలు కట్టడానికి అవసరమైతే వారు ఉదారంగా వ్యవహరించారు. పర్యావరణ అనుమతులూ ఇప్పించారు. స్నేహపూర్వకంగా ఉండటం మూలాన ఇది సాధ్యమైంది. అదే శత్రుభావంతో ఉంటే.. గిల్లికజ్జాలు పెట్టుకుంటే సాధ్యమవుతుందా? ఈ ప్రాజెక్టు 45 లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీళ్లిస్తది. ఫేజు-1లో 25 లక్షల ఎకరాలకు, శ్రీరాంసాగర్ ఆయకట్టు, ప్లస్ సిరిసిల్ల దాని తాలుకా పరిసరాలు, హుస్నాబాద్ తాలూకా దాని పరిసరాల్లో ఉండే ప్రాంతాలు.. కొత్త, పాత కలిపి సుమారు 25 లక్షల ఎకరాలకు నీళ్లొస్తయ్. ఆపైన సిద్దిపేట జిల్లా, ప్రస్తుతం మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌కు వచ్చేనాటికి.. మరో 20 లక్షల ఎకరాలకు, అంటే దాదాపు 45 లక్షల ఎకరాలకు సాగునీరు, తెలంగాణ పారిశ్రామిక అవసరాలతోపాటు తెలంగాణకు సమృద్ధిగా నీరు అందించే మహత్తరమైన ప్రాజెక్టు కాళేశ్వరం ఇంత త్వరగా పూర్తి కావడంపట్ల ఆశ్చర్యపోతున్నారు. విజయవంతంగా ప్రారంభించుకొంటున్నాం. అందుకే, స్వయంగా మహారాష్ట్రకు వెళ్లి, విజయవాడకు వెళ్లి ఇద్దరుముఖ్యమంత్రులను ఆహ్వానించడం జరిగింది. ఇదే రకమైన స్నేహపూర్వక వాతావరణం కొనసాగించాలని కోరడం జరిగింది. వారిద్దరూ అంగీకరించారు. ఇంతత్వరగా ప్రాజెక్టు పూర్తయినందుకు సాక్షాత్తు మహారాష్ట్ర ముఖ్యమంత్రి షాక్ అయ్యారు. నిన్నమొన్న వచ్చి అగ్రిమెంట్‌చేసినట్లే ఉందన్నారు.



## నేను ఆహ్వానిస్తే.. మీరు రావొద్దంటారా?

ప్రాజెక్టు ప్రారంభానికి ఆహ్వానించడానికి నేను పోతుంటే ఇక్కడున్న మీరు రావద్దని అంటున్నరు. ఇది రాష్ట్రానికి మంచిది కాదు. ఎవరన్న ఇలా మాట్లాడుతరా.. సంస్కారం అనిపించుకుంటుందా.. ఇది మంచిదా.. జీవితంలో 50 ఏండ్లు అధికారం ఇస్తే కట్టలేదు. తమ్మిడిహెట్టి అని ప్రారంభించి తట్టెడుమన్ను కూడా తవ్వలేదు. అనుమతి సాధించలేదు. అగ్రిమెంట్ చేసుకోలేదు. లోయర్ పెన్‌గంగ, లెండి కెనాల్ పెండింగ్ పెట్టారు. ఇండియా మొత్తంలో 45 లక్షల ఎకరాలకు సాగునీటిని, 80శాతం తెలంగాణకు తాగునీటితోపాటు, పారిశ్రామిక అవసరాలు తీర్చే బృహత్తర ప్రాజెక్టు ఏ రాష్ట్రంలోనూ లేదు. ఇది ప్రపంచపు అతి పెద్ద మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం. అంతపెద్ద ప్రాజెక్టు ఇది. తక్కువ సమయంలో చేశాం. అన్ని గ్రామాల్లో పండుగ జరుపుకుంటరు. రాష్ట్రమంతా పండుగ వాతావరణం ఉంటుంది. ప్రాజెక్టు సమీపంలో తక్కువ స్థలం ఉంటుంది. వర్షం కురిస్తే ఇబ్బందులుంటాయి కాబట్టి పరిమిత సంఖ్యలో వెళ్తున్నాం. లైవ్ టెలికాస్ట్ ఉంటుంది కాబట్టి సభ పెట్టలేదు. మంచి సందర్భం కాబట్టి పాజిటివ్ కోణంలో కవర్ కావాలి. రాజకీయాలుంటే మాట్లాడుకుందాం అదివేరే సంగతి. ఇదొక పాజిటివ్ అంశం. కొత్త రాష్ట్రానికి ఒక అచీవ్‌మెంట్.

### ఐదువేల టీఎంసీల నీళ్లను వాడుకుందాం..

ఏపీలో నూతన ముఖ్యమంత్రి యువకుడు, ఉత్సాహవంతుడు.. అక్కడి మెట్ట ప్రాంతాలకు నీరు ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. తెలంగాణలో మనం ఎట్లయితే ప్రాజెక్టులను పూర్తిచేశామో.. ఏపీలో నూచేయాలని అనుకుంటున్నాడు. ఈ భేషజాలు పనికిరావన్నాడు. నేను ముఖ్యకార్యదర్శి, ఆర్థిక కార్యదర్శి విజయవాడలో సమావేశమయ్యాం. 27న ఇక్కడికి ఏపీ డెలిగేట్స్ వస్తారు. హైదరాబాద్‌లో ఒక దఫా ఒకటిరెండ్రోజులు సమావేశమవుతాం. తర్వాతి సమావేశం విజయవాడలో పెట్టుకుంటాం.

## త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు..

మున్సిపల్ ఎన్నికలు కూడా వీలైనంత త్వరగా జరుపాలని నిర్ణయించాం. అదొక్కటే ఎన్నిక మిగిలి ఉన్నది. సహకార ఎన్నికల పరిధి చిన్నది. మున్సిపల్ మిగిలాయి. టర్మ్ జూలైతో ముగుస్తున్నది. కొత్త మున్సిపాలిటీలు వచ్చాయి. నూతన మున్సిపల్ చట్టం కూడా తేవాలని ఆలోచిస్తున్నం. చట్టం చేయాలా, లేక ఆర్డినెన్స్ రూపంలో తేవాల్నా అని ఆలోచిస్తున్నం. వెంటనే బీసీ తదితర రిజర్వేషన్లు పూర్తిచేయలని మున్సిపల్ శాఖను ఆదేశించాను. ఒకసారి నోటిఫై అయిపోతే ఎన్నికలు జరుపుకోవచ్చు. కొద్ది రోజుల్లోనే రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేసి, జూలైలోనే ఎన్నికలు ముగించే ప్రయత్నం చేస్తాం.

అవసరమైతే క్షేత్రపర్యటనలకు ఇరు రాష్ట్రాలకు సంబంధించిన సంయుక్త బృందాలు పోవాలని నిర్ణయించాం. ఇది తెలుగు ప్రజలకు సంతోషకరమైన శుభవార్త. పాత ఆంధ్రప్రదేశ్ అయినా, ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అయినా.. 1480 టీఎంసీలు గోదావరిలో కేటాయింపులున్నాయి. 811 టీఎంసీలు కృష్ణాలో కేటాయించారు. రెండు కలిపితే సుమారు 2,300 టీఎంసీల నీళ్లు మనకు కేటాయించారు. మనం వాడుకోకుండా మిగిలితే బంగాళాఖాతంలోకి పోతాయి. చివరి రాష్ట్రాలు మనవే కాబట్టి, మిగులు జలాలు మనమే వాడుకోవాలని బచావత్ ట్రిబ్యునల్ చెప్పింది. 50 సంవత్సరాల సీడబ్ల్యూసీ రికార్డులను పరిశీలిస్తే.. సుమారు 3,500 టీఎంసీల నీళ్లు సముద్రంపాలవుతున్నది. శ్రీశైలానికి అతిపెద్ద నదులు తుంగభద్ర, భీమా.. మిగతావి చిన్నచిన్నవి ఉన్నాయి. వీటిలో శ్రీశైలాన్ని ప్రామాణికంగా తీసుకుంటాం. అందులోనూ 1200 టీఎంసీలను ప్రామాణికంగా తీసుకుంటాం. సుమారు 4,700-4,800 టీఎంసీల నీళ్లు ఇరురాష్ట్రాలు కలిపి వాడుకోవడానికి పుష్కలమైన అవకాశమున్నది. ఇంతకుముందు పొరపొచ్చాలు పెట్టుకుని, అపార్థాలు పెట్టుకుని, అవసరం లేనటువంటి కయ్యం పెట్టుకొని, కీచులాటలు పెట్టుకొని తెలుగు రాష్ట్రాల ప్రజలు నష్టపోయారు. ఇప్పుడు కీచులాటల్లేవు. కొట్లాటల్లేవ్. కేంద్రం పరిష్కరించాల్సిన దుర్గతి ఉండకూడదని నిర్ణయించాం. ఈరోజు తెలంగాణ క్యాబినెట్ కూడా ఇదే ఎండార్స్ చేసింది. నికరజలాలు, వరదజలాలను కలుపుకొంటే సుమారుగా కొంచెం అటుఇటుగా 5,000 టీఎంసీల నీళ్లను ఇరు రాష్ట్రాల్లోని ప్రతి అంగుళానికి తీసుకుపోవాలని నిర్ణయించాం. సంయుక్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. దాని ఫలితాలు రానున్న రెండు, మూడేండ్లలో చూపెడతాం. విభజన అంశాలు, రోడ్డు రవాణా ఒప్పందాలు.. మోటర్ పర్మిట్స్.. ఇలా పరస్పరం సహకరించుకొనేలా.. ప్రతి అంశంలో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ముందుకెళ్లాలని నిర్ణయించాం. యావత్ ప్రజలకు శుభం జరగాలని నిర్ణయించాం.

### డైరెక్టర్ ఎన్ శంకర్‌కు 5 ఎకరాలు

తెలంగాణకు చెందిన డైరెక్టర్ ఎన్ శంకర్ స్టూడియో కట్టాలని కోరుతున్నారు. అతనికి శంకర్‌పల్లి సమీపంలోని మోకిల పరిసర ప్రాంతంలో ఎకరానికి రూ.5 లక్షల చొప్పున 5 ఎకరాలు కేటాయించాం. శంకర్ తెలంగాణ ఉద్యమంలో పెద్ద భాగస్వామి. అందుకే ఆ స్థలం కేటాయించాం. శారదాపీఠం ట్రస్టు వాళ్లు కూడా చాలా రోజుల నుంచి కోరుతున్నారు. వారికి కూడా రెండు ఎకరాలు కేటాయించాం. సంస్కృత పాఠశాల అందులో పెడుతామన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ ఆఫీసుల నిర్మాణం కోసం 30 జిల్లాల్లో స్థలాలు కేటాయించడం జరిగింది. వరంగల్ రూరల్‌లో మాత్రం పెండింగ్‌లో ఉంది. అక్కడి మంత్రి, ఎమ్మెల్యే, ఇతర నాయకులు మార్పు చేద్దామంటున్నారు. ఖమ్మంలో కట్టడం పూర్తయింది. సిటీలో ఒకటి పెండింగ్‌లో ఉంది. స్థలాలు వెతుకుతున్నారు.

### తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం గవర్నర్ నరసింహన్ ఆధ్వర్యంలో జరుగుతుంది. ఇరు రాష్ట్రాల సీఎంలు ముఖ్య అతిథులుగా వస్తున్నారు. వారితోపాటు కొందరు మంత్రులు వస్తున్నారు. మంత్రి ఈటల రాజేందర్ మేడిగడ్డ, కన్నెపల్లి ప్రాంతంలో జరిగే కార్యక్రమాలు సమన్వయపరుస్తారు. మొత్తం 5 స్టేషన్లు ఉన్నాయి. ప్రతిచోటా ఒకరు ఉండేలా ఐదుగురు మంత్రులను పెట్టాం. వారు టెంకాయ కొట్టి పూజలుచేస్తారు. ప్రధాన బరాజ్ మేడిగడ్డవద్ద హోమం చేస్తున్నాం. గతంలో ఇక్కడే శంకుస్థాపన చేసింది. భగవంతుడి పేరు పెట్టుకొని చేశాం కాబట్టి నిరాటంకంగా జరిగింది. మొదటి పంప్‌హౌస్ అయిన కన్నెపల్లి దగ్గర పూజచేస్తాం. అనంతరం లంచ్‌చేసి, అతిథులను సత్కరిస్తాం. ఉదయం 8 గంటలకు హోమం ప్రారంభమై పదిన్నరవరకు ముగుస్తుంది. తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు. ప్రాజెక్టు పూర్తవటం సంతోషకరం. దుష్టశక్తులు, దుష్టపన్నాగాలను లెక్కచేయకుండా ధైర్యంగా పనిచేశాం. ఇందులో గొప్ప కార్యక్రమం ఏమిటంటే ఒక 20 బ్యాంకులు కన్సార్టియం పెట్టి మనకు సాయం చేశాయి. వాళ్లందరినీ పిలిచాం. నాలుగు హెలికాప్టర్లు ప్రభుత్వం తరుపున ఏర్పాటుచేస్తున్నాం. ఏపీ సీఎం వాళ్ల హెలికాప్టర్‌లోనే వస్తారు. మనం ఏర్పాటుచేసిన నాలుగింటిలో ఒకటి మహారాష్ట్ర సీఎంకు, గవర్నర్, బ్యాంకర్లకు, మనకు వినియోగిస్తున్నాం. ముందు జాగ్రత్తకోసం ఆరు హెలిపాడ్లు ఏర్పాటు చేశాం. కొన్ని పార్టీల వాళ్లు అవాకులు చెవాకులు మాట్లాడుతున్నరు. వాళ్లు కట్టినోళ్లు కాదు చేసినోళ్లుకాదు. పిచ్చి పిచ్చి మాట్లాడుతరు. నాయకులు అని అనుకునేటోళ్లకు విజ్ఞత ఉండాలి. పొరుగు రాష్ట్రాల సహకారంతో అద్భుతమైన ప్రాజెక్టు నిర్మాణం జరిపి ప్రారంభిస్తుంటే దానికి కూడా పిచ్చి మాటలు మాట్లాడుతరు. వాటిని మేం పరిశీలనలో కూడా తీసుకోం. ఒకాయనైతే మసిబూసి మారేడుకాయ చేసేందుకు ప్రయత్నిస్తున్నం అంటడు. ఆయన ఎన్నడైనా ప్రభుత్వంలో పనిచేశాడో లేదో. అంత అసహనం పనికిరాదు. ప్రజలు ఎక్కడ ఎవరికి అధికారం ఇవ్వాలో ఇస్తరు. టీఆర్‌ఎస్‌కు పాలించమని సంపూర్ణ మెజార్టీతో అధికారం ఇచ్చారు. మేము అలాగే చేస్తం. భవిష్యత్‌లో ప్రజలే తీర్పు చెప్తారు.

### సొంత నిధులతో కట్టాం

గొప్ప విషయం ఏమిటంటే ప్రాజెక్టుకు కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మొత్తం సెల్ఫ్ ఫండింగ్. సొంత నిధులు మనవి. బ్యాంకులు ఇతర మార్గాలద్వారా సేకరించాం. ఒక కొత్త రాష్ట్రం ఇంత పెద్ద మొత్తంలో నిధులు సేకరించడం మామూలు విషయం కాదు. ఎందుకంటే లక్షా 90 ప్రశ్నలు అడుగుతారు. కమర్షియల్ బ్యాంకులు అంత సులువుగా డబ్బు ఇవ్వవు. బోర్డులో నిర్ణయించి ఇస్తారు. వాళ్లను అందుకే ఒకరోజు ముందు ఆహ్వానించాం. ఖర్చు ఎలా జరిగిందో వాళ్లు కూడా చూస్తారు. సాధారణంగా పదేండ్లలో కూడా కట్టలేని.. 17 సబ్‌స్టేషన్లు కట్టాం. భారీ ఎత్తున జరిగిన ప్రణాళిక ఇది. ప్రాజెక్టు ఒక రోల్ మోడల్ కాబోతున్నది.

### బిందెల ప్రదర్శన.. బంద్ అయ్యింది..

విద్యుత్ బాగు చేస్తాం అన్నం, చేశాం. అన్ని సెక్టార్లకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా




చేసే ఏకైక రాష్ట్రం తెలంగాణ. మంచి నీటి సమస్య లేదు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు బిందెల ప్రదర్శన బంద్ అయ్యిందని చెప్పాను. అది నిజం సమస్య ఎక్కడా లేదు. ప్రతిపక్షాలకు నచ్చకపోవచ్చు. వాళ్ల ఖర్మ నేనేం చేయలేను. జూలై చివరి వరకు వంద శాతం పూర్తవుతుంది. సీతారామ దేవాదుల కూడా కంప్లీట్ అవుతున్నది. ఈ ఫైనాన్షియల్ ఇయర్ ఎండింగ్ వరకే పూర్తి చేసే ఆలోచన చేస్తున్నాం. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పరుగులు పెట్టిస్తం. తప్పకుండా కోటి పై చిలుకు ఎకరాలకు ఇరిగేషన్ మిషన్‌ను పూర్తి చేస్తం.

### మోదీని మొదట విమర్శించింది నేనే

ఎన్డీఏలో మేం భాగం కాదు. నేను ఫెడరల్ ఫ్రంట్‌ను ప్రతిపాదించాను. ఇప్పటికీ నేను కట్టుబడి ఉన్నాను. ఇందులో తప్పేముంది? రాష్ట్రం కేంద్రం మధ్య రాజ్యాంగపరమైన సంబంధాలు ఏ విధంగా కొనసాగుతాయో కొనిసాగిస్తాం. అక్కడ ప్రజలు మోదీగారికి అవకాశమిచ్చారు. ఆయన చేయాల్సింది ఆయనచేస్తారు..ఇక్కడ మాకు అవకాశమిచ్చారు. మేం చేయాల్సింది మేం చేస్తాం. దీనిపై పెద్ద కల్పనలెందుకు? మోదీ గారు ప్రధాని అయిన తర్వాత అతికఠినంగా నిందించిన వ్యక్తిని నేను. మీరు మర్చిపోతే.. నేను మర్చిపోతానా? ఏడు మండలాలు గుంజుకున్నపుడు ఆయన ఫాసిస్టు ప్రధానమంత్రి అన్నాను. ఇది రికార్డుల్లో ఉన్నది. రాష్ట్రపతి ఎన్నికను సమర్థించాం. అంశాల వారీగా ఇష్టమైన చోట, నచ్చినచోట మద్దతిచ్చాం. నచ్చనిచోట వ్యతిరేకించాం. ఇప్పుడు సైతం అదే సంబంధాలు కొనసాగుతాయి. కేంద్ర నుంచి ఒక్క రూపాయి రాష్ట్రానికి అదనంగా రాలేదు. ఇదే విషయంలో అమిత్‌షా తప్పుడు లెక్కలు చెపితే.. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాను. ప్రతి రూపాయి రికార్డుల్లో ఉంటుంది. ప్రతి రూపాయిలెక్క కేంద్రం దగ్గర ఉంటుంది. రాష్ట్రం దగ్గర ఉంటుంది. కాగ్ ద్వారా ఆడిట్ ఉంటుంది. నీతి ఆయోగ్ మిషన్ భగీరథకు, మిషన్ కాకతీయకు కలిపి 24,000 కోట్లు ఇవ్వాలని చెపితే. 24 రూపాయలు సైతం ఇవ్వలేదు. విభజనచట్టం ప్రకారం బీఆర్జీఎఫ్ రూ.450 కోట్లు ఇవ్వాల్సింది ఇవ్వలేదు. నాలుగేండ్లు ఇచ్చి ఓ ఏడాది ఇవ్వలేదు. ఇది రికార్డుల్లో ఉంది. రుణమాఫీ సహా ఇతరత్రమైనవి మాకు మేం చేసుకోగలం. మాకు వర్రీ లేదు. రాజ్యాంగబద్ధంగా మా డిమాండ్లు ముందుంచుతాం. ఇస్తే సంతోషంగా స్వీకరిస్తాం. ఇవ్వకపోతే ముందుకు సాగుతాం. నీటి వివాదాల విషయంలో రెండు పార్టీలు వైఫల్యం చెందాయనే విషయాన్ని నేను ప్రస్తావించాను. 2004లో ఏర్పాటైన బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఇప్పటికీ 15 సంవత్సరాలు గడిచాయి.. హరి లేదు..శివ లేదు. ట్రిబ్యునల్ తీర్పుకే 15 ఏండ్లు...రెండు దశాబ్దాలు అయితే...తీర్పు ఎప్పుడు రావాలి? ప్రాజెక్టు ఎప్పుడు కట్టాలి? ఏపీ సీఎంకు అదే చెప్పాను. ఢిల్లీ వద్దు.. ఎవరినీ అడిగే అవసరం వద్దు. ట్రిబ్యునళ్లు లేవు.. కోర్టులు లేవు. మనిద్దరం ఒక మాట అనుకుంటే పరిష్కారమవుతుంది. ప్రాజెక్టులు మొదలుపెట్టుకోవచ్చు అని చెప్పాను. దాన్ని వారు సంతోషంగా స్వాగతించారు. మహారాష్ట్ర సీఎం ఓ అడుగు ముందుకు వేసి ఓ మాట అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి మా పార్టీకి చెందినవారే. రాష్ట్రాలమధ్య ఉన్న వివిధ తగాదాలను ఆయన తెంపుతలేడు. దీంతోటి నేను తెలంగాణకుపోయి నేర్చుకో అని చెప్పాను. తెలంగాణ సీఎం వేరే పార్టీ అతను అయినప్పటికీ సామరస్యపూర్వకంగా చేసుకున్నాను అని చెప్పారు. ఇది మా రికార్డు. తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణంలో అహోరాత్రులు నేనే పనిచేశాను. అడుగడుగునా నాకు తెలుసు నేనేం చేశానో. ఇప్పుడు కూడా చేస్తాను. ఎవరికైనా అనుమానాలుంటే..మేమేం చేయాలి? ఏం తెలియని సన్నాసులు ఉంటరు వాళ్లకు ఏం చెప్తం? తెలియక పిచ్చిమాటలు.. చేసిన మొకాలు కావు.. తెలియదు. కాళేశ్వరంలో మనం తీసుకుంటున్నది 90 మీటర్ల బెడ్‌లెవల్. తొలి దశ లిఫ్ట్ ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వస్తయి. 148 మీటర్లు అది. 90 నుంచి 148 తీసుకోవడంతో 75 టీఎంసీల నీళ్లు వినియోగంలోకి వస్తునాయి.

గూడెం లిఫ్ట్, ఎన్టీపీసీ, నూతనంగా వచ్చిన ఎఫ్సీఐ, హైదరాబాద్ నగరానికి ఇచ్చే పది టీఎంసీలు కావచ్చు ఇవంతా ఎల్లంపల్లి నుంచి వస్తాయి. రెండోదశలో 148- 318 మీటర్ల వరకు రావడంతో మిడ్, లోయర్ మానేరు, ఎస్సారెస్పీ, గౌడవెల్లి, సిరిసిల్ల మలక్‌పేట్ ఇవన్నీ కలుపుకొని 25 లక్షల ఎకరాలు పారుతుంది. 100 మీటర్ల నుంచి 600 మీటర్లు అనుకుంటున్నరు. ఇది నేరుగా కాదు. దశలు. ప్రాధాన్యతలు మారుతాయి. తెలంగాణ రాష్ట్రానికి ప్రకృతి, దేవుడు నీళ్లు అక్కడ ఇచ్చారు. కాబట్టి నీటిని లిఫ్ట్ చేయాల్సిందే. భగీరథ వందశాతం లిఫ్టే. ఇది విజయవంతమయింది. ప్రగతిభవన్ వద్ద కొందరు పనికిమాలిన వాళ్ల ధర్నాలు అవసరం లేదు. రాజకీయ ప్రయోజనాల కోసం ధర్నాలు ఉంటాయి. టీఆర్టీ సమస్య పరిష్కారమయింది. అపాయింట్‌మెంట్ ఆర్డర్ అయింది. ఆయనెవరో పది మందిని తీసుకువస్తా అంటే ఎలా? సమస్య ఉంటే పరిష్కరించాల్సింది మేం. ఐదేండ్లు ఉంటాం. పరిష్కరిస్తాం అని గతంలో కూడా చెప్పాం. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వ్యాఖ్యలు తగునా? రాష్ట్రంలో నేరాలు తగ్గాయనే విషయాన్ని సాక్షాత్తు కేంద్ర హోంశాఖ చెప్తుంటే ఉగ్రవాద అడ్డా అని బాధ్యతగల వ్యక్తులు మాట్లాడచ్చా? జనం నవ్వుకుంటున్నారు. ఐదేండ్లలో టెర్రరిస్ట్ దాడులు లేవు. వేరే రాష్ట్రాల వలే ఇబ్బందులు లేవు. రాష్ట్రంలో అంతా ప్రశాంతంగా ఉన్నది. దేశంలో ఏ రాష్ట్రం ఇట్ల లేని సమయంలో ఇలాంటి వ్యాఖ్యలను చూసి జనాలు నవ్వుకుంటున్నారు.' అని సీఎం కేసీఆర్ అన్నారు.



## పంచాయతీ వ్యవస్థ పటిష్ఠం

కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని పటిష్ఠంగా అమలుచేస్తం. పంచాయతీరాజ్ వ్యవస్థకు ఏ అధికారాలు అప్పగించాలో క్యాబినెట్‌లో చర్చించాం. కొత్తగా యువకులు, చదువుకున్నవారు, ఉత్సాహవంతులు ఎందరో స్థానిక సంస్థల్లో గెలిచారు. ఇప్పుడు పంచాయతీరాజ్ వ్యవస్థను క్రియాశీలం చేయాలనుకొంటున్నాం.. హరితహారం, నరేగావంటి పథకాలతోపాటు వాళ్లకు ఇంకేం అప్పగించవచ్చనేవి ఆలోచించాం. ఇవ్వాల్సిన అధికారాలు ఇచ్చి, అవసరమైన నిధులను ఇచ్చి క్రియాశీలంగా పనిచేయించాలని క్యాబినెట్‌లో సూత్రప్రాయంగా చర్చ జరిగింది. రాబోయే కొద్ది రోజుల్లో మరోసారి చర్చించి, కమిటీ వేసుకొని అమల్లోకి తెస్తం.





# శాసనసభకూ కొత్త భవనం

మొదటిపేజీ తరువాయి...

నిర్మాణం ఉండాలని మంత్రిమండలి సమావేశం తీర్మానించింది. ఈ భవనంలో సెంట్రల్ హాల్, కౌన్సిల్ హాల్, అసెంబ్లీ హాల్‌ను నిర్మించనున్నారు. ప్రస్తుత శాసన సభ భవనాన్ని వారసత్వ కట్టడంగా గుర్తించాలని నిర్ణయించారు. క్యాబినెట్ భేటీలో మహమూద్ అలీ, ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. మంత్రిమండలి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన సీఎం కేసీఆర్.. అసెంబ్లీ, సెక్రటేరియట్ నిర్మాణాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

'ఏపీలో ప్రభుత్వం మారడం మూలాన సెక్రటేరియట్, శాసనసభ భవనాల అప్పగింత పూర్తయింది. రేపు (బుధవారం)అధికారికంగా అప్పగిస్తారు. ఈ రెండు భవనాలు ఖాళీ అయిన దరిమిలా కచ్చితంగా తెలంగాణకు సెక్రటేరియట్ భవనాన్ని, అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలని నిర్ణయానికొచ్చాం. గతంలో ఏపీ మొండికేయడం వల్ల ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టిసారించాం. అందుకే, బైసన్‌పోలో గ్రౌండ్ కావాలని కేంద్రాన్ని అడిగాం. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ముందుకు రావడంతో ఇక్కడే సెక్రటేరియట్ నిర్మించాలని నిర్ణయించాం. 5 నుంచి 6 లక్షల ఎస్‌ఎఫ్‌టీ కడితే సరిపోతుందనే నిర్ణయానికొచ్చాం. ధరను పరిశీలిస్తే.. మంచి వరల్డ్ క్లాస్ ఫర్నిచర్‌తో కట్టుకున్నా.. అత్యంత మోడ్రన్‌గా కట్టుకుంటే కూడా.. రూ.400 కోట్లు ఖర్చు అవుతుందని అనుకుంటున్నాం. అసెంబ్లీ భవనం కూడా వంద కోట్లలో కట్టొచ్చని నిర్ణయించాం. పార్లమెంట్ తరహాలో సెంట్రల్ హాల్, అసెంబ్లీ హాల్, కౌన్సిల్‌హాల్ వంటివి ఇందులో ఉంటాయి. పార్లమెంట్ తరహాలోనే వసతులుంటాయి. సెపరేట్ హాల్స్ నిర్మిస్తాం. ఎర్రమంజిల్‌లో ఎలివేటెడ్ తరహాలో ఉన్న 17ఎకరాల భవనంలో కొత్త అసెంబ్లీ కడతాం. ఇప్పుడున్న అసెంబ్లీ భవనం హెరిటేజ్ బిల్డింగ్‌లా ఉంటుంది. దాన్ని కాపాడే ప్రయత్నంచేస్తాం. ప్రస్తుతమున్న అసెంబ్లీ ఫ్రంట్ ఎలివేషన్ తరహాలోనే కొత్త అసెంబ్లీ భవనం ఎలివేషన్ ఉంటుంది. ఇక సెక్రటేరియట్‌లో కొన్ని 50, 60 ఏండ్ల క్రితం కట్టిన బిల్డింగులున్నాయి. ఆ తర్వాత కట్టినవీ ఉన్నయ్. అందుకే, మొత్తం కూల్చి కట్టాలా? లేక కొన్ని అలాగే ఉంచి వాడుకోవాలా? అనే విషయాన్ని నిర్ణయిస్తాం. మనం సెక్రటేరియట్ కడుతున్నామని తెలుసుకొని దేశవ్యాప్తంగా ఆర్కిటెక్టులు డిజైన్లు పంపిస్తున్నారు. వాటిలో ఒకటి ఇదిగో ఇలా ఒక తమిళ ఆర్కిటెక్ట్ పంపించారు (అని ఎలివేషన్ చూపించారు). బిల్డింగ్ ఆల్‌మోస్ట్ ఇలా ఉంటే ఎంత బాగుంటుంది? ఒకటే భవనం అటూ ఇటూగా ఉంటుంది. ఈస్ట్ ఫేసింగ్‌లో ఉంటుంది. ముందంతా ఖాళీగా ఉంటుంది. అతిపెద్ద లాన్లు, అద్భుతమైన ఫౌంటెయిన్లు ఉంటాయి. హఫీజ్ కాంట్రాక్టర్ కూడా మంచి డిజైన్ పంపించాడు. ఇవే రెండు, మూడున్నాయి. భూమి పూజ మాత్రం ఈ 27 నాడు చేస్తం. ఆ తర్వాత దసరా రోజు వరకూ మంచి రోజుల్లేవు. పూజ చేసుకుంటే ఏ టైమ్‌లో అంటే ఆ టైమ్‌లో తీసుకోవచ్చు. ఈలోపు ఆర్‌అండ్‌బీ మంత్రి అధ్యక్షతన, ముగ్గురు సభ్యులతో కలిపి ఒక ఉపసంఘం వేస్తాం. మొత్తం కూలగొట్టి కట్టాలా? లేక కొన్ని ఉంచుకుని, ఇంటిగ్రేట్ చేసుకుని కట్టాలా? అనేది ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. దీనివల్ల పని కూడా ఫాస్ట్‌గా జరుగుతుంది. మొత్తం సెక్రటేరియట్‌ను తరలించాలా? లేక పాక్షికంగానా? అనేది క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం మీద ఆధారపడుతుంది' అని సీఎం కేసీఆర్ తెలిపారు.

## నేను అచీవర్‌ని



ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగే అఖిలపక్ష సమావేశానికి మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను పంపుతున్నాను. నేను కాళేశ్వరం పనుల్లో తలమునకలై ఉన్నాను. ఈ సమావేశానికి హాజరవడం గురించి ప్రధాని కార్యాలయాన్ని సంప్రదించాం. వారు వర్కింగ్ ప్రెసిడెంట్‌ను పంపండన్నారు. పంపుతున్నా. ప్రధానిని కాళేశ్వరం ప్రాజెక్టుకు పిలవలేదనడం సరికాదు. ప్రతిదానికి పిలవము కదా? గతంలో మిషన్ భగీరథకు ఆహ్వానించాం. అన్నింటికీ పిలవాలా? నేను అచీవర్‌ను. నీతి ఆయోగ్‌కు నేను హాజరైతే ఒక వార్త. కాకపోతే. ఒక వార్త. కొందరు సిల్లీ వ్యక్తులు, పనికిమాలిన వారు ఊహించుకొని చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంగా మా పద్ధతిలో మేం ఉన్నాం. రాజకీయంగా కూడా మేం ఉండే రీతిలో మేం ఉంటాం. అసెంబ్లీలో బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిచాం. ఆ తర్వాత స్థానిక సంస్థల్లో క్లీన్‌స్వీప్ చేశాం. పార్లమెంటులో మెజార్టీ సీట్లు కైవసం చేశాం. ఇవన్నీ చాలామందికి నచ్చవు. దానికి మేం ఏం చేస్తాం? వారు హుందాగా ఉండాల్సిన అవసరం ఉంది.

## ఉద్యోగులకు ప్యాకేజీ

ఇంతకాలం ఎన్నికల కోడ్ ఉన్నది. ఉద్యోగులు ఎదురుచూస్తున్నరు. తప్పకుండా వాళ్లకు చేయాల్సి ఉంటుంది. కొద్దిరోజుల్లోనే మరొక సమావేశం పెడతాం. ఎన్నికల సందర్భంలో వాగ్దానం చేశాం. 61 ఏండ్లకు రిటైర్‌మెంట్ వయసు పెంచుతామన్నం. టీఆర్‌ఎస్ వాగ్దానంచేస్తే ఖచ్చితంగా నెరవేర్చుతుంది. అందరికీ ఆ విషయం తెలుసు. ఎప్పట్నుంచి పెంచాలి, ఎలా పెంచాలని ఆలోచిస్తాం. ఉద్యోగ సంఘాలతో కూడా చర్చలు జరుపుతం. పీఆర్సీ కొంత పెంచుతం, రిటైర్మెంట్ ఏజ్ పెంచుతం. మొత్తం కలిపి ప్యాకేజీ ఇవ్వాలని అనుకుంటున్నం. ఆర్థిక పరిమితులను కూడా వాళ్లకు విడమర్చి చెప్పి సామరస్యపూర్వకమైన ధోరణితో పోవాలన్న ఆలోచనతో ఉన్నం.

## సీఎం ప్రకటనపై ఉద్యోగసంఘాల విశ్వాసం

- మంత్రివర్గంలో సానుకూల నిర్ణయంపై నేతల హర్షం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను సానుకూల దృక్పథంతో పరిశీలించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించడంపై పలు ఉద్యోగసంఘాల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రిపై మొదట్నుంచీ అపార నమ్మకం ఉన్నదని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సెక్రటరీ జనరల్ మమత పేర్కొన్నారు. తాము ముందుగా భావించినట్టే మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలను ప్రత్యేకంగా చర్చించడం హర్షణీయమన్నారు. ఉద్యోగుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న సీఎం కేసీఆర్ త్వరలో సానుకూల ప్రకటన చేస్తారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు.

**ఉద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహన**

తెలంగాణ ఉద్యమ రథసారథిగా ప్రజలతో మమేకమై, ఉద్యోగులతో కలిసి పోరాడిన ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తమకు పూర్తి విశ్వాసం ఉన్నదని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పద్మాచారి, ప్రధానకార్యదర్శి పవన్‌కుమార్ చెప్పారు. ఉద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న సీఎం కేసీఆర్.. ఐఆర్, పీఆర్సీ పెంపు తదితర సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకుంటారనే నమ్మకం ఉన్నది కాబట్టే రాష్ట్రంలో ఉద్యోగులు ఎక్కడా ఆందోళనలకు దిగలేదని స్పష్టంచేశారు. రాష్ట్ర వాణిజ్యపన్నుల ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు టీ వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు కేఎం వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి స్వర్ణకుమార్, రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, కార్యదర్శి గోన విష్ణువర్ధన్‌రావు, తెలంగాణ ప్రభుత్వఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దసాని వెంకటరమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరాచారి హర్షం వ్యక్తం చేశారు.

## ముహూర్తం




సూర్యోదయం: 5.46 గంటలకు



సూర్యాస్తమయం: 6.49 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం, విదియ మధ్యాహ్నం 3.36 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: పూర్వాషాఢ మధ్యాహ్నం 1.30 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, అమృతఘడియలు: ఉదయం 8.22 నుంచి 9.58 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.18 నుంచి 1.55 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.51 నుంచి మధ్యాహ్నం 12.44 వరకు, వర్జ్యం: రాత్రి 10.13 నుంచి 11.49 వరకు.

## లోకం పోకడ





పైళ్లై ఇన్నేళ్లయినా స్విస్ బ్యాంకు నుంచి ఒక్కసారైనా మీ పేరు వచ్చిందే లేదు, పాడు లేదు.. పక్కింటామె మొగుడి పేరుందట తెల్సా?

# గడికింత భూమి మాయం!

## అసలైన వారసులకు హక్కులేకుండా చేశారు
## చొప్పదండి రెవెన్యూ అధికారుల లీలలు
## 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితులు

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ**

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్నకొండకు చెందిన పిల్లలమర్రి చంద్రమౌళికి సర్వేనంబర్ 920లో 17.25 ఎకరాల భూమి ఉన్నది. 1988-89 వరకు రెవెన్యూ రికార్డుల్లో ఇతని పేరిట మొత్తం విస్తీర్ణం వచ్చింది. ఇతనికి సత్తయ్య, బక్కయ్య అనే ఇద్దరు కుమారులున్నారు. అయితే చంద్రమౌళి తమ్ముడు కములయ్యకు సంతానం లేకపోవడంతో అతనికి చిన్నకుమారుడైన బక్కయ్యను దత్తత ఇచ్చారు. తమ్ముడి ఆస్తి చిన్న కుమారునికి, తన ఆస్తి పెద్దకుమారునికి అనుకుని సర్దుబాటు చేసుకున్నారు. సత్తయ్యకు బాపు ఒక్కడే కుమారుడు. కాలక్రమేణా వీరంతా మరణించారు. ఇపుడు చంద్రమౌళి ఆస్తికి వారసులుగా బాపు భార్య పిల్లలమర్రి లక్ష్మి, ఆమె సంతానమైన మారుతి, నరేశ్ ఉన్నారు. తాత ఆస్తి తమకే దక్కాలని భావించిన వీరిద్దరు బాపు బతికి ఉన్నప్పుడే తమ పేరిట విరాసత్ చేయించుకునేందుకు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. పైపెచ్చు రెవెన్యూ అధికారులు బాపు పేరిట ఉన్న భూమిని చనిపోయిన బక్కయ్య పేరిట ఏటా కొంత చొప్పున క్రమంగా మార్చుకుంటూ వచ్చారు. 1988-89లో చంద్రమౌళి పేరిట ఉన్న 17.25 ఎకరాల భూమి లో 5.02 ఎకరాలను 1996-97 నాటికి బక్కయ్య పేరిట మార్చిన రెవెన్యూ అధికారులు.. 1998-99లో చంద్రమౌళి పేరిట కేవలం 1.10 ఎకరాలు మాత్రమే రాశారు. అప్పటికి బక్కయ్య పేరిట 5.02 ఎకరాలు ఉన్నట్టు చూపిన అధికారులు మిగతా భూమిని ఎవరి పేరిటా రాయలేదు. ఇక 2003-04 నుంచి 2018-19 వరకు చంద్రమౌళి పేరిట 1.10 ఎకరాలు, బక్కయ్య పేరిట 15.02 ఎకరాలు ఉన్నట్టు రాస్తూ వస్తున్నారు. విచిత్రం ఏమిటంటే చంద్రమౌళి తండ్రి పేరును నర్సయ్యగా, బక్కయ్య తండ్రి పేరును కములయ్యగా పహాణీలో రాస్తున్నారు. 1988-89 నుంచి ఇప్పటివరకు ఈ భూమి కాస్తు కాలంలో మాత్రం బాపు పేరిటనే వస్తున్నది.



పిల్లలమర్రి లక్ష్మి

### అభ్యంతరం ఎందుకో?

తమకు చెందాల్సిన భూమిని బక్కయ్య పేరిట నమోదు చేసుకుంటూ వచ్చిన రెవెన్యూ అధికారులు.. కాస్తు కాలమ్‌లో మాత్రం తన భర్త పేరునే చూపుతున్నారని, అలాంటపుడు ఆ భూమి కబ్జాలో ఉన్నట్టుగా పరిగణించి తనపేరిట రాయడంలో రెవెన్యూ అధికారులకు అభ్యంతరం ఏమిటని బాపు భార్య లక్ష్మి ప్రశ్నిస్తున్నారు. అదే సర్వేనంబర్ 921లో చంద్రమౌళి పేరిట ఉన్న ఎకరా భూమిని తనపేరిట పట్టాచేసి ఇచ్చిన అధికారులు.. సర్వేనంబర్ 920లో ఉన్న భూమిని పట్టా చేయడంలో తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నారని లక్ష్మి, ఆమె కుమారులు మారుతి, నరేశ్ వాపోతున్నారు. తమ ముత్తాత చంద్రమౌళికి, తాత సత్తయ్యకు తాము మాత్రమే వారసులమని, ఇదే భూమి విషయమై ఇతరులతో తగాదా వచ్చినపుడు కోర్టు కూడా స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, ఈ తీర్పు ప్రతిని కూడా సమర్పించినప్పటికీ రెవెన్యూ అధికారులు కనికరించడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చంద్రమౌళి పేరిట ఉన్న ఆస్తిలో బక్కయ్య వారసులకు ఎలాంటి వాటా రాదని వారు చెప్తున్నారు. బక్కయ్య వారసులు చంద్రమౌళి పేరిట ఉన్న ఇతర భూములను కూడా పంచుకున్నారని, ఇది పూర్తిగా తమ వాటా కిందికి వస్తుందని లక్ష్మి ఆమె కొడుకులు పేర్కొంటున్నారు. ఇప్పటికీ ఇదే భూమిలో పంటలు సాగుచేస్తున్న తమకు బక్కయ్య వారసుల నుంచి ఎలాంటి ఇబ్బంది లేదని, అధికారులు కావాలనే తమను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని లక్ష్మి వాపోతున్నారు. ఇప్పటికైనా తమ భూమిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## బానోత్ బాల్య భూమిని సర్వే చేయిస్తాం

- అర్హత ఉంటే పాస్‌బుక్ జారీచేస్తాం
- 'పట్టా పాస్‌పుస్తకం ఇప్పించండి..' అనే కథనంపై స్పందించి.. విచారణ చేపట్టిన చెన్నారావుపేట తాసిల్దార్

**చెన్నారావుపేట:** వరంగల్ రూరల్ జిల్లా చెన్నారావుపేట గ్రామ శివారు ఈర్యతండాకు చెందిన రైతు బానోతు బాల్యకు సంబంధించిన భూమిని సర్వే చేయించి, రెండ్రోజుల్లో నివేదిక సమర్పిస్తానని తాసిల్దార్ సదానందం చెప్పారు. 'పట్టా పాస్‌పుస్తకం ఇప్పించండి..' అనే శీర్షికతో ఆదివారం 'ధర్మగంట'లో ప్రచురితమైన కథనంపై స్పందించిన తాసిల్దార్ విచారణ చేపట్టారు. తమ విచారణలో బానోతు బాల్య చెన్నారావుపేట శివారులోని 4.11 ఎకరాల భూమిని 33 ఏండ్ల నుంచి సాగుచేస్తున్నట్టు తేలిందన్నారు.బాల్య ఆ భూమిని పలువురు రైతుల నుంచి కొనుగోలుచేశాడని, పహాణీ రికార్డుల్లో నమోదు చేయించుకోలేదని వివరించారు. అంతేకాకుండా మోఖాపై ఉన్న భూమికి, అర్జీదారు సమర్పించిన సాదాబైనామా కొనుగోలు కాగితాల్లోని లెక్కలకు తేడా ఉన్నదని చెప్పారు. సదరు భూములకు సంబంధించిన కాగితాలు కూడా సరిగాలేవని.. ఈ భూమిని సర్వే చేయించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. సర్వే ప్రకారం అర్హత ఉంటే వెంటనే రైతుకు పాస్‌పుస్తకంజారీచేస్తామని తాసిల్దార్ చెప్పారు.



తాసిల్దార్ సదానందం

## వీఆర్వో నిర్లక్ష్యం.. రైతుబీమాకు నోచుకోని దైన్యం

- మహబూబాబాద్ జిల్లా శ్రీరామగిరిలో గుండెపోటుతో రైతు మృతి

**నెల్లికుదురు:** వీఆర్వో నిర్లక్ష్యం ఓ రైతు కుటుంబానికి శాపంగా మారింది. గుండెపోటుతో మృతి చెందిన ఆ రైతు కుటుంబానికి రైతుబీమా పథకం కింద అందాల్సిన రూ.ఐదు లక్షల సాయం అందకుండాపోతున్నది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరికి చెందిన నిరుపేద రైతు గుండెపాక వెంకన్న (38) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయనకు తన తాత ఆరెపల్లి సాయిలు ద్వారా సర్వే నంబర్ 332/బి/1లోని 26 గుంటల భూమి సంక్రమించింది. తన తాత మరణానంతరం ఈ భూమిని తన పేరిట మార్చాలంటూ 2017 భూరికార్డుల ప్రక్షాళన సమయంలో వెంకన్న రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీనిని పరిశీలించిన అప్పటి తాసిల్దార్.. విరాసత్‌కు అర్జీదారుడు అర్హుడేనని సర్టిఫైచేశారు. ఈ మేరకు రికార్డులను ఆన్‌లైన్ చేయాలని వీఆర్వోను ఆదేశించారు. కానీ వీఆర్వో సమ్మయ్య నిర్లక్ష్యంగా వ్యవహరించి.. ఇప్పటివరకూ ఆన్‌లైన్ చేయలేదు. దీంతో వెంకన్నకు పాస్‌పుస్తకం రాలేదు. రైతుబీమా వర్తించలేదు. రైతు వెంకన్న మృతివార్త తెలిసిన తాసిల్దార్ పున్నంచందర్ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అప్పటి తాసిల్దార్ ఆదేశించినప్పటికీ, వెంకన్నకు సంబంధించిన రికార్డులను ఆన్‌లైన్ చేయకుండా.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్వో సమ్మయ్యపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తానని చెప్పారు.



గుండెపాక వెంకన్న మృతదేహాన్ని సందర్శించిన తాసిల్దార్ పున్నంచందర్

## పాస్‌బుక్ కోసం వచ్చిన రైతుపై.. మునుగోడు తాసిల్దార్ ఆగ్రహం

**మునుగోడు:** పాస్‌పుస్తకం కోసం వచ్చిన ఓ రైతు పట్ల దురుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడారు నల్లగొండ జిల్లా మునుగోడు తాసిల్దార్ జ్ఞానేశ్వర్‌దేవ్. దీంతో కన్నీటి పర్యంతమైన రైతు పాశం రాంరెడ్డి తనకు పాస్‌పుస్తకం ఇవ్వకపోతే కార్యాలయం ఎదుటే ఆత్మహత్య చేసుకుంటానని బైఠాయించారు. వివిధ పనుల నిమిత్తం అక్కడికి వచ్చినవారు తాసిల్దార్ దురుసు ప్రవర్తనపై అసహనం వ్యక్తంచేశారు. మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందిన పాశం రాంరెడ్డికి 14.18 ఎకరాల భూమి ఉన్నది. దీనిని తన కుమారుడు పాశం జితేందర్‌రెడ్డి పేరిట 2016లో రిజిస్ట్రేషన్ చేయించి.. పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేశారు. కాగా రెవెన్యూ అధికారులు పాస్‌పుస్తకం ఇవ్వకుండా రెండేండ్లుగా తిప్పుకుంటున్నారు. కొద్దిరోజుల క్రితం అమెరికా నుంచి వచ్చిన జితేందర్‌రెడ్డి అధికారుల సూచన మేరకు మీసేవ కేంద్రంలో వేలిముద్రలు నమోదుచేశారు. వారం తర్వాత పాస్‌పుస్తకం ఇస్తామని తాసిల్దార్ చెప్పడంతో తిరిగి మంగళవారం పాశం రాంరెడ్డి రెవెన్యూ కార్యాలయానికి వెళ్లారు. పాస్‌పుస్తకం గురించి అడుగగానే తాసిల్దార్ ఒక్కసారిగా ఊగిపోయారు. 'పాస్‌బుక్ వచ్చేటప్పుడే వస్తుంది. మాటిమాటికి ఎందుకొస్తున్నవ్. ముందు నా చాంబర్ నుంచి బయటకువెళ్లు' అంటూ దుర్భాషలాడారు. పాస్‌పుస్తకం కోసం ఎప్పుడు వెళ్లినా తాసిల్దార్ కసురుకుంటున్నారని.. పాస్‌పుస్తకంలేని కారణంగా తమకు రైతుబంధు సాయం అందడంలేదని రాంరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై తాసిల్దార్ జ్ఞానేశ్వర్‌దేవ్‌ను ఫోన్‌లో వివరణ కోరగా బిజీగా ఉన్నానంటూ సమాధానం ఇచ్చారు.



బయటకు వెళ్లాలని రైతు పాశం రాంరెడ్డిపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న తాసిల్దార్ జ్ఞానేశ్వర్‌దేవ్

### నా భూమిని నాకు అప్పగించండి సారూ..

పెద్దమాసాన్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 258/12లో 1.10 ఎకరాల భూమిని 30 ఏండ్లుగా సాగుచేసుకుంటున్నాం. కొత్త పాస్‌బుక్‌లు రావడంతో రైతుబంధు డబ్బులు కూడా తీసుకుంటున్నాం. ఇప్పుడు అటవీశాఖ అధికారులు వచ్చి ఈ భూమి అటవీశాఖకు చెందినదని పోలీసులను పెట్టి కందకాలు తీస్తున్నారు. అన్యాయంగా ఆక్రమించుకుంటున్నారు. నాకు న్యాయంచేయాలి. నా భూమిని నాకు ఇప్పించాలని తాసిల్దార్‌కు ఫిర్యాదుచేశా.

**- మెట్టు స్వామి, రైతు, పెద్దమాసాన్‌పల్లి గ్రామం, తొగుల మండలం, సిద్దిపేట జిల్లా**



## పాస్‌పుస్తకాలు ఇచ్చేవరకు ఆఫీసులోనే నిద్రిస్తాం

### కన్నతల్లి కోసం దివ్యాంగులైన బిడ్డల పోరాటం
### తొమ్మిదేండ్లుగా తిరుగుతున్నా కనికరించని రెవెన్యూ అధికారులు

**పెద్దవంగర:** తమ తల్లి పేరిట పాస్‌పుస్తకాలు ఇచ్చేవరకు తాసిల్ ఆఫీసులోనే నిద్రపోతామని చెప్తున్నారు మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రామచంద్రు తండాకు చెందిన ఇద్దరు దివ్యాంగులు. తమ తల్లిదండ్రులు తొమ్మిదేండ్లుగా తిరిగితిరిగి విసిగిపోయారని, వ్యవసాయశాఖలో పనిచేసే తమ మేనమామ తమకు పాస్‌పుస్తకాలు రాకుండా అడ్డుపడుతున్నాడని వాపోయారు. రామచంద్రు తండాకు చెందిన జాటోతు దళపతి తన కూతురు జమునకు 35 ఏండ్ల కిందట నర్సింహులపేట మండలం ముంగిమడుగు గ్రామం లాలీతండాకు చెందిన గుగులోత్ శంకర్‌తో పెండ్లిచేశారు. వీరికి ముగ్గురు సంతానం. వీరిలో ఇద్దరు ఆడపిల్లలు దివ్యాంగులు. 2010లో దళపతి తనకున్న సర్వే నంబర్ 405లోని 1.10 ఎకరాల భూమిని జమునకు రిజిస్ట్రేషన్ చేయించారు. అప్పటి నుంచి పాస్‌పుస్తకం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితంలేదు. పాస్‌పుస్తకం లేకపోవడంతో వారికి రైతుబంధు, రైతుబీమా వర్తించడంలేదు. పాస్‌బుక్ కోసం దివ్యాంగులైన జమున ఇద్దరు కూతుళ్లు అనిత, హరిత మంగళవారం పెద్దవంగర తాసిల్ కార్యాలయానికి వచ్చారు. కానీ అధికారులు కనికరించలేదు. అయితే, మళ్లీ ఇంటికి వెళ్లడానికి బస్‌చార్జీలు లేకపోవడంతో.. ఇంటింటికీ తిరిగి బిచ్చమెత్తుకున్నారు. 'ధర్మగంట'తో తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ తాత దళపతి గిఫ్ట్‌గా ఇచ్చిన భూమిని తమ మేనమామ జాటోత్ మనోహర్ కబ్జాచేయాలని చూస్తున్నాడని, అధికారులను కూడా బెదిరిస్తూ తమకు అడ్డుపడుతున్నాడని చెప్పారు. తమ మేనమామ.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వ్యవసాయశాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తాడని వివరించారు. పెద్దవంగర వీఆర్వో వెంకన్న కావాలనే తమకు పాస్‌పుస్తకాలు జారీచేయకుండా నాన్చుతున్నారని ఆరోపించారు. తాము 20 రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని.. రోజూ తిరిగే స్థోమత తమకు లేదని.. పని అయ్యేవరకు ఇక్కడే ఉండి.. ఆఫీసులోనే నిద్రపోతామని చెప్పారు.



తమ తల్లికి చెందిన రిజిస్ట్రేషన్ పత్రాలను చూపుతున్న దివ్యాంగురాలు అనిత

## మా మాట!

### 'ధర్మగంట' మోగుతూనే ఉండాలి



'నమస్తే తెలంగాణ' 'ధర్మగంట'లో వస్తున్న కథనాలతో రెవెన్యూ అధికారుల పనితీరు క్రమంగా మారుతున్నది. అధికారుల తీరుతో భూ సమస్యలు ఎదురై ఎంతమంది ఎలా వేధింపులకు గురవుతున్నారో ప్రత్యేక కథనాలతో ప్రచురిస్తుండటం చాలా గొప్ప విషయం. దీనివల్ల అధికారులు.. రైతుల వద్దకే వెళ్లి పనులు పూర్తి చేస్తున్నారు. అదంతా ధర్మగంట పుణ్యమే. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న రెవెన్యూ ప్రక్షాళన నిర్ణయం సరైనదే. గ్రామాల్లో పేరుకుపోయిన రైతుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యే వరకు ఈ 'ధర్మగంట' మోగుతూనే ఉండాలి. రెవెన్యూ అధికారులు సోమరితనం, లంచగొండి తనం వదిలి రైతులకు సేవచేసేలా కృషిచేస్తున్న ముఖ్యమంత్రికి, 'నమస్తే తెలంగాణ' పత్రికకు ధన్యవాదాలు.

**- లింగంపెల్లి నాగరాజు, న్యాయవాది (గునుకుల కొండాపూర్, గన్నేరువరం మండలం, కరీంనగర్ జిల్లా)**

### కొత్త చట్టం తీసుకురావాల్సిందే

రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన కోసం సీఎం కేసీఆర్ కొత్త రెవెన్యూ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. రెవెన్యూలో పాతకాలపు చట్టాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైసా ఇవ్వనిదే పని జరుగడంలేదు. భూ సమస్యలన్నీ పరిష్కరించేలా కొత్త చట్టం తెస్తే స్వాగతిస్తాం. రైతులకు నష్టం జరుగకుండా రెవెన్యూ రికార్డులను సరిచేయాలి. సుంకరి నుంచి వీఆర్వో అయిన వారికి చదువు రాక, భూ లెక్కలు తెలియక, అవగాహన లేకపోవడంతో తేడాలు వస్తున్నాయి. ఒకరి పేరుకు మరొకరి పేరు రావడం, ఉన్న భూమికి తక్కువగానీ, ఎక్కువగానీ వేసి బుక్కులు అందించడంతో రైతులు ఆఫీసుల చుట్టూ తిరుగాల్సి వస్తున్నది. వెంటనే తప్పులను సరిచేసి రైతులకు మళ్లీ పాస్ బుక్కులు అందించాలి.



**- బైరి సుధాకర్, జిల్లా ఎకనామిక్స్ ఫోరం అధ్యక్షుడు, కాంట్రాక్టు అధ్యాపకుడు, హుజూరాబాద్‌టౌన్, కరీంనగర్ జిల్లా**

### అధికారుల్లో చలనం వచ్చింది



ధర్మగంటతో రెవెన్యూ అధికారుల్లో చలనం వచ్చింది. గతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వెళ్లే రైతులను అధికారులు అరిగోస పెట్టేవారు. రేపు మాపు అంటూ కాలం వెళ్లదీసేవారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనతో అధికారుల్లో బాధ్యత పెరిగితే, ధర్మగంటతో చలనం రావడంతోపాటు సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి.

**- నారి నాగేందర్, మోటకొండూర్, యాదాద్రి భువనగిరి జిల్లా**

## రిటైర్డ్ సార్జెంట్‌కు తిప్పలు


- ఆర్మీ కోటాలో అధికారులే ఇచ్చిన భూమి వివాదంలోకి
- భిన్న వాదనలు.. వేర్వేరు నివేదికలు
- అయోమయంలో ఆదిలాబాద్ జిల్లా తాంసి తాసిల్ యంత్రాంగం
- తనకు భూమి పట్టాచేయాలని రిటైర్డ్ జవాను వేడుకోలు

భారత వాయుసేనలో 18 ఏండ్లపాటు నిర్విరామ సేవలందించిన రిటైర్డ్ సార్జెంటుకు రిక్వెస్టు మేరకు బెనిఫిట్ పథకం కింద ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పాలోడి గ్రామ శివారులో ఐదెకరాల భూమిని అసైన్డ్‌చేసింది. ఆ భూమిలో రెండు బోర్లు వేయించి, చుట్టూ ట్రెంచ్ తవ్వించి గతేడాది నుంచి సాగుచేస్తున్నారు. ఉన్నట్టుండి కొందరు వచ్చి ఆ భూమి తమదేనని, ప్రభుత్వం తమకు ఇచ్చిందని ఫిర్యాదుచేశారు. గతంలో ప్రభుత్వం పలు దఫాలుగా నిరుపేదలకు భూపంపిణీ చేసింది. ఈ క్రమంలో 'ఏడో రౌండ్ భూపంపిణీ'లో ప్రభుత్వం నుంచి అసైన్డ్ పొందిన రైతులు ఈ భూమి తమదేనంటూ ఫిర్యాదుచేయడంతో రిటైర్డ్ జవానుకు పాస్‌పుస్తకాన్నివ్వడం నిలిపివేశారు. అప్పట్లో అన్నీ పరిశీలనల అనంతరమే రిటైర్డ్ జవానుకు భూమి ఇచ్చిన అధికారులు.. ఇప్పుడు అయోమయంలో పడ్డారు. పర్యవసానంగా సదరు రిటైర్డ్ సైనికుడికి తిప్పలు మొదలయ్యాయి.

**భీంపూర్:** ఆదిలాబాద్ పట్టణంలో నివాసం ఉండే లుందే అభయ్‌కుమార్ 1993లో భారత ఎయిర్‌ఫోర్స్‌లో చేరి 18 ఏండ్లు సేవ చేసి 2011లో పదవీవిరమణ పొందారు. రిటైర్డ్ ఆర్మీ జవాను కోటాలో జీవనోపాధి బెనిఫిట్ పథకం కింద తాంసి మండలం పాలోడి గ్రామ శివారులోని 150.33 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అసైన్డ్ భూమిలో నుంచి సర్వే నంబర్ 102 (పట్టా నంబర్ కాదు- పార్టిషన్ నంబర్)లో ఐదెకరాలు కేటాయిస్తూ అధికారులు ప్రొసీడింగ్ ఇచ్చారు. 12-02-2018న ల్యాండ్ రికార్డ్ సర్వేశాఖ అధికారులు అభయ్‌కుమార్‌కు కేటాయించిన భూమి పొజిషన్‌కు సంబంధించి మ్యాపులో స్థలం చూపించారు. తాంసి తాసిల్ అధికారులు సర్వేచేసి ఆ భూమిని చూపించారు. ఈ మేరకు బీ/979/2015, తేదీ 12-06-2018న ప్రొసీడింగ్‌ను మండల మెజిస్ట్రేట్ అయిన తాసిల్దార్ జారీచేశారు. దీంతో లబ్ధిదారు అభయ్‌కుమార్ ఆ భూమిలో సాగు మొదలుపెట్టారు. తర్వాత పట్టాదారు పాస్‌పుస్తకం కోసం దరఖాస్తుచేశారు. కానీ ఈ భూమి తమకు చెందినదంటూ ఇద్దరు వ్యక్తులు ఫిర్యాదుచేయడంతో ప్రస్తుతానికి పాస్‌పుస్తకం ఇవ్వలేమని అధికారులు తేల్చిచెప్పారు. దీంతో బాధితుడు ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వ అధికారులే సర్వేచేసి.. ఇచ్చిన భూమి ఇతరులది ఎలా అవుతుందన్న సందేహంతో వాస్తవ సమాచారంకోసం సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకొన్నారు. పాలోడి గ్రామానికే చెందిన ఇద్దరు రైతులు 2018, సెప్టెంబర్ 18న ఆ భూమి తమదేనంటూ తాంసి తాసిల్దార్‌కు ఫిర్యాదుచేసినట్టు తేలింది. కాస్తులోనూ ఈ రైతులు పంటలు వేసినట్టుగా పహాణీ అడంగళ్‌లో నమోదైంది. ఒకవేళ ఏడోరౌండ్ భూపంపిణీలో ఈ భూమి ముందే కేటాయింపు అయినట్టయితే.. అదే భూమిని రిటైర్డ్ జవాను కోటా కింద తనకెందుకు ఇచ్చినట్టని ప్రశ్నిస్తున్నారు.



బాధితుడు అభయ్‌కుమార్



AR/File No. A5/ 214/2017

AREA STATEMENT

VILLAGE: PALODI MANDAL: TAMSI DIST: ADILABAD

| Sy.No | Total Area Ac-Gts | Nature of the land | Requisition area in Ac-Gts | Sy.No | Plot No | [illegible] | Balance Area Ac-Gts | Remarks |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 102/1 | 150-33 | P.P | | 102/1 | 1 | - | 145-33 | Balance Area |
| | | | | | 5 | 5-00 | - | Ex Serviceman |
| | 150-33 | | | | | 5-00 | 145-33 | |

Prepared by

Dy. Inspector of Survey, Adilabad

Asst. Director, Survey & Land Records, Adilabad

ల్యాండ్ రికార్డు సర్వే అధికారులు జారీచేసిన మ్యాప్

**భూమి ప్రస్తుత పరిస్థితి**

ఏడో రౌండ్ భూపంపిణీలో భూమి పొందిన రైతులంతా వేరే పొజిషన్‌లో సాగుచేసుకుంటున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం అభయ్‌కుమార్ ఐదెకరాల్లో వానకలం పనులు పూర్తిచేసుకొని విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఫిర్యాదుదారులు ఎప్పుడూ తమ వ్యవసాయ పనులకు అడ్డురాలేదని వారి అసైన్డ్ భూముల్లో వారు సాగుచేసుకుంటున్నారని అభయ్‌కుమార్ చెప్తున్నారు. ఒకే సమయంలో భిన్నమైన వాదనలతో నివేదికలిస్తూ అధికారులు గందరగోళం చేస్తున్నారంటున్నారు. ఈ భూమిని తనకు పట్టాచేయడం కుదరదని చెప్తే, తనకు రావాల్సిన భూమికోసం మరోసారి దరఖాస్తు పెట్టుకుంటానని విన్నవించుకుంటున్నారు. ఒకవేళ వివాదం లేదనుకుంటే తనకు కేటాయించిన ఐదెకరాల భూమికి పాస్‌పుస్తకం ఇవ్వాలని కోరుతున్నారు.

### నాక్కూడా కన్ఫ్యూజ్‌గానే ఉన్నది

నిజానికి ఈ భూమి విషయంలో నాకు కూడా అయోమయంగానే ఉన్నది. ఏడో విడుత భూపంపిణీ కాలంలో నేను ఇక్కడ లేను. క్షేత్రస్థాయి పరిస్థితి అధికారులకు విన్నవించాం. పరిశీలించి చర్య తీసుకుంటారు.

**- అజయ్‌కుమార్, వీఆర్వో, పాలోడి**

### రీసర్వేచేసి అధికారులకు నివేదిస్తాం

రిటైర్డు ఆర్మీ జవానుకు ప్రభుత్వ ఆదేశాల అనుసారం భూమి కేటాయించాల్సిందే. ఏడోరౌండ్ భూపంపిణీ అనేది పాత స్టాఫ్ హయాంలో జరిగింది. కొంత అయోమయం ఉన్న విషయం వాస్తవమే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ ఎంసీతో సర్వేచేస్తున్నాం. సర్వేయర్ల కొరత ఉన్నది. సర్వేతో తాజాగా పొజిషన్‌లో ఉన్నవారు తెలిసిపోతారు. అప్పుడు నివేదిక రూపొందించి అధికారులకు ఇస్తాం. 150 ఎకరాలకుపైగా విస్తీర్ణం ఉన్న ఈ ప్రభుత్వ భూమిలో ఇంకా మిగులు భూమి ఉంటుంది. కాబట్టి అందరికీ న్యాయం జరుగుతుంది.

**- ప్రేంనివాస్, డిప్యూటీ తాసిల్దార్, తాంసి**

### న్యాయం చేస్తాం



మండల సర్వేయర్‌తో సర్వేచేయిస్తాం. వాస్తవ పరిస్థితి తెలుసుకుంటాం. ఇతర అసైన్డ్ రైతులకు ఇటు రిటైర్డ్ వాయుసేన సార్జెంట్‌కు న్యాయం జరిగేలా చూస్తాం. అసైన్డ్ లబ్ధిదారులైన రైతులు ఏటా సాగుచేస్తేనే మంచిది. అప్పుడు ఇలాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉండదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కేటాయించిన భూమికి సంబంధించి పట్టా అందించే ప్రయత్నంచేస్తాం.

**- వసంత, తాసిల్దార్, తాంసి**

# శరవేగంగా ప్రారంభోత్సవ ఏర్పాట్లు!

- మేడిగడ్డ, కన్నెపల్లి వద్ద నిరంతరం పనులు
- సిద్ధమవుతున్న హోమశాలలు, హెలిప్యాడ్లు, రహదారులు
- శిలాఫలకాల పనులూ ప్రారంభం.. గేట్ల మూసివేతతో బరాజ్‌లో నీటినిల్వ
- వెట్‌రన్‌కు పంపుహౌస్‌లోకి చేరిన నీరు.. భారీగా పోలీసు బలగాల మోహరింపు
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డీజీపీ

**జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తెలంగాణ కల్పతరువు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభోత్సవ మహాఘట్టానికి ముహూర్తం సమీపిస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్ వద్ద చకచకా ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. హోమశాలలు, హెలిప్యాడ్లు, రహదారులు, శిలాఫలకాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 21న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభానికి ముహూర్తం ఖరారైన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సీఎంలు దేవేంద్ర ఫడ్నవీస్, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావుతోపాటు పలువురు ప్రముఖులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్నారు. సీఎం కేసీఆర్‌తోపాటు ముఖ్యఅతిథులు మేడిగడ్డ బరాజ్ వద్దకు చేరుకొని అక్కడ నిర్వహించే హోమంలో పాల్గొని బరాజ్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తారని అధికారులు చెప్పారు. అనంతరం కన్నెపల్లి పంప్‌హౌస్ దగ్గరకు వస్తారు. అక్కడ మరో హోమాన్ని నిర్వహించిన తర్వాత పంప్‌హౌస్‌లోని మోటర్ల వెట్‌రన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి మోటర్లు గోదావరి నీటిని ఎత్తిపోసే డెలివరీ సిస్టం వద్దకు చేరుకొంటారు. మోటర్లు ఎత్తిపోసే గోదావరి నీటిని పరిశీలిస్తారు. ముఖ్యఅతిథుల రాకపోకల కోసం మేడిగడ్డ బరాజ్ వద్ద ఏడు, కన్నెపల్లి వద్ద ఆరు హెలిప్యాడ్‌లను సిద్ధంచేస్తున్నారు. వర్షం పడితే ఇబ్బంది కలుగకుండా హెలిప్యాడ్ల నుంచి హోమశాల, బరాజ్ గేట్ల వరకు బీటీ రోడ్లను నిర్మిస్తున్నారు. మేడిగడ్డ బరాజ్ వ్యూపాయింట్ వద్ద హోమశాల నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. బరాజ్‌లో ఏడు గేట్లను మూసివేసి గోదావరి జలాలను నిల్వచేస్తున్నారు. మేడిగడ్డ, కన్నెపల్లి దగ్గర శిలాఫలకాలను ఏర్పాటుచేస్తున్నారు. వెట్‌రన్ ప్రారంభం కోసం గోదావరిలో నిల్వ చేసిన నీటిని అప్రోచ్ కెనాల్ నుంచి హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఫోర్‌బేలోకి విడుదల చేశారు. నీటితో నిండిన పంపుహౌస్ ఫోర్‌బే ప్రస్తుతం నిండుకుండను తలపిస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, ఈఎన్సీ, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ నల్లా వెంకటేశ్వర్లు మంగళవారం మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్ రమణారెడ్డి వెంట ఉన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉండటం, మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం కావడం వల్ల మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్ ప్రాంతాలను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఆయా ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలు, వాహన తనిఖీలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. మంగళవారం డీజీపీ మహేందర్‌రెడ్డి మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసుశాఖ అధికారులతో కన్నెపల్లి పంపుహౌస్ వద్ద సమావేశమై భద్రతాఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఐజీలు నాగిరెడ్డి, నవీన్‌చంద్, ప్రమోద్‌కుమార్, ఓఎస్డీ ఎంకే సింగ్, సీఐ సెల్ డీఐజీ రాజేశ్‌కుమార్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ భాస్కరన్ డీజీపీ వెంట ఉన్నారు. నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డితోపాటు ఐజీ ప్రమోద్‌కుమార్ భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు.



కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద సిద్ధమవుతున్న హోమశాల



మంగళవారం మేడిగడ్డ బరాజ్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి








# ఉరికురికి.. ఉబికుబికి..

## గోదారమ్మ ఉప్పొంగుతుందిలా..

### కన్నెపల్లి ఫోర్‌బేలో 94.7 మీటర్ల నీటిమట్టం


### ఆరు మోటర్లను వెట్‌రన్‌కు సిద్ధం చేసిన ఇంజినీర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ నేలను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి తల్లి ఉరికురికి.. ఉబికుబికి ఉప్పొంగడానికి సిద్ధమైంది. నీటి విడుదలకు ముహూర్తం సమీపిస్తుండటంతో ఇంజినీర్లు అన్ని రకాల సాంకేతిక కసరత్తులను పూర్తిచేశారు. ఈ నెల 21న గవర్నర్ నరసింహన్, ఏపీ, మహారాష్ట్ర సీఎంల సమక్షంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును తెలంగాణ జాతికి సమర్పించనున్న నేపథ్యంలో కాళేశ్వరం ఎత్తిపోత సాంకేతికంగా ఎలా జరుగుతుంది. గోదారమ్మ నదీమార్గం నుంచి మళ్లీ ఏయే నిర్మాణాల ద్వారా ఉప్పొంగుతుందనే అంశాల్ని దృశ్యాలతో పరిశీలిస్తే..



1

కన్నెపల్లి పంపుహౌస్ వద్ద గోదావరి నది ఇది. నదిలోకి ఇన్‌ఫ్లోలు మొదలైన తర్వాత మేడిగడ్డ బరాజ్‌లో నీరు నిల్వ ఉండి... ఇక్కడివరకు పుష్కలమైన నీటి లభ్యత కనిపిస్తుంది. తద్వారా 350 మీటర్ల అప్రోచ్ చానల్ నుంచి నేరుగా పంపుహౌస్ వైపు నీళ్లు పోతాయి. ప్రస్తుతం నీటి నిల్వ మొదలు కానందున నేరుగా నది నుంచి ఇలా నీటిని కన్నెపల్లి పంపుహౌస్ వైపు మళ్లించారు.



2

ఇది హెడ్‌రెగ్యులేటర్. నదిలో నుంచి జలాలు నేరుగా పంపుహౌస్ వైపు వెళ్లకుండా వరద నియంత్రణకు ఇది దోహదపడుతుంది. ఇక్కడ గేట్లు ఎత్తితేనే జలాలు లోపలికి వెళతాయి. ఇంజినీర్లు మోటర్లు నడిపేందుకు నిర్ణయించిన తర్వాత గేట్లు ఎత్తుతారు. అవసరంలేనపుడు మూసివేస్తారు. నదిలో ఉన్న నీటిమట్టం, మోటర్లు నడిపే సంఖ్య ఆధారంగా ఎన్ని గేట్లు, ఎంత మేర ఎత్తాలనేది నిర్ధారిస్తారు.

- ఫొటోలు: గడసంతల శ్రీనివాస్



3

హెడ్‌రెగ్యులేటర్ గేట్ల ద్వారా వచ్చిన నీళ్లు ఇలా ఫోర్‌బేలోకి చేరతాయి. ఫోర్‌బే అనేది ఒకవిధంగా సర్జ్‌పూల్‌లాంటిది. సాధారణంగా ఇతర పంపుహౌస్‌ల్లో మోటర్లు ఉన్న ప్రాంతానికి సమాంతరంగా తవ్వి సర్జ్‌పూల్‌ను నిర్మిస్తారు. అందులో నుంచి మోటర్ల దిగువకు నీటిని వదులుతారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఫోర్‌బే నిర్మాణాన్ని చేపట్టారు. ఈ ఫోర్‌బేలో నిల్వ సామర్థ్యం 0.02 టీఎంసీలు. ఫోర్‌బేలోకి వచ్చిన నీళ్లు డ్రాఫ్ట్ ట్యూబ్‌ల (ఫోర్‌బే-మోటరు దిగువ భాగానికి మధ్య ఉండే పైపు మార్గం) ద్వారా మోటరు కిందకు పోతాయి.



4

ఇది హెడ్‌రెగ్యులేటర్ వద్ద ఉండే కొలమానం. ఇక్కడ ఎంతమేర నీటిమట్టం ఉంటుందో ఫోర్‌బేలో కూడా అంతే నీటిమట్టం ఉంటుంది. తద్వారా తెలిసే నీటిమట్టం ఆధారంగా ఎన్ని మోటర్లను నడిపేందుకు వీలున్నదనేది ఇంజినీర్లు నిర్ధారిస్తారు. ఇక్కడ సుమారు 94 మీటర్ల మేర నీటిమట్టం ఉంటే కన్నెపల్లి పంపుహౌస్‌లోని పదకొండు మోటర్లను నడిపేందుకు వీలుంటుందని ఇంజినీర్లు తెలిపారు. వచ్చే వరద ఆధారంగా ఒకేసారి ఎన్ని మోటర్లను నడపవచ్చో అంచనావేస్తారు. ఎందుకంటే ఫోర్‌బేలో నిర్ధారిత స్థాయిలో నీళ్లు ఉంటేనే అవి మోటర్ల దిగువ భాగానికి వెళ్లి లిఫ్టు చేయడం సాధ్యం అవుతుంది. వచ్చే వరద తక్కువగా ఉన్నపుడు ఎక్కువ మోటర్లను నడిపితే ఫోర్‌బేలో నీటి లభ్యత అయిపోతుంది. తద్వారా సాంకేతికంగా ఇబ్బంది వస్తుంది. అందుకే ఈ కొలమానం వద్ద వెల్లడయ్యే నీటిమట్టం, వచ్చే వరద ప్రవాహాన్ని లెక్కించి మోటర్లను నడపడంపై ఇంజినీర్లు ఓ నిర్ణయానికి వస్తారు.



5

ఇవి కన్నెపల్లి పంపుహౌస్‌లోని మోటర్ల పైభాగం. ఫోర్‌బే నుంచి డ్రాఫ్ట్‌ట్యూబ్‌ల ద్వారా వచ్చే నీటిని ఈ మోటర్లు ఎత్తిపోస్తాయి. కన్నెపల్లి పంపు హౌస్‌లో ఒక్కో మోటరు సామర్థ్యం 40 మెగావాట్లు. ఒక్కో మోటరు ద్వారా 2118 క్యూసెక్కుల నీళ్లు డిశ్చార్జి అవుతాయి. అంటే 11 మోటర్ల నుంచి దాదాపు 23,166 క్యూసెక్కులు (రెండు టీఎంసీలు) విడుదలవుతాయి. ప్రస్తుతం రెండు టీఎంసీల ఎత్తిపోతకు పదకొండు మోటర్లను అమరుస్తున్నారు. మున్ముందు అదనంగా మరో టీఎంసీని ఎత్తిపోసేందుకుగాను అవసరమైన మోటర్లను బిగిస్తారు. అందుకు సంబంధించి వాటిని అమర్చే ప్రాంతంలో సివిల్ పనులు ఇప్పటికే పూర్తిచేశారు.



6

ఇది డెలివరీ సిస్టర్న్. పంపుహౌస్‌లోని మోటర్లు ఎత్తిపోసిన నీళ్లు డెలివరీ పైపుల ద్వారా ఈ డెలివరీ సిస్టర్న్‌లో పడతాయి. సిస్టర్న్ అంటే ఒక చిన్నపాటి రిజర్వాయర్‌లాంటిది. ఒక్కో మోటరు ద్వారా ఎత్తిపోసే నీళ్లు రెండు పైపుల ద్వారా ఈ సిస్టర్న్‌లోకి పడతాయి. అంటే పదకొండు మోటర్ల నుంచి ఎత్తిపోసే నీళ్లు 22 పైపుల ద్వారా విడుదలవుతాయి. మున్ముందు అదనంగా ఆరు మోటర్లు వస్తున్నందున 34 పైపుల ద్వారా నీళ్లు రానున్నాయి. సివిల్ పనుల్లో భాగంగా ఇక్కడ 34 పైపులను అమర్చారు. డెలివరీ సిస్టర్న్‌లో పడిన గోదావరిజలాలు గ్రావిటీకాల్వ ద్వారా ముందుకుపోతాయి. 13.34 కి.మీ.మేర నిర్మించిన ఈ గ్రావిటీ కాల్వనుంచి ప్రస్తుతం రోజుకు రెండు టీఎంసీలు.. మున్ముందు మూడు టీఎంసీలు అన్నారం బరాజ్‌లో పడనున్నాయి. అందుకే మూడు టీఎంసీల తరలింపునకు అనుగుణంగా ఈ గ్రావిటీ కాల్వను నిర్మించారు.

# ప్రాజెక్టులు దశలవారీగానే పూర్తవుతాయి

- వందశాతం పూర్తయ్యేదాక ప్రారంభించకుండా ఉండరు
- 45 ఏండ్లయినా నాగార్జునసాగర్ కాల్వలు ఇంకా తవ్వుతున్నారు
- కాళేశ్వరం ప్రాజెక్టులో 64 శాతం పనులు పూర్తయ్యాయి
- మేడిగడ్డ-ఎల్లంపల్లి వరకు 90 శాతానికిపైగా పూర్తి
- యావత్తు తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరాన్ని అడ్డుకోవద్దు
- జాతీయహోదా సాధించేలా మద్దతివ్వండి
- తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం హితవు





మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రధానకార్యదర్శి ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి. చిత్రంలో సంఘం ప్రతినిధులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సాగునీటి ప్రాజెక్టును ప్రారంభించాలంటే వందశాతం పనులు పూర్తయ్యేదాక వేచి చూడరని.. ఒకసారి ప్రారంభించి నీటిని విడుదల చేశాక దశలవారీగా పనులు జరుగుతూనే ఉంటాయని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రధానకార్యదర్శి ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో అందుబాటులోకి వచ్చిన కాల్వల నిర్మాణం ఆధారంగా రిజర్వాయర్లలో నీటిని నింపుకుని సాగునీటిని విడుదల చేస్తారని.. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నీటివిడుదల చేసిన సమయంలోనూ నాల్గింట ఒకవంతు కాల్వల నిర్మాణం కూడా జరగలేదని చెప్పారు. 45 ఏండ్లయినా ఇంకా ఈ ప్రాజెక్టు కింద కాల్వల నిర్మాణం జరుగుతూనే ఉన్నదన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు 64 శాతం పూర్తయ్యాయని.. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు 90 శాతానికి పైగా పనులు జరిగాయని తెలిపారు. కాళేశ్వరం పనులు 15 శాతం మాత్రమే పూర్తయ్యాయని, ఈ పనులకే రూ.50 వేల కోట్లు ఖర్చు చేశారంటూ కొందరు చేస్తున్న విమర్శలు సరికాదని హితవుపలికారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు పనుల ఒప్పంద విలువ రూ.11 వేల కోట్లు అని.. సవరణ అంచనా వ్యయాలు రూ.2 వేల కోట్ల వరకు పెరిగే అవకాశముంది తప్ప రూ.50 వేల కోట్లు అనడం విడ్డూరంగా ఉన్నదన్నారు. మరోవైపు ప్రాజెక్టు పూర్తికాకుండానే నీటిని విడుదల చేస్తున్నారంటూ కొందరు మాట్లాడుతుండటం విచిత్రంగా ఉన్నదని.. ఏ ప్రాజెక్టు నుంచయినా దశలవారీగా నీటి విడుదల చేయడం సర్వసాధారణమని తెలిపారు. గతంలో ఎస్సారెస్పీ ద్వారా ఏకంగా 7-8 దశల్లో నీటిని విడుదల చేసినట్టు గుర్తుచేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నుంచి అందుబాటులో ఉన్న వ్యవస్థల ద్వారా సాగునీటిని అందిస్తారని చెప్పారు. కాళేశ్వరం ద్వారా 18.25 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు మరో 18.75 లక్షల ఎకరాల స్థిరీకరణ అనేది కూడా అంతర్భాగమేనన్న విషయాన్ని మరచిపోవద్దని అన్నారు. కాళేశ్వరం నీటి విడుదలతో శ్రీరాంసాగర్ రెండుదశల కింద ఉన్న ఆయకట్టు స్థిరీకరణ జరుగనుండటం హర్షణీయమని శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. నిన్నటివరకు శ్రీరాంసాగర్‌లోకి వరద వస్తేనే ఈ ఆయకట్టుకు సాగునీరందేదని.. కానీ ఇప్పుడు మేడిగడ్డ నుంచి తరలించే నీటితో ఎస్సారెస్పీ-1, 2 దశల కింద ఉన్న ఆయకట్టుకు పుష్కలంగా అందించవచ్చని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రిజర్వాయర్లు, కాల్వల నిర్మాణం జరిగేకొద్దీ ఆయకట్టు విస్తీర్ణాన్ని కూడా పెంచుతారని వివరించారు.

### మన ప్రాజెక్టులపై మనమే కేసులా?

తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఇక్కడి నాయకులే కేసులు వేయడం దురదృష్టకరమని శ్యాంప్రసాద్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి పోకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రాజెక్టులను చేపడుతుంటే అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. గతంలో ఎస్సారెస్పీ కాల్వల్లో 2-3 వేల క్యూసెక్కులు పారడమే గగనంగా ఉండేదని, కానీ తెలంగాణ సర్కారు రూ.800 కోట్లతో చేపట్టిన ఆధునీకరణ పనులతో పూర్తిస్థాయి డిశ్చార్జి ప్రవాహం కూడా ఉంటుందన్నారు. దీంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో 141 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ల నిర్మాణం జరుగుతున్నందున.. వరుసగా రెండు, మూడేండ్లు వర్షాలు సకాలంలో రాకున్నా తాగు, సాగునీటికి ఢోకా ఉండదని వివరించారు. ఈనెల 21న జరగనున్న కాళేశ్వరం ప్రాజెక్టు నీటివిడుదలను ఒక పండగలా జరుపుకోవాలని, తెలంగాణ ప్రాంత ప్రజాప్రతినిధులందరూ ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా దక్కేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఒక్క పంటకోసం మాత్రమే చేపట్టాలని సూచించారని.. కానీ సీఎం కేసీఆర్ మాత్రం రెండు పంటల కోసం రీడిజైన్ చేశారని రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ వెంకట్రామారావు తెలిపారు. ఈ నేపథ్యంలో రూ.40 వేల కోట్లున్న ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80 వేల కోట్లకు పెరుగడంలో విడ్డూరమేమీ లేదని చెప్పారు. గతంలో 16 లక్షల ఎకరాల కోసం డిజైన్ చేస్తే.. ఇప్పుడు ఏకంగా స్థిరీకరణతోసహా 37 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా డిజైన్ చేయడం విశేషమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకే కాకుండా యావత్తు తెలంగాణకూ వరప్రదాయిని అని, ప్రాజెక్టుపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడవద్దని విశ్రాంత ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి సూచించారు.

### జేపీది దుష్టబుద్ధి

తెలంగాణకు ఎత్తిపోతల పథకాలు భారమంటూ లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్‌నారాయణ మాట్లాడటం ఆయన దుష్టబుద్ధికి నిదర్శనమని రిటైర్డ్ ఇంజినీర్ భూమయ్య అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో ఎకరాకు రూ.40-50 వేల విద్యుత్ చార్జీలు అవుతాయంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వాస్తవంగా రూ.1000-1500 మించవని తెలిపారు. రైతుకొచ్చే ఆదాయంలో ఇది పది శాతమేనని.. అయినా ప్రభుత్వమే విద్యుత్తు ఛార్జీలు భరించేందుకు ముందుకొస్తుండగా రైతులకు భారం ఎలా అవుతుందని ప్రశ్నించారు. కాళేశ్వరం బహుళార్థక సాధక ప్రాజెక్టు అని, దీనిద్వారా వ్యవసాయం, దాని అనుబంధ రంగం, పర్యాటకం, మత్స్య, ఉపాధి రంగం అభివృద్ధితోపాటు పట్టణాలకు తాగునీరు పుష్కలంగా లభిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో విశ్రాంత ఇంజినీర్లు కెప్టెన్ జనార్దన్, సత్తిరెడ్డి, దామోదర్‌రెడ్డి, రాంరెడ్డి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది మరుగుజ్జు నాయకత్వం

- పక్క రాష్ట్రాలను చూసైనా బుద్ధితెచ్చుకోవాలి
- కాళేశ్వరం తెలంగాణ ప్రజల జీవన ప్రదాయిని
- మీడియాతో మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతున్న మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అజయ్‌కుమార్ తదితరులు

**ఖమ్మం ప్రధానప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మరుగుజ్జు నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ కొట్టుమిట్టాడుతున్నదని, ఈ కారణంగానే ఆ పార్టీ రోజురోజుకూ బలహీనమవుతున్నదని టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ పరిస్థితుల్లోనూ మల్లు భట్టి విక్రమార్కలాంటివారు బుద్ధి తెచ్చుకోకపోగా, నీచాతినీచంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం ఖమ్మంలో ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. నీటి వనరుల విషయంలో పక్కనే ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పార్టీలు విభేదాలన్నింటినీ పక్కకు పెట్టి ఒక్కటవుతాయని.. తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆయా రాష్ట్రాలను చూసైనా బుద్ధి తెచ్చుకోవడంలేదని విమర్శించారు. అభివృద్ధికి ఆటంకాలు కలిగించేలా కోర్టుల్లో కేసులు వేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు పనిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకత్వ తీరును అసహించుకుంటున్న పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు టీఆర్‌ఎస్‌లో చేరుతున్నా.. ఆ పార్టీ నాయకత్వం తీరు మారకపోవడం విడ్డూరమన్నారు. ప్రపంచంలోని లిఫ్ట్ ఇరిగేషన్లలో కాళేశ్వరం అతిపెద్దదని, వృథాగాపోతున్న గోదావరి జలాలతో తెలంగాణలోని 45 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చేలా ఈ ప్రాజెక్టును పూర్తిచేశారన్నారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు సంబురాలకు సిద్ధమవుతుంటే.. కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేపోతున్నారని ఎద్దేవాచేశారు. కాళేశ్వరం తెలంగాణ ప్రజల జీవన ప్రదాయిని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాతామధు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను.. ఐదునెలల్లో పూర్తిచేస్తాం

- రిజర్వేషన్ల ఖరారు తదితరాలపై కౌంటర్ దాఖలుచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మున్సిపాలిటీల్లో వార్డుల పునర్విభజన (డీలిమిటేషన్), వార్డులవారీగా ఓటర్ల జాబితాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల లెక్కింపు, వార్డులవారీగా రిజర్వేషన్లు, చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు వంటి ప్రక్రియలను పూర్తిచేయడానికి ఐదునెలల సమయం పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం.. హైకోర్టుకు తెలిపింది. నూతన మున్సిపాలిటీలు సహా అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ఈ ప్రక్రియను పూర్తిచేయడానికి ఐదునెలల సమయం ఇవ్వాలని విజ్ఞప్తిచేసింది. వార్డుల విభజన, రిజర్వేషన్లు పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ దాఖలుచేసిన పిటిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కౌంటర్ దాఖలుచేసింది. గత ఏడాది కొత్తగా పలు మున్సిపాలిటీలను ఏర్పాటుచేశామని, చైర్మన్ల పదవులకు అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్లు ఖరారుచేయాల్సి ఉన్నదని వివరించింది. సాధ్యమైనంత త్వరగా ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపింది. విచారణను ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది.

# నేడు రాష్ట్రంలో అక్కడక్కడ వానలు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో బుధవారం అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాడ్పులు వీయొచ్చని వెల్లడించింది. రాష్ట్రంలో మంగళవారం అత్యధికంగా మంచిర్యాల, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, కరీంనగర్ జిల్లాలో 41.9 డిగ్రీలు, సిద్దిపేటలో 41.4, పెద్దపల్లిలో 41.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 38.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది.



తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలామంది బీజేపీలో చేరుతున్నారు. మమతా బెనర్జీ హింసామార్గాన్ని అనుసరించటం ద్వారా పశ్చిమబెంగాల్ శాంతిని నాశనం చేస్తున్నారు. అందుకే ఆమె పార్టీకి చెందినవాళ్లు ఆ పార్టీని వదిలి మా పార్టీలో చేరుతున్నారు.

**కైలాశ్ విజయ్ వర్గియా, బీజేపీ సీనియర్ నేత**

తృణమూల్ కాంగ్రెస్ బలహీనమైన పార్టీ కాదు. డబ్బుల ప్రలోభాలతో 15-20 మంది కౌన్సిలర్లు పార్టీ వీడితే నేను పట్టించుకోను. ఒకవేళ మా పార్టీ శాసనసభ్యులు పార్టీ వీడాలనుకుంటే వాళ్లు వెళ్లవచ్చు. దొంగలు మా పార్టీలో ఉండాల్సిన అవసరం లేదు. ఒక వ్యక్తి వెళ్లిపోతే నేను ఐదు వందల మందిని తయారుచేసుకుంటాను.

**మమతాబెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



987

ఫ్రాన్స్ రాజుగా 4వ లూయి.

1961



యునైటెడ్ ఆఫ్ కింగ్‌డమ్ నుంచి స్వాతంత్ర్యం పొందిన కువైట్.



1994

కొలంబియా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎర్నెస్టో శాంపర్.

హాంకాంగ్‌లో అనుమానితుల అప్పగింత బిల్లుపై చర్చ మూలంగా మిగతా దైనందిన సమస్యలపై చర్చ పక్కకుపోయింది. పేదలు గృహ వసతి కోరుతూ పెట్టుకున్న దరఖాస్తులు మూడు లక్షలకు చేరుకున్నాయి. దీనివల్ల గృహ నిర్మాణం పేదలకు ఎంతగా అందుబాటులో లేదో తెలిసిపోతున్నది. ఈ సారి ప్రభుత్వం 4,800 ఇండ్లు మాత్రమే కట్టించి ఇవ్వగలుగుతున్నది. ఇండ్ల నిర్మాణ వ్యయం సుస్థిరంగా ఉంటే ప్రభుత్వమే కట్టించి ఇవ్వాల్సిన అవసరం ఏర్పడదు. ఇంటి నిర్మాణం అందరికి అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలె.

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**

పాఠశాల బస్సులలో పిల్లలకు సీటు బెల్టులు పెట్టడం వల భద్రత పెరుగుతుందా అనే చర్చ కెనడాలో నడుస్తున్నది. హౌజ్ ఆఫ్ కామన్స్ ట్రాన్స్‌పోర్టేషన్ కమిటీ పలువురి వాదనలు విన్న తర్వాత సీటు బెల్టుల వల్ల సురక్షితంగా ఉంటారని చెప్పలేమని తేల్చింది. కానీ అది సరైన అభిప్రాయం కాదు. సీటు బెల్టులు పెట్టుకోవడం వల్ల అదనపు భద్రత కలుగుతుంది. అమెరికాలోని భద్రతా అధ్యయన సంస్థలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాయి. పిల్లలు సీటు బెల్టు పెట్టుకోకపోతే తమకు పరిహారం పడుతుందనే కారణంగా డ్రైవర్లు మాత్రమే ఈ దీన్ని వ్యతిరేకిస్తున్నారు.

**ది స్టార్**



# అమెరికాతో వ్యవహారం

దేశాల మధ్య వాణిజ్యయుద్ధాలు రగులుకుంటున్నాయనే భయం ప్రపంచవ్యాప్తంగా ఆవరించింది. అమెరికా–చైనా మధ్య జరుగుతున్న వాణిజ్యయుద్ధంతో తలెత్తే పర్యవసానాలపై ప్రపంచమంతా వణికిపోతున్న వేళ అది భారత్‌కు కూడా విస్తరించటం ఆందోళనకరం. అమెరికా కొంతకాలంగా భారత్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నది. దీంతో భారత్ కూడా తగు రీతిలో ప్రతిస్పందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న 29 రకాల వస్తువులపై సుంకాలు పెంచుతూ భారత్ నిర్ణయం తీసుకున్నది. ఇందులో ప్రధానంగా అమెరికా నుంచి దిగుమతి అవుతున్న బాదం, ధాన్యాలు, వాల్‌నట్ తదితరాలపై సుంకాలు విధించింది. ఈ సుంకాల పెంపు కూడా ఈ నెల 16 నుంచే అమల్లోకి వస్తుందని భారత్ ప్రకటించి అమెరికా అనుసరిస్తున్న విధానాలకు గట్టిగానే జవాబు చెప్పింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికారం చేపట్టిన నాటినుంచి అనుసరిస్తున్న రక్షణవాద విధానాల కారణంగా ఈ పరిస్థితులు తలెత్తున్నాయి. అమెరికా–భారత్ మధ్య సాగుతున్న వర్తక వాణిజ్య సంబంధాలకు పునాదిగా ఉన్న పన్నురహిత ఎగుమతులను ట్రంప్ ప్రభుత్వం ఎత్తివేసింది. జనరలైజ్‌డ్ సిస్టం ఆఫ్ ప్రిఫరెన్సెస్ (జీఎస్‌పీ)ను తొలిగించింది. దీంతో అమెరికాతో సాగుతున్న వర్తక వాణిజ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇలాంటి విధానపరమైన చర్యలే కాకుండా భారత్ నుంచి ఎగుమతి అవుతున్న ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు విధించి భారత ఎగుమతులకు అడ్డుకట్ట వేసే చర్యలకు ఒడిగట్టింది. ఇదంతా ఒక ఎత్తు అయితే, ఇరాన్ నుంచి ముడిచమురును కొనుగోలు చేయొద్దని కూడా హుకుం జారీ చేయటమే కాకుండా తన మాట వినకుండా కొనుగోలు చేస్తే ఆంక్షలు తప్పవని హెచ్చరికలు జారీచేసింది. ఇలాంటి అమెరికా ఆధిపత్య విధానాల పర్యవసానాల ఫలితమే అమెరికా–భారత్ మధ్య వాణిజ్య వివాదాలు.

> **అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కలిగి ఉన్న అమెరికా తనదైన వ్యూహం ఎత్తుగడలతో, తగు ప్రత్యామ్నాయాలను చూసుకున్న తర్వాతనే అడుగులువేస్తుంది. ఇరాన్ నుంచి చమురును కొనుగోలు చేయాల్సిన అవసరం నుంచి బయటపడిన తర్వాతనే అమెరికా ఆ నిర్ణయం తీసుకున్నదన్నది మరువరాదు. వర్తక వాణిజ్యాలలో అమెరికా-భారత్ మధ్య తలెత్తిన వైషమ్యాల ప్రభావం ఆయా వస్తువులకే పరిమితం కాదు. వస్తువుల ఎగుమతుల విషయంలో ఆంక్షలు, సుంకాల పెంపు భారత్ ఆర్థిక వ్యవస్థనే కుదిపేసింది. సుంకాల పోరుతో దేశంలో అన్నిరంగాల షేర్లలో అమ్మకాలు పెరిగిపోయాయి. రూపాయి విలువ పతనమైంది. సెన్సెక్స్ కుప్పకూలింది.**

దురాక్రమణలతో పశ్చిమాసియానే అతలాకుతలం చేసిన అమెరికా తనకు ఎదురే లేదన్న రీతిలో వ్యవహరిస్తున్నది. ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్, లిబియా దేశాలను కబళించిన తర్వాత ఇప్పుడు ఇరాన్‌పై కత్తిగట్టింది. అనేక సాకులతో ఇరాన్‌ను అష్ట దిగ్బంధనం చేసి పాదాక్రాంతం చేసుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నది. గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతంలో ఉన్న హోర్ముజ్ జలసంధి ప్రపంచానికి జీవనాడి వంటిది. చమురు ఎగుమతి దేశాలైన సౌదీ అరేబియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఇరాక్ ఈ జలసంధి ద్వారానే చమురును ఎగుమతి చేస్తుంటాయి. దీన్ని దిగ్బంధం చేయటం ద్వారా ఆసియా, పసిఫిక్ దేశాలకు ఊపిరి ఆడకుండా చేయాలన్నదే అమెరికా లక్ష్యం. ఈ మధ్య హోర్ముజ్ జలసంధికి సమీపంలో నార్వే, జపాన్‌కు చెందిన రెండు నౌకలు దాడులకు గురయ్యాయి. ఆ దాడులకు ఇరాన్ బాధ్యత వహించాలని అమెరికా హెచ్చరిస్తున్నది. దాడులతో తమకేమీ సంబంధం లేదని ఇరాన్ వాదిస్తున్నా అమెరికా వినదల్చుకోలేదు. ఈ కారణంతోనే ఇరాన్ లక్ష్యంగా పావులు కదుపుతూ హోర్ముజ్ జలసంధిపై పట్టుబిగిస్తున్నది. భారత్–ఇరాన్ సమాజాల మధ్య శతాబ్దాలుగా స్నేహపూర్వక దౌత్య, వర్తక సంబంధాలున్నాయి. మనం దిగుమతి చేసుకుంటున్న చమురుకు డాలర్లకు బదులు రూపాయాల్లోనే చెల్లిస్తున్నామంటే ఈ సత్సంబంధాలను అర్థంచేసుకోవచ్చు. అలాంటిది అమెరికా ఒత్తిడితో భారత్ చమురును దిగుమతి చేసుకోవటం నిలిపేయాల్సి రావటం విషాదం.

అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కలిగి ఉన్న అమెరికా తనదైన వ్యూహం ఎత్తుగడలతో, తగు ప్రత్యామ్నాయాలను చూసుకున్న తర్వాతనే అడుగులువేస్తుంది. ఇరాన్‌నుంచి చమురును కొనుగోలు చేయాల్సిన అవసరం నుంచి బయటపడిన తర్వాతనే అమెరికా ఆ నిర్ణయం తీసుకున్నదన్నది మరువరాదు. వర్తక వాణిజ్యాలలో అమెరికా–భారత్ మధ్య తలెత్తిన వైషమ్యాల ప్రభావం ఆయా వస్తువులకే పరిమితం కాదు. వస్తువుల ఎగుమతుల విషయంలో ఆంక్షలు, సుంకాల పెంపు భారత్ ఆర్థిక వ్యవస్థనే కుదిపేసింది. సుంకాల పోరుతో దేశంలో అన్నిరంగాల షేర్లలో అమ్మకాలు పెరిగిపోయాయి. రూపాయి విలువ పతనమైంది. సెన్సెక్స్ కుప్పకూలింది. మొత్తంగా చూస్తే స్టాక్ మార్కెట్ పతనం కారణంగా ఇన్వెస్టర్ల రెండు లక్షల కోట్ల సంపద ఆవిరైంది. మరోవైపు పశ్చిమాసియాలో ఏర్పడిన ఉద్రిక్తతలతో చమురు ధరలు పెరిగిపోతున్నాయి. మొత్తంగా ఈ వాణిజ్య తగాదా సమస్త రంగాలను కుదిపేసి ప్రజల దైనందిన జీవితాలను కూడా ప్రభావితం చేస్తుంది. భారత్ అమెరికా ఆంక్షలకు దీటుగా ప్రతిస్పందించడం హర్షణీయం. అయితే ఈ కామర్స్ మొదలైన అనేక రంగాలలో భారత్, అమెరికా మధ్య చర్చలు సాగుతున్నాయి. భారత్ అమెరికా వస్తువులపై వేసిన సుంకాలు దెబ్బకు దెబ్బ అనే రీతిలో గొడవ పెట్టుకోవడానికి కాదు. ఈ బేరసారాలకు కోసం కొంత వెసులుబాటు కల్పించుకోవడంలో భాగమే ఈ ప్రతి ఆంక్షలు. అమెరికా ప్రాబల్యం మూలంగా భారత్ ఆచితూచి వ్యవహరించకతప్పదు.

**జనగళం**

## కాళేశ్వర అమృత ధార

నియ్యతి లేని గత పాలకుల
యమపాశ పాపాల కుప్పలకు
ఏళ్లబడి నోళ్లు తెరిచిన
కోటి ఎకరాల బీళ్లు.. గొంతెండిన బోర్లు
తలాపున గోదావరి ఉరకలు
తడికోసం తపనపడ్డ మడులు
దున్నటమే దుఃఖమై ఉబికిన
కర్షకుని కన్నీటి ఊటలు!
కరువు కాటకాల్లో కాపురాలు!
కాళేశ్వర ముక్తీశ్వర సాక్షిగా
నీటి నిరీక్షణకు తెరతీస్తూ
బీళ్లకు నీళ్లిచ్చే నవ్య దేవాలయం
ముఖచిత్రం మార్చే దివ్యతీర్థం
మహోజ్వల జలదృశ్యం
వరప్రదాయినితో కలసాకారం
కన్నెపిల్లలు చెంగుచెంగున
గట్లపై ఎగిరి దునికినట్లు..
కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల వేదికగా
అసాధారణ ఎత్తిపోతల పొంగులు
అపూర్వ రిజర్వాయర్ నిర్మాణాలు
అతిపెద్ద బాహుబలి పంపులు
మానవ సృష్టి మహాద్భుతాలు
కొండ కోన దాటుతూ, ఉరుకుతూ
ఊరూరా జలవీణ మీటుతూ
కోటి ఎకరాలకు కాళేశ్వర జలధార
తెలగాణ మడి ఒడిని చేరి
సస్యశ్యామల తివాచీలు పరువాలే
గాబులు, గుమ్ములు నిండుతూ
ఆకలిని పొలిమేర్లు దాటించి
బంగారు తెలంగాణగా భాసిల్లాలే!

– బుర్ర మధుసూదన్‌రెడ్డి
99497 00037

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

విశ్లేషణ



అరుణవ్ కౌల్

# ఉమ్మడి భాష అసాధ్యం

**రాజ్యాంగసభలో చర్చలు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎదురైన అనుభవాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉమ్మడి భాష సాధ్యమా అనే చర్చ సాగించవలసి ఉన్నది. పలు యూరప్ దేశాల మాదిరిగా భారత్‌కు ఒకే జాతీయ భాష లేదు. భారత్ ఎంతో భిన్నత్వం గల దేశం. అందువల్ల ఒక ఉమ్మడి భాషను గుర్తించడం సాధ్యం కాదు. ఉమ్మడి భాష కోసం ప్రయత్నించడం అనవసరమైన ప్రయాస.**

ఇటీవల జాతీయ విద్యా విధాన ముసాయిదా మూలంగా మళ్ళా హిందీ రుద్దడంపై వివాదాన్ని సృష్టించింది. ఈ ముసాయిదాలో అన్ని పాఠశాలల్లో హిందీ బోధనను తప్పనిసరి చేయాలని ఒకేఒక క్లాజు వివాదానికి దారితీసింది. దక్షిణాది రాష్ట్రాలలో ఎప్పటి నుంచో హిందీని తప్పనిసరి చేయడంపై వ్యతిరేకత ఉన్నదనేది తెలిసిందే. తమిళనాడు తదితర రాష్ట్రాలలో ఈ క్లాజు పట్ల తీవ్ర నిరసన తలెత్తింది. ఈ నిరసన తీవ్ర ఆందోళనలుగా దక్షిణాది రాష్ట్రాలలో వ్యాపించే పరిస్థితి ఏర్పడ్డది. దీంతో ఈ వివాదాస్పద క్లాజును జాతీయ విద్యా విధాన ముసాయిదా నుంచి తొలిగించారు. అయితే మొదటగా ఈ హిందీని తప్పనిసరి చేసే క్లాజును ముసాయిదాలో చేర్చడం అనేది ప్రస్తుత ఢిల్లీ పాలకుల ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తున్నది.

భారత్ అంతా ఒకే జాతిగా ఉండాలంటే, జాతీయ భాషగా హిందీ ఉండాలనే ఎత్తుగడను కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు ఎన్నోసార్లు ప్రదర్శించారు. ఇప్పటివరకు జరిగిన ఆందోళనల గురించి తెలిసి కూడా కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అనుసరించడం గమనార్హం. 2018లో ప్రపంచ 11వ హిందీ మహాసభలు జరిగాయి. ఈ సభలకు ముందు కేంద్ర ప్రభుత్వం హిందీని ఐక్యరాజ్య సమితిలో అధికార భాషగా చేయాలని ప్రతిపాదించింది. అయితే హిందీయేతర రాష్ట్రాల నుంచి ఈ ప్రతిపాదన పట్ల తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో దేశంలో ఒకే భాషను అంతటా రుద్దవలసిన అవసరం నిజంగా ఉన్నదా అనే ప్రశ్న తలెత్తుతున్నది.

హిందీని ఎందుకు దేశవ్యాప్తంగా రుద్దాలనే ప్రయత్నాల వెనుక గల కారణాలను అర్థం చేసుకోవాలె. భారత దేశంలో భిన్నత్వం ఉన్నది. భిన్న మతాలు, భాషలు, సంస్కృతులు, నేపథ్యాలు గల దేశం మనది. ఈ భిన్నత్వం ఉన్నందువల్ల అందరిని కలిపే ఒక భాషను ఉంటే ఉమ్మడి అస్తిత్వ భావన పెరుగుతుందనే భావన పాలకులలో నెలకొన్నది. ఈ భావనతో ఒక భాషను అన్ని ప్రాంతాల ప్రజలపై రుద్దే ప్రయత్నం తరచూ జరుగుతున్నది. ఈ క్రమంలోనే హిందీని అన్ని ప్రాంతాలలో వ్యాపింపజేసే ప్రయత్నం జరుగుతున్నది. ఒకే భాష ఉంటే, ఆ భాష ప్రజలందరిని కలిపి ఉంచుతుంది. దేశమంతటా కూడా ఒకే భాష ఉండటం వల్ల పరిపాలన కూడా సజావుగా సాగుతుంది. విధానాలు ఒకేలా అమలుకావడానికి భాష దోహదపడుతుంది. భావజాలం కూడా అంతటా వ్యాపించడానికి భాష తోడ్పడుతుంది. దేశ ప్రజలు అందరిని అనుసంధానపరిచే ఒక భాష ఉండటం ఏ విధంగానైనా మంచిదే. భిన్న భాషలు ఉన్న దేశాలలో ఒకే భాషను ప్రవేశపెట్టడం, ప్రోత్సహించడం జరిగింది. ఇందుకు ఉదాహరణ ఫ్రాన్స్. ఫ్రెంచి భాష ఒకప్పుడు అందరు ఉపయోగించే ఉమ్మడి భాష కాదు. అంతగా ప్రాచుర్యం గల భాష కూడా కాదు. అయితే ప్రజలను అందరిని కలిపిపెట్టడానికి భాషను ఒక సాధనంగా వాడుకోవడం ఫ్రాన్స్‌లో జరిగింది. ఇందుకోసం పలు ప్రభుత్వాలు అనేక కఠిన చర్యలు తీసుకున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా ఫ్రెంచి ప్రాచుర్యం గల ఏకైక భాషగా అవతరించింది. ఈ విధానాలు ఎంత కఠినంగా అమలయ్యాయీ అంటే, ఫ్రెంచి తప్ప మరే భాష మనుగడలో లేకుండాపోయింది.

మన దేశంలో కూడా అందరిని అనుసంధానించే ఏకైక భాష ఒకటి ఉండాలనే ప్రయత్నాలు స్వాతంత్ర్యానికి ముందునుంచే మొదలయ్యాయి. అందరిని కలిపే ఒక ఉమ్మడి భాషను ఎంపిక చేయడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. భారత్‌ను బ్రిటిష్ వారు కొన్ని దశాబ్దాల పాటు పాలించారు. దీంతో ఇంగ్లిష్ ప్రధాన అనుసంధాన భాషగా మారింది.





ఉన్నత విద్యా రంగంలో ఇంగ్లిష్ ప్రాధాన్యం కలిగి ఉన్నది. ఇదే విధంగా పరిపాలనారంగంలో ఇంగ్లిష్ కీలకమైందిగా మారింది. కానీ హిందీ ప్రాంతంలోని నాయకులకు మాత్రం ఇంగ్లిష్ పరాయి భాష అనే భావన బలంగా ఉన్నది. ఇంగ్లిష్ స్థానంలో హిందీని ప్రవేశపెట్టాలనే భావన వారిలో దృఢంగా ఉన్నది. అయితే దక్షిణాది రాష్ట్రాల వారి అభిప్రాయం ఇందుకు విరుద్ధంగా ఉన్నది. వారు ఇంగ్లిష్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ఇంగ్లిష్ భాష కొనసాగాలనేది వారి అభిప్రాయం. ఉమ్మడి భాషపై వైరుధ్యాలు తలెత్తడం నెహ్రూకు కూడా ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో జవహర్‌లాల్ నెహ్రూ 1937లో ఒక వ్యాసం రాశారు. దేశమంతా అనుసంధానం కోసం ఒక అఖిల భారత భాష ఉండాలని ఆయన ఆ వ్యాసంలో అభిప్రాయపడ్డారు. ఆ సమయంలో నెహ్రూ మాత్రమే కాకుండా మహాత్మా గాంధీ కూడా హిందుస్థానీ (హిందీ, ఉర్దూలు కలగలసినది) భాష ఉత్తర దక్షిణ ప్రాంతాలనే కాకుండా, హిందువులను, ముస్లింలను ఐక్యపరుచగలదని భావించారు. ఆనాడు స్వాతంత్ర్య సమరకాలంలో హిందుస్థానీ భాష ప్రాధాన్యం సంతరించుకున్నది. అందువల్లనే ఈ భావన ఏర్పడ్డది. దీన్నిబట్టి స్వాతంత్ర్యానికి ముందుకాలం నుంచి ఉమ్మడి భాష విషయమై చర్చ సాగిందని తెలుస్తున్నది. ఉమ్మడి భాషను ప్రవేశపెట్టాలనే ఆలోచనలు ఆనాడు చోటుచేసుకున్నాయి.

ఉమ్మడి భాష విషయమై రాజ్యాంగసభలో కూడా చర్చలు చోటుచేసుకున్నాయి. రాజ్యాంగ సభలో ఉమ్మడి భాష విషయంలో వాడివేడిగా చర్చలు జరిగాయి. ప్రత్యేకించి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆర్.వి.ధులేకర్ ఈ చర్చలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన దృఢమైన హిందీ భాషావాది. జాతీయభాషగా, అధికార భాషగా హిందీని ప్రవేశపెట్టాల్సిందేనని ఆయన బలంగా వాదించారు. కొందరు సభ్యులైతే భారత రాజ్యాంగం అధికార ప్రతిని హిందీలోనే పొందుపరుచాలని, ఇంగ్లిష్‌లో అనధికార ప్రతి ఉండాలని వాదించారు. అయితే ఈ వాదనలను రాజ్యాంగ సభలోని పెద్దలు తిరస్కరించారు. బెంగాలీ, ఒడియా, తమిళం ఎంతో ప్రాచీన, చారిత్రక ప్రాధాన్యం గల భాషలున్నాయి. అందువల్ల హిందీని దేశమంతా రుద్దడం న్యాయం కాదు అనేది రాజ్యాంగ సభలో వ్యక్తమైన అభిప్రాయం. అయితే సభ్యులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. చివరికి మధ్యేమార్గంగా కె.ఎం.మున్షీ, గోపాలస్వామి అయ్యంగార్ రూపొందించిన విధానాన్ని ఆమోదించారు. హిందీ భాష లోపాలను అయ్యంగార్ సమర్థవంతంగా రాజ్యాంగసభలో వివరించారు. శాసనాలను రూపొందించడంలో, న్యాయస్థానాలలో చట్టాలను వ్యాఖ్యానించడంలో ఇంగ్లిష్‌లో ఉన్నంత సౌకర్యం హిందీలో ఉండదు. హిందీ ఇంగ్లిష్ అంతటి ఆధునిక, అభివృద్ధి చెందిన భాష కాదు. అందువల్ల హిందీని జాతీయ భాష చేయాలనే ప్రతిపాదనను తిరస్కరించారు. రాజీమార్గంగా ఇంగ్లిష్‌తో పాటుగా దేవనాగరి లిపితో హిందీకి అధికార భాష హోదా కల్పించారు.

రాజ్యాంగ సభలో చర్చలు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎదురైన అనుభవాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉమ్మడి భాష సాధ్యమా అనే చర్చ సాగించవలసి ఉన్నది. పలు యూరప్ దేశాల మాదిరిగా భారత్‌కు ఒకే జాతీయ భాష లేదు. భారత్ ఎంతో భిన్నత్వం గల దేశం. అందువల్ల ఒక ఉమ్మడి భాషను గుర్తించడం సాధ్యం కాదు. ఉమ్మడి భాష కోసం ప్రయత్నించడం అనవసరమైన ప్రయాస. మరి అందరికి ఉమ్మడి భాష లేకపోతే, దేశ ప్రజల ఐక్యతను సాధించడం ఎట్లా అని కొందరు అడుగవచ్చు. అయితే ఐక్యత ఉమ్మడి భాష ద్వారానే సాధించవలసిన అవసరం లేదు. మన స్వాతంత్ర్యోద్యమం మనలో ఏకతా భావనను నెలకొల్పింది. రాజ్యాంగం పట్ల మనకు గల గౌరవం ఐక్యతను కలిగిస్తున్నది. ఒకే జెండా, ఒకే జాతీయ గీతం, మనలను ఏకం చేస్తున్నది. ఈ జాతీయ భావనలు, మనోభవాలు మన దేశంలోని భిన్న జాతులు, తెగలు, మతాలు, భాషలకు అతీతమైనవి. ఈ మనోభావాల మూలంగానే దేశంలో కోట్లాది మంది ఎండనక, వాననక బారులు తీరి ఓట్లేస్తున్నారు. రాజ్యాంగం పట్ల గౌరవం, ప్రభుత్వం పట్ల విశ్వాసం ఇన్నేళ్ళుగా మనలను ఏకం చేస్తున్నాయి. ప్రభుత్వం కూడా ఈ మనోభావాలను బలోపేతం చేయడానికి యత్నించాలె. దేశమంతా ఒకే భాషను రుద్దడం వల్ల విభేదాలు పెరుగుతాయే తప్ప ఐక్యత సాధ్యం కాదు. దేశంలోని భిన్న భాషలు, మతాల వారిని ఏకం చేసి సమ్మిళిత సంస్కృతిని నెలకొల్పడం మన రాజ్యాంగ నిర్మాతల సంకల్పం. ఆ సంకల్పాన్ని భవిష్యత్ తరాలకు కొనసాగిద్దాం.

> **మన స్వాతంత్ర్యోద్యమం మనలో ఏకతా భావనను నెలకొల్పింది. రాజ్యాంగం పట్ల మనకు గల గౌరవం ఐక్యతను కలిగిస్తున్నది. ఒకే జెండా, ఒకే జాతీయ గీతం, మనలను ఏకం చేస్తున్నది. ఈ జాతీయ భావనలు, మనోభవాలు మన దేశంలోని భిన్న జాతులు, తెగ లు, మతాలు, భాషలకు అతీతమైనవి. ఈ మనోభావాల మూలంగానే దేశంలో కోట్లాది మంది ఎండనక, వాననక బారులు తీరి ఓట్లేస్తున్నారు. రాజ్యాంగం పట్ల గౌరవం, ప్రభుత్వం పట్ల విశ్వాసం ఇన్నేళ్ళుగా మనలను ఏకం చేస్తున్నాయి. ప్రభుత్వం కూడా ఈ మనోభావాలను బలోపే తం చేయడానికి యత్నించాలె. దేశమంతా ఒకే భాషను రుద్దడం వల్ల విభేదాలు పెరుగుతాయే తప్ప ఐక్యత సాధ్యం కాదు.**

(రచయిత: న్యాయవాది, న్యాయ సంస్కరణల రంగంలో కృషి చేస్తున్నారు)
('ది వైర్' సౌజన్యంతో...)

# పేద విద్యార్థులకూ నాణ్యమైన విద్య

విద్య



తాడూరి శ్రీనివాస్

అన్ని రంగాలతో పాటు విద్యారంగాన్ని కూడా అభివృద్ధి చేస్తేనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని విశ్వసించారు సీఎం కేసీఆర్. ఆ దిశగా అడుగులు వేస్తూ ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి అనే రెండు చక్రాలను తెలంగాణకు కట్టి రథసారథిలా సీఎం కేసీఆర్ ముందుకు దూసుకుపోతున్న తరుణంలో విరిసిన కుసుమాలే ఈ బీసీ గురుకులాలు. బడుగు బలహీనవర్గాలకు అందనంత ఎత్తులో ఉండే కార్పొరేట్ స్థాయి విద్యను పిల్లల అరచేతి పలకలపైకి తెచ్చి వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న మహనీయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు.

2014 కంటే ముందు 19 బీసీ గురుకుల పాఠశాలలను మాత్రమే ప్రభుత్వం అరకొర నిధులతో నడిపింది. విద్య, భోజనం ఇతర వసతులను ఏ మాత్రం పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించి పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడం జరిగింది. అటువంటి పరిస్థితులను ఛేదించి రాష్ట్ర ప్రభుత్వ నినాదమైన కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అనే గమ్యాన్ని చేరుకునే దిశలో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారు. 'మాకొద్దు ఈ సర్కారు బడులు' అనే రోజుల నుంచి 'సర్కారు బడులు తప్ప ఇంకేవి వద్దు' అని, కార్పొరేట్ విద్య అంటే అద్దాల మేడల్లో కాదు ప్రభుత్వ బడుల్లోనే దొరుకుతుందని తల్లిదండ్రులకు ఒక నమ్మకాన్ని కల్పించి, నిరూపించింది ఈ రాష్ట్ర ప్రభుత్వం. కేసీఆర్ దూరదృష్టితో గ్రామీణులకు, పేదలకు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్యను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూనే, మరోపక్క సంక్షేమ శాఖలవారీగా కొత్తగా గురుకుల పాఠశాలలను నెలకొల్పి సత్ఫలితాల కోసం కృషి చేస్తున్నారు.

విద్యతో పాటు విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా సాంస్కృతిక, క్రీడారంగాల్లో కూడా ప్రత్యేక శిక్షణ చేపట్టి ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు, ఈ రకమైన విద్యాబోధన వల్ల పిల్లలు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉల్లాసంగా ఉత్సాహంగా చదువుకుంటూ భావితరాలకు మార్గదర్శకులుగా నిలుస్తారు. పిల్లలు మానసికంగానే కాదు శారీరకంగా కూడా దృఢంగా ఉండాలనే తపనతో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని ఈ పాఠశాలల్లో అందించాలని నిర్ణయించారు. పాలు, పండ్లు, మాంసం, గుడ్లు ఇలా అన్నిరకాల పోషక విలువలున్న రోజువారీ ఆహారపు మెనూను సిద్ధం చేశారు. ఇలా ప్రతీ విషయంలో తన పిల్లలకు మేలైన వాటినే అందించాలని కోరుకుంటున్నారు.

ఈ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు పోటీ పరీక్షల్లో కూడా గట్టి పోటీని ఇస్తున్నారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. 2018–19లో జరిగిన అనేక పోటీ పరీక్షల్లో గురుకుల విద్యార్థులు ప్రతిభను చాటారు. తాజాగా నిర్వహించిన ఎంసెట్‌లో ఎస్సీ గురుకులాలకు చెందిన 40 మంది విద్యార్థులు ఎంబీబీఎస్‌లో, 20 మంది విద్యార్థులు బీడీఎస్‌లో, జనరల్ కోటాలో ప్రవేశం పొందేవిధంగా ఉత్తమ ర్యాంకులు సాధించారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో విద్యాలయాల నుంచి నలుగురైదుగురికి మించి వైద్యకోర్సులకు ఎంపికైన సందర్భాలే లేవు. కానీ, ఈసారి మాత్రం ఎంసెట్‌లోనే కాకుండా ఇతర పోటీ పరీక్షల్లోనూ మనవారు సత్తా చూపించారు. ఆరుగురు టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో, 11 మంది అజీం ప్రేమ్ జీ సంస్థలో, 45 మంది ఐఐటీ, నీట్‌లలో, ఐదుగురు సీపే కోర్సుల్లో ప్రవేశం పొందారు.

> **ఇప్పుడు తెలంగాణ బిడ్డలను 'మీదే కులం' అని అడిగితే 'మాది గురు కులం' అని చెప్పే రోజులొచ్చాయి. ఇలా కులాలకు, మతాలకు అతీ తంగా ప్రతి పేదింటి బిడ్డ ఉన్నతమైన చదువులు చదివి వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశాన్ని ఒక్కచోట కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.**

తెలంగాణ వ్యాప్తంగా గురుకుల పాఠశాలలపై పెరిగిన నమ్మకంతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు చెల్లించే ఫీజుల మోత నుంచి విముక్తులయ్యారు. రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలకు చెందిన పేద ప్రజానీకం 50 శాతానికి పైగా పైగా ఉన్నారని గుర్తించి వారి పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు అప్పుల పాలు కాకుండా పక్కా ప్రణాళికతో గురుకులాలను ఏర్పాటు చేయడం ద్వారా 2017–18 విద్యా సంవత్సరంలో 787 పాఠశాలల్లో మొత్తం 2,70,135 మంది విద్యార్థులు, 53 గురుకుల డిగ్రీ కాలేజీల్లో 16,160 మంది ప్రవేశాలు పొందారు. వీరికోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,836.95 కోట్లు ఖర్చుచేసింది. అంటే ఇలా ప్రతి విద్యార్థికి దాదాపుగా 1 లక్ష నుంచి 1 లక్ష 20 వేల వరకు ప్రభుత్వం ఖర్చుచేస్తున్నది. 2018–19 విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉన్న మొత్తం గురుకులాల సంఖ్య 906కు చేరుకున్నది. 2018–19 బడ్జెట్‌లో అన్ని గురుకుల విద్యాలయాలకు కలిపి మొత్తంగా 2,823 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ వరకు ఉచిత బోధన, భోజనం, వసతులు, దుస్తులు, పుస్తకాలు, యూనిఫారాల వంటి సౌకర్యాలను కల్పించింది. చలికాలంలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా రూ.15.82 కోట్లు ఖర్చుచేసి 1,88,348 మందికి రగ్గులను పంపిణీ చేసింది. రాష్ట్రంలో 52 శాతంగా ఉన్న బీసీ వర్గాల పట్ల కేసీఆర్ ఎంతో నిశితంగా ఆలోచించి రాష్ట్రవ్యాప్తంగా 2019–20 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 17న ఒకేరోజు నియోజకవర్గానికి ఒకటి చొప్పున మరో 119 గురుకుల పాఠశాలలను ప్రారంభించి మొత్తం 281 మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాలను ఏర్పాటు చేసింది. గురుకుల పాఠశాలల ద్వారా 2017–18 నాటికి 49,042 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తే ఈ సంవత్సరంతో మొత్తం 92,340 మంది విద్యార్థులు విద్యను అభ్యసించబోతున్నారు. ఇందులో విద్యార్థులతో పాటు మమేకమై నాణ్యమైన విద్యను అందించడానికి 5,335 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, వారికి ఆసరాగా 2,900 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారు. అంటే ఈ గురుకులాల ద్వారా మొత్తం ప్రత్యక్షంగా 8,2 35 మందికి ఉద్యోగాలు కల్పించబడటంతో పాటు పరోక్షంగా మరో 3 వేల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడినాయి.

ఇప్పుడు తెలంగాణ బిడ్డలను 'మీదే కులం' అని అడిగితే 'మాది గురు కులం' అని చెప్పే రోజులొచ్చాయి. ఇలా కులాలకు, మతాలకు అతీ తంగా ప్రతి పేదింటి బిడ్డ ఉన్నతమైన చదువులు చదివి వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశాన్ని ఒక్కచోట కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

(వ్యాసకర్త: ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

## 'నైరుతి'కి తొలుగుతున్న అడ్డంకులు

- దక్షిణాదిలో రుతుపవనాల విస్తరణకు అనుకూలంగా మారుతున్న వాతావరణం
- తెలంగాణకు 22న వర్ష సూచన

**న్యూఢిల్లీ:** నైరుతి రుతుపవనాలు దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించడానికి ఉన్న అడ్డంకులు క్రమంగా తొలిగిపోతున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. కొన్నాళ్లుగా బీహార్, విదర్భ, తెలంగాణ, దక్షిణ తమిళనాడులో కొన్నిచోట్ల వడగాల్పులు వీస్తుండటం రుతుపవనాల విస్తరణకు అడ్డుగా ఉన్నాయని పేర్కొన్నది. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రుతుపవనాలు మరింత విస్తరించేందుకు పరిస్థితులు మారుతున్నాయని, రుతుపవనాల పురోగతికి కావాల్సిన వాతావరణం ఏర్పడుతున్నదని పేర్కొన్నది. అయితే ఇటీవల వచ్చిన 'వాయు' తుఫాన్ కారణంగా అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడటంతో వాతావరణం చల్లబడుతున్నదని, అక్కడక్కడా మంచి వర్షాలు పడ్డాయని అధికారులు తెలిపారు. వచ్చేవారం బంగాళాఖాతం మీదుగా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని, దీంతో వడగాడ్పులు తగ్గొచ్చన్నారు. మొత్తంగా రుతుపవనాలు ఈ వారాంతానికి కర్ణాటక, తమిళనాడులోని మరిన్ని ప్రాంతాలు, దక్షిణ కొంకణ్, గోవా, బెంగాల్, ఏపీ, సిక్కిం, ఒడిశా రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలకు విస్తరిస్తుందని అంచనావేస్తున్నారు. ఈ నెల 22న కర్ణాటకలోని తీర, దక్షిణ అంతర్గత ప్రాంతాలు, కేరళలోని మహే ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురువొచ్చని, ఛత్తీస్‌గఢ్, కొంకణ్, గోవా, ఏపీ తీరం, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరిలోని కొన్నిచోట్ల భారీవర్షాలు కురువొచ్చని అంచనా వేశారు. 23 నుంచి మూడు రోజులపాటు దక్షిణాదితోపాటు అండమాన్ నికోబార్ దీవులు, ఈశాన్య రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని వెల్లడించారు.

## జనభారతం!

2027 నాటికి చైనాను దాటనున్న భారత్

2050 నాటికి 970 కోట్లకు చేరుకోనున్న ప్రపంచ జనాభా



**ఐక్యరాజ్యసమితి:** వచ్చే ఎనిమిదేండ్లలో చైనాను అధిగమించి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించనున్నదని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. 2019-2050 మధ్య భారత్‌లో మరో 27.3 కోట్ల జనాభా పెరుగనుందని తాజాగా విడుదల చేసిన ప్రపంచ జనాభా నివేదికలో వెల్లడించింది. అలాగే మరో 30 ఏండ్లలో ప్రపంచ జనాభా 200 కోట్లు పెరుగనుందని అంచనా వేసింది. ప్రస్తుతం 770 కోట్లుగా ఉన్న ప్రపంచ జనాభా.. 2050 నాటికి 970 కోట్లకు చేరుకోనుందని తెలిపింది. అలాగే ఈ శతాబ్దం చివరి నాటికి అది 1100 కోట్లకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. 2050 వరకు ప్రపంచ జనాభా పెరుగుదలలో సగానికిపైగా కేవలం తొమ్మిది దేశాల్లోనే నమోదుకానుందని నివేదిక వెల్లడించింది. భారత్, నైజీరియా, పాకిస్థాన్, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఇథియోపియా, టాంజానియా, ఇండోనేషియా, ఈజిప్టు, అమెరికాలో జనాభా పెరుగుదల అత్యధికంగా ఉండనుందని తెలిపింది. ప్రస్తుతం 143 కోట్ల జనాభాతో చైనా అగ్రస్థానంలో ఉండగా, 137 కోట్ల జనాభాతో భారత్ రెండో స్థానంలో ఉంది. ప్రపంచ జనాభాలో ఈ రెండు దేశాల వాటా వరుసగా 19 శాతం, 18 శాతంగా ఉన్నది. అయితే 2027 నాటికి చైనా జనాభాను భారత్ అధిగమించనున్నది.

### 38 శాతం పెరిగిన భారతీయ అమెరికన్ల జనాభా

అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయుల జనాభా 2010-17 మధ్య 38 శాతం మేర పెరిగినట్లు 'సౌత్ ఏషియన్ అమెరికన్స్ లీడింగ్ టుగెదర్ (సాల్ట్)' అనే సంస్థ అంచనావేసింది. 2010లో వీరి జనాభా 31,83,063గా ఉండగా, 2017 నాటికి అది 44,02,363కి పెరిగినట్లు తెలిపింది. అలాగే కనీసం 6,50,000 మంది అక్రమంగా ఉంటున్నట్లు తెలిపింది. 2010తో పోలిస్తే ఈ సంఖ్య 76 శాతం పెరిగిందని వివరించింది. అమెరికాలో దక్షిణాసియా మూలాలున్న వారి జనాభా 40 శాతం పెరిగినట్లు సాల్ట్ అంచనావేసింది. ఆ జనాభాలో నేపాలీల జనాభా 206 శాతం పెరుగగా, ఆ తర్వాతి స్థానాల్లో భారతీయులు (38 శాతం), భూటానీలు(38 శాతం), పాకిస్థానీలు (33 శాతం), బంగ్లాదేశీలు (26 శాతం), సింహళీయులు (15 శాతం) ఉన్నారు.

## కాంగ్రెస్ పక్షనేతగా అధిర్ రంజన్ చౌదరి!

పశ్చిమబెంగాల్ నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలిచిన సీనియర్ నేత



అధిర్ రంజన్ చౌదరి

**న్యూఢిల్లీ, జూన్ 18:** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పశ్చిమబెంగాల్ నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలిచిన అధిర్ రంజన్ చౌదరి లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేతగా వ్యవహరించనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ పదవికి ఆయనను ఎంపిక చేస్తూ అధిష్ఠానం నిర్ణయం తీసుకుందని, ఇందుకు సంబంధించిన లేఖను లోక్‌సభ సెక్రటేరియట్‌కు కూడా అందజేసిందని పేర్కొన్నాయి. పశ్చిమబెంగాల్ నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలిచిన చౌదరి.. 1999 నుంచి వరుసగా విజయం సాధిస్తున్నారని చెప్పాయి. ప్రస్తుతం ఆయన బెర్హంపూర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపాయి. గతంలో ఆయన పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, రైల్వే శాఖ సహాయమంత్రిగా కూడా పనిచేశారని వివరించాయి. కాగా ప్రజా సమస్యలపై అధికార పక్షాన్ని నిలదీయడంలో చౌదరికి మంచి పేరు ఉన్నది. ఇదే విషయం ఆయనను కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేతగా ఎంపిక చేయడానికి కలిసొచ్చినట్లు తెలుస్తున్నది. గత లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేతగా కర్ణాటకకు చెందిన మల్లికార్జున ఖర్గే వ్యవహరించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఓడిపోయిన విషయం తెలిసిందే.



## అఖిలపక్షానికి మమత డుమ్మా

- జమిలి ఎన్నికలపై శ్వేతపత్రం రూపొందించాలని డిమాండ్

**న్యూఢిల్లీ/కోల్‌కతా:** ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం నిర్వహించనున్న అఖిలపక్ష పార్టీల అధినేతల సమావేశానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ గైర్హాజరు కానున్నారు. జమిలి ఎన్నికలపై సంప్రదింపులు జరుపడానికి ముందు కేంద్రం ఆ అంశంపై ఒక శ్వేతపత్రాన్ని రూపొందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీకి ఒక లేఖ రాశారు. ఎంతో సున్నితమైన, గంభీరమైన జమిలి ఎన్నికలపై ఇంత స్వల్ప వ్యవధిలో నిర్ణయం తీసుకోవడం వల్ల ఆ అంశానికి న్యాయం జరుగదన్నారు. 'ఇంత ఆదరాబాదరగా సమావేశాన్ని నిర్వహించడానికి బదులు, ముందుగా ఆ అంశంపై ఓ శ్వేతపత్రాన్ని రూపొందించి అన్నిరాజకీయ పక్షాలకు పంపిణీ చేయండి. నిర్దేశిత సమయంలోగా వారి అభిప్రాయాలు కోరండి. అప్పుడు.. ఎంతో ముఖ్యమైన ఈ అంశంపై మేము పటిష్ఠమైన సూచనలు ఇవ్వగలుగుతాం' అని మమత తన లేఖలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి గైర్హాజరు కావాలన్న మమత నిర్ణయంపై పశ్చిమ బెంగాల్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ స్పందిస్తూ, లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన ఓటమి నుంచి ఆమె ఇంకా కోలుకోలేదని అన్నారు.

# నినాదాల మధ్య ప్రమాణాలు

పోటాపోటీ నినాదాలతో హోరెత్తిన లోక్‌సభ

రెండో రోజూ కొనసాగిన సభ్యుల ప్రమాణం

**న్యూఢిల్లీ, జూన్ 18:** లోక్‌సభలో కొత్త ఎంపీల ప్రమాణ స్వీకార పర్వం రెండోరోజు కూడా కొనసాగింది. ఆంగ్ల అక్షరమాల క్రమంలో.. మిగిలిన రాష్ట్రాల ఎంపీలు మంగళవారం ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యులు పోటాపోటీ నినాదాలతో సభను హోరెత్తించారు. అయితే ఈ ప్రహసనం ఒక దశలో కొందరు సభ్యులను అపహాస్యం చేసే వరకూ వెళ్లింది. ఎంతో హుందాగా జరుగాల్సిన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం తడబాట్లు.. పరిహాసాలతో కొనసాగింది.

కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ, సమాజ్‌వాదీ పార్టీ నేత ములాయంసింగ్ యాదవ్ తదితర ప్రముఖులు రెండోరోజు ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. సోనియా గాంధీ హిందీలో ప్రమాణం చేస్తుండగా, ఆమె కొడుకు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన మొబైల్ ఫోన్‌తో ఫొటోలు తీయడం కనిపించింది. సోనియా హిందీలో ప్రమాణం చేసినందుకు అధికార పక్ష సభ్యులు బల్లలు చరుస్తూ ఆమెను అభినందించారు. సోనియా తరువాత ఆమె తోటికోడలు బీజేపీ సభ్యురాలు మేనకాగాంధీ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఎదురుపడిన వారిద్దరు పరస్పరం చేతులు జోడించి అభివాదం చేసుకున్నారు. తన కుమారుడు అఖిలేశ్ యాదవ్‌తో

### 'రాధే రాధే' అన్న డ్రీమ్‌గర్ల్



ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథుర నియోజకవర్గం నుంచి ఎన్నికైన బీజేపీ సభ్యురాలు హేమమాలిని హిందీలో ప్రమాణం చేశారు. ఆమె తన ప్రమాణాన్ని 'రాధే.. రాధే' అంటూ ముగించారు. ముగింపులో శ్రీకృష్ణుని స్తుతించే ఒక శ్లోకాన్ని ఆమె ఆలపించారు. 'రాధే రాధే! కృష్ణం వందే, జగత్ గురు' అని అన్నప్పుడు బీజేపీ సభ్యులు బల్లలు చరుస్తూ.. వారు కూడా 'రాధే రాధే' అంటూ ఆమెతో గొంతు కలిపారు.



ప్రమాణం చేస్తున్న యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ



ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ ప్రమాణ స్వీకారం

కలిసి వీల్‌చైర్‌లో సభకు వచ్చిన ములాయం.. అనారోగ్యం కారణంగా తాను కూర్చున్న చోటనే ఉండి ప్రమాణం చేశారు. ఆ తరువాత అఖిలేశ్ కూడా ప్రమాణం చేశారు. బీజేపీ ఎంపీ, తదుపరి స్పీకర్ అభ్యర్థిగా ఎన్డీఏ తరపున ఎంపికైన ఓమ్ బిర్లా సభలోకి ప్రవేశించినప్పుడు, ఆయన ప్రమాణం చేస్తున్నప్పుడు అధికారపక్ష సభ్యులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మరోవైపు కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణం చేసిన వెంటనే నినాదాలు చేశారు. నినాదాలు చేయడం కూడా ప్రమాణంలో భాగమేమో అన్నట్టుగా వారు వ్యవహరించారు. ఈ సందర్భంగా కొందరు అధికార పక్ష సభ్యులు విపక్ష సభ్యులను ఎగతాళి చేయడంతో అది వాగ్వివాదానికి దారి తీసింది. నినాదాలు చేయకూడదని ప్రొటెం స్పీకర్ సూచించినప్పటికీ సభ్యులు పట్టించుకోలేదు. బీజేపీ సభ్యులందరూ తమ ప్రమాణం పూర్తయిన వెంటనే 'భారత్ మాతాకీ జై', 'జై శ్రీరాం' అన్న నినాదాలు చేశారు. ప్రతిపక్ష సభ్యులు ప్రమాణం చేస్తున్నప్పుడు కూడా బీజేపీ సభ్యులు అవే నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ముఖ్యంగా తృణమూల్ ఎంపీలు ప్రమాణం చేస్తున్నప్పుడు బీజేపీ సభ్యులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో తృణమూల్ సభ్యులు కూడా 'జై దుర్గా, జై మా కాళి, జై హింద్' అంటూ నినదించారు. సినీ నటుడు సన్నీ డియోల్ ఇంగ్లిష్‌లో ప్రమాణం చేశారు. ప్రమాణంలో ఒక వాక్యాన్ని తప్పుగా చదివిన సన్నీ.. దాన్ని సరిదిద్దుకొని మళ్లీ చదివారు. ఇద్దరు సభ్యులు ఇలా రెండుసార్లు ప్రమాణం చేయాల్సి వచ్చింది.

### నినాదాల ప్రహసనం

సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు షఫీఖుర్ రెహమాన్ వందేమాతరం నినాదానికి అభ్యంతరం తెలిపారు. దీంతో పెద్ద ఎత్తున నిరసన తెలిపిన అధికారపక్షం.. ఆయనను క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. బీజేపీ ఎంపీ అరుణ్‌కుమార్ సాగర్ పదే పదే 'భారత్ మాతా కీ జై' అంటూ నినదిస్తుండటంతో.. రాహుల్‌గాంధీ ఆయనను 'ఇంకోసారి.. ఇంకోసారి..' అంటూ రెచ్చగొట్టారు. మరో బీజేపీ సభ్యుడు అజయ్ కుమార్‌ను కూడా రాహుల్ రెచ్చగొట్టేందుకు ప్రయత్నించగా.. 'మీరు జై అని పలికితే నేను మళ్లీ నినదిస్తాను' అని ఆయన స్పందించారు. ఇందుకు రాహుల్ సరేనన్నారు. అయితే అజయ్‌కుమార్ 'భారత్ మాతా కీ..' అనగానే రాహుల్ 'జై హింద్' అని ముగించారు. ఈ సమయంలో కాంగ్రెస్ సభ్యులందరూ రాహుల్‌తో జతకలిసి 'జైహింద్' అంటూ నినదించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏకైక ఎంపీ భగవంత్ మాన్ 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ తన ప్రమాణాన్ని ముగించారు. సీపీఐ సభ్యుడు కే సుబ్బరాయన్ 'లౌకికవాదం వర్ధిల్లాలి, భారత్ వర్ధిల్లాలి' అన్న నినాదాలు చేశారు. అకాలీదళ్ అధిపతి సుఖ్‌బీర్ సింగ్ బాదల్, ఏఐయూడీఎఫ్ నేత బద్రుద్దీన్ అజ్మల్, మాజీ కేంద్ర మంత్రులు రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, ప్రణీత్‌కౌర్, శశిథరూర్, కిరణ్ ఖేర్ కూడా ప్రమాణం చేశారు. పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ భార్య ప్రణీత్ కౌర్ తలకు బ్యాండేజీతో కనిపించారు. తమిళనాడుకు చెందిన ఎంపీలు టీఆర్ బాలు, ఏ రాజా, కనిమొళి, దయానిధి మారన్, కార్తీ చిదంబరం తదితరులు తమిళంలో ప్రమాణం చేశారు. డీఎంకేకు చెందిన ఒక సభ్యుడు పెరియార్, కళ్జర్, గాంధీ, అంబేద్కర్‌ను కొనియాడుతుండగా, స్పీకర్ ఆయనను అడ్డుకుంటూ నిర్దేశిత ప్రమాణాన్ని మాత్రమే రికార్డుల్లోకి తీసుకుంటామని చెప్పారు. సోమవారం సభకు హాజరుకాని కొందరు సభ్యులు మంగళవారం తమ ప్రమాణం చేశారు. ఈ రెండు రోజులు హాజరుకానివారు బుధవారం ప్రమాణం చేస్తారు.

## అఖిలపక్ష సమావేశంపై కాంగ్రెస్ వ్యూహరచన

సోనియా అధ్యక్షతన సీనియర్ నాయకుల భేటీ

నేడే అన్నిపార్టీల అధ్యక్షులతో ప్రధాని మోదీ సమావేశం

**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ బుధవారం (నేడు) అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ కీలక నేతలు మంగళవారం సమావేశమయ్యారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ నివాసంలో జరిగిన ఈ భేటీలో సోనియా, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, సీనియర్ నాయకులు ఏకే ఆంటోనీ, పీ చిదంబరం, గులాంనబీ ఆజాద్, ఆనంద్‌శర్మ, జైరాం రమేశ్, కే సురేశ్, అధిర్ రంజన్ చౌదరి పాల్గొన్నారు. ప్రధానంగా ఒకే దేశం- ఒకే ఎన్నిక ఎజెండాతో జరుగనున్న అఖిలపక్ష సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై నాయకులు చర్చించారు. అలాగే స్పీకర్ ఎన్నిక, ఈ నెల 20న అన్ని పార్టీల ఎంపీలతో జరుగనున్న విందు సమావేశం అంశాలు కూడా చర్చకు వచ్చాయి. సమావేశం అనంతరం అధిర్ రంజన్ చౌదరి విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభ స్పీకర్‌గా అధికార పక్షం ఎవరి పేరును ప్రకటించినా తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని చెప్పారు. లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత ఎంపిక గురించి



సమావేశంలో చర్చించలేదని తెలిపారు. దీనిపై సోనియాగాంధీ త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. సంఖ్యాబలంపై ప్రతిపక్షాలు విచారించాల్సిన అవసరం లేదని, ప్రతిపక్షాలు చెప్పే ప్రతి మాట ఎంతో విలువైనదని ప్రధాని మోదీ పేర్కొనడంపై చౌదరి స్పందిస్తూ 'ప్రజాస్వామ్యం అంటే సంఖ్యాబలం కాదు. సభ్యుల అభిప్రాయాలు, చర్చలతో ముడివడి ఉన్నదే ప్రజాస్వామ్యం' అని చెప్పారు. లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం, 2022లో జరుగనున్న 75వ స్వాతంత్ర్య వేడుకలు, ఈ ఏడాది జరుగనున్న మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాలు అంశాలపై చర్చించడానికి బుధవారం ప్రధాని మోదీ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

## కేంద్రమంత్రి ప్రహ్లాద్ పటేల్ కుమారుడు అరెస్ట్

హత్యాయత్నం కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ, జూన్ 18:** కేంద్రమంత్రి ప్రహ్లాద్ పటేల్ కుమారుడు ప్రబల్ పటేల్‌ను హత్యాయత్నం కేసులో పోలీసులు అరెస్టు చేశారు. అతడితోపాటు మరో ఆరుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు. సోమవారం రాత్రి తాము ఓ పెండ్లికి వెళ్లి వస్తుండగా ప్రబల్, మోను వారి స్నేహితులు కొంతమంది అడ్డగించి దాడి చేశారని, అనంతరం ఓ ఇంటికి తీసుకెళ్లి మళ్లీ కొట్టారని పేర్కొంటూ హిమాన్షు రాథోడ్, రాహుల్ రాజ్‌పుత్ అనే ఇద్దరు యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రబల్‌తోపాటు మరో ఆరుగురిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ ఐజీ వివేక్ శర్మ మాట్లాడుతూ దాడి సందర్భంగా ఇరువర్గాల మధ్య తోపులాట కూడా చోటుచేసుకుందని, ప్రబల్ వర్గానికి చెందిన వ్యక్తి కాల్పులు జరుపడంతో హిమాన్షు రాథోడ్‌కు గాయాలయ్యాయని తెలిపారు.


## సీపీఎం నేత కుమారుడిపై లైంగికదాడి కేసు

పెండ్లి చేసుకుంటానని మోసం చేశాడంటూ ఓ మహిళ ఫిర్యాదు

**ముంబై:** కేరళ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ కుమారుడు బినయ్ వినోదిని బాలకృష్ణన్‌పై లైంగికదాడి, మోసం కేసు నమోదైంది. బీహార్‌కు చెందిన ఓ మాజీ డ్యాన్సర్ చేసిన ఫిర్యాదు మేరకు ముంబై పోలీసులు కేసును నమోదు చేశారు. గతంలో తనపై బినయ్ లైంగికదాడికి పాల్పడ్డాడని, అనంతరం పెండ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు ఓ కుమారుడు కూడా ఉన్నాడని తెలిపారు. నిందితుడు 2010లో ముంబైలోని అంధేరిలో ఓ ఫ్లాట్‌లో తనను ఉంచి తరుచుగా వచ్చి వెళ్లేవాడని పేర్కొన్నారు. అతడికి పెండ్లి అయిన విషయం గతేడాది తెలిసిందని, దీంతో అప్పటినుంచి తమ మధ్య గొడవలు మొదలయ్యాయని చెప్పారు. తమ మధ్య ఉన్న బంధం గురించి ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని బినయ్ బెదిరించాడని తెలిపారు. కాగా ఈ ఆరోపణలను బినయ్ తోసిపుచ్చారు. సదరు మహిళ తనకు తెలుసునని, అయితే డబ్బుల కోసమే ఆమె ఇలాంటి ఆరోపణలను చేస్తున్నారని, ఆరు నెలల కిందట రూ.5 కోట్లు ఇవ్వాలంటూ ఆమె బ్లాక్‌మెయిల్ కూడా చేశారని చెప్పారు.

## 100 రోజుల అజెండాపై మేధోమథనం

ప్రధాన కార్యదర్శులతో ప్రధాని మోదీ సమాలోచన



**న్యూఢిల్లీ, జూన్ 18:** రెండోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత, తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందు ప్రభుత్వ 100 రోజుల ఎజెండాను ఖరారు చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ప్రధాని నివాసంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక శాఖకు చెందిన ఐదుగురు కార్యదర్శులతోపాటు ఇతర కీలక శాఖల కార్యదర్శులు, నీతి ఆయోగ్ అధికారులు హాజరైనట్లు సమాచారం. దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చే లక్ష్యాన్ని వీలైనంత తక్కువ కాల వ్యవధిలో చేరుకునేందుకు సమావేశంలో చర్చించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే రైతు ఆదాయం రెట్టింపు, పీఎం-కిసాన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రజలందరికీ నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం కల్పించడం వంటి పథకాలపైనా చర్చించినట్లు పేర్కొన్నాయి. ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేలా ప్రతి విభాగంలో సంస్కరణలు తెచ్చేందుకు రోడ్‌మ్యాప్ రూపొందించే విషయంపైనా సమావేశంలో ప్రధాని చర్చించారని తెలిపాయి. 2018-19లో జీడీపీ ఐదేండ్ల కనిష్టానికి (6.8 శాతం) చేరుకున్న నేపథ్యంలో ఆదాయం పెంపు, జీడీపీ వృద్ధికి అధికారులతో సమాలోచనలు జరిపారని అధికారులు తెలిపారు. ద్రవ్యోల్బణం ఆర్బీఐ కంఫర్ట్ జోన్‌లోనే కొనసాగుతున్నప్పటికీ, జనవరి-మార్చి త్రైమాసికంలో ఆర్థికాభివృద్ధి రేటు ఐదేండ్ల కనిష్టానికి (5.8 శాతానికి) పడిపోయిందని గణాంకాలు చెబుతున్నాయి. వ్యవసాయం, తయారీ రంగాలు క్షీణించడమే ఇందుకు కారణం. జూలై 5న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ప్రధాని ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. వారి సలహాలను బడ్జెట్‌లో పొందుపరచనున్నారు. తయారీ రంగంలో పెట్టుబడులు పెంచడం ప్రధాన ఎజెండా కాగా, రైతు ఆదాయం పెంచే చర్యలకూ బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించే అవకాశం ఉంది. ఆర్థిక మందగమనం, మొండి బకాయిలు, ఉద్యోగాల సృష్టి, వ్యవసాయ సంక్షోభం, ప్రైవేట్ పెట్టుబడుల పెంపు వంటి వాటిపై బడ్జెట్‌లో ప్రధానంగా దృష్టి సారించే అవకాశం ఉన్నది. గత నెలలో అధికారికంగా విడుదల చేసిన లేబర్ సర్వే ప్రకారం.. దేశంలో 2017-18లో నిరుద్యోగిత రేటు 45 ఏండ్ల గరిష్టానికి (6.1%) చేరుకున్నది.

## చైనాలో భూకంపాలు

12 మంది మృతి

జపాన్, అండమాన్, నికోబార్ దీవుల్లోనూ ప్రకంపనలు

**బీజింగ్:** చైనాలోని సిచువాన్ రాష్ట్రంలో వరుసగా రెండు భూకంపాలు సంభవించాయి. ఇబిన్ నగరం కేంద్రంగా జరిగిన ఈ ఘటనలో 12 మంది మృతి చెందగా, 125 మందికిపైగా గాయపడ్డారు. మొదటి భూకంపం సోమవారం రాత్రి 10:55 గంటలకు రిక్టర్ స్కేలుపై 6.0 తీవ్రతతో, రెండోది మంగళవారం ఉదయం రిక్టర్ స్కేలుపై 5.3 తీవ్రతతో సంభవించిందని చైనా భూకంపాల అధ్యయన కేంద్రం తెలిపింది. భూకంప కేంద్రం ఉపరితలానికి 16 కి.మీ. లోతున ఉన్నట్టు గుర్తించారు.

**అండమాన్ దీవుల్లోనూ..**

అండమాన్, నికోబార్ దీవుల్లో మంగళవారం ఉదయం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 4.9 తీవ్రత నమోదైంది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు.

**జపాన్‌లో సునామీ హెచ్చరికలు**

జపాన్‌లోని దక్షిణ టోక్యోతోపాటు జపాన్ సముద్ర తీరప్రాంతంలో మంగళవారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రత నమోదు కావడంతో అధికారులు వెంటనే సునామీ హెచ్చరికలు జారీచేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

మహిళా మావోయిస్టు మృతి



**కొత్తగూడెం క్రైం:** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళా మావోయిస్టు మరణించారు. ధంతారి జిల్లాలోని కట్టీ గ్రామ సమీపంలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) బలగాలు మంగళవారం గాలింపు నిర్వహించాయి. ఈ సందర్భంగా తారసపడిన మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. దీంతో ఒక మహిళా మావోయిస్టు మరణించారు. ఘటనాస్థలంలో ఒక తుపాకీని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

## అయోధ్య ఉగ్రదాడి కేసులో నలుగురికి యావజ్జీవం

- రూ.2.4 లక్షల చొప్పున జరిమానా
- 2005 నాటి కేసులో కోర్టు తీర్పు

**అలహాబాద్:** అయోధ్యలోని వివాదాస్పద రామజన్మభూమి-బాబ్రీమసీదు స్థలంలో ఉన్న తాత్కాలిక మందిరంపై 2005లో జరిగిన ఉగ్రవాద దాడి కేసులో ప్రత్యేక కోర్టు మంగళవారం తీర్పును వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురిలో నలుగురిని దోషులుగా ఖరారు చేసిన కోర్టు వారికి యావజ్జీవ జైలు శిక్ష విధించింది. సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా ఒకరిని విడుదల చేసింది. అలహాబాద్‌లోని నైనీ సెంట్రల్ జైలులో ఏర్పాటు చేసిన కోర్టులో తీర్పును ప్రకటించిన ప్రత్యేక జడ్జి దినేశ్‌చంద్ర దోషులందరికీ రూ.24 లక్షల చొప్పున జరిమానా కూడా విధించారు. డాక్టర్ ఇర్ఫాన్, షకీల్ అహ్మద్, ఆసిఫ్ ఇక్బాల్, మొహమ్మద్ నసీంకు యావజ్జీవ జైలు శిక్ష విధించిన కోర్టు మొహమ్మద్ అజీజ్‌ను విడుదల చేసిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గులాబ్ చంద్ర అగ్రహారి తెలిపారు. ఈ తీర్పును ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వాగతించారు. కోర్టు తీర్పును పరిశీలించిన తరువాత, నిర్దోషిగా విడుదలైన నిందితుని విషయమై సరైన చర్య తీసుకుంటామని చెప్పారు. అత్యంత



ఉగ్రదాడికి ఉపయోగించిన వాహనం

కట్టుదిట్టమైన భద్రత ఉన్న అయోధ్యలోని తాత్కాలిక మందిరంపై 2005, జూలై 2న భారీ ఆయుధాలతో వచ్చిన ఐదుగురు జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది వారిని మట్టుబెట్టారు. ఒక గంటపాటు జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు పౌరులు కూడా మృతి చెందగా, ఏడుగురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి యూపీ పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు.

## భార్యాపిల్లలను చంపి.. తాను ఆత్మహత్య!

- అమెరికాలో తెలుగు కుటుంబం మరణంపై ప్రాథమికంగా నిర్ధారణ
- కొన్నాళ్లుగా తీవ్ర ఒత్తిడిలో కుటుంబ పెద్ద చంద్రశేఖర్
- గృహ ప్రవేశం నాడే దారుణం

**వాషింగ్టన్, జూన్ 18:** అమెరికాలోని అయోవాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చంద్రశేఖర్ సుంకర కుటుంబం అనుమానాస్పద మరణాల వెనుక మిస్టరీ వీడింది. చంద్రశేఖర్ తన భార్య లావణ్య, ఇద్దరు పిల్లలను హత్య చేసి ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు వెస్ట్ డెస్‌మోయిన్స్ పోలీసులు సోమవారం వివరాలు వెల్లడించారు. ఏపీకి చెందిన చంద్రశేఖర్ కుటుంబం శనివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంగతి తెలిసిందే. వారంతా తుపాకీ కాల్పుల్లో మృతి చెందినట్టు గుర్తించినా.. హత్యో, ఆత్మహత్యో తేలలేదు. సోమవారం వెల్లడైన పోస్ట్‌మార్టం రిపోర్ట్ ప్రకారం చంద్రశేఖర్ సుంకర (44) ఆత్మహత్య చేసుకున్నాడని, ఆయన భార్య లావణ్య (41), ఇద్దరు కొడుకులు ప్రభాస్ (14), సుహాస్ (11) తుపాకీ కాల్పుల్లో మృతిచెందారని తేలింది. దీంతో చంద్రశేఖర్ ముందుగా తన భార్య, ఇద్దరు పిల్లలను హత్య చేసి, ఆ తర్వాత తాను కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు.



చంద్రశేఖర్ కుమారులు సుహాస్, ప్రభాస్

చంద్రశేఖర్‌కు ఈ ఏడాది ఏప్రిల్‌లో తుపాకీ లైసెన్స్ ఇచ్చినట్టు చెప్పారు.

### గృహ ప్రవేశం జరిగిన రోజే..

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్‌ది ఏపీలోని గుంటూరు జిల్లా చుండూరు. ప్రకాశం జిల్లా వేటపాలెం మండలం కొత్తకోటకు చెందిన లావణ్యతో 2003లో పెండ్లయింది. తర్వాత రెండేండ్లకే వీరిద్దరూ అమెరికా వెళ్లిపోయారు. చంద్రశేఖర్ ప్రస్తుతం అయోవా ప్రజా భద్రతా విభాగంలో (డీపీఎస్) ఐటీ నిపుణుడిగా 11 ఏండ్లుగా పనిచేస్తున్నాడు. లావణ్య కొన్నాళ్లపాటు ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేశారు. ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్నారు. ఆమె సోదరి సైతం అమెరికాలోనే స్థిరపడ్డారు. చంద్రశేఖర్ ఈ ఏడాది మార్చిలో అయోవాలోని వెస్ట్ డెస్‌మోయిన్స్‌లో ఓ ఇల్లు కొనుక్కున్నారు. శనివారం గృహప్రవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లావణ్య తల్లిదండ్రులు సీతారామిరెడ్డి, హైమావతి కూడా వెళ్లారు. గృహ ప్రవేశం అనంతరం అందరూ కలిసి సమీపంలోని ఓ హోటల్‌లో విందు ఆరగించారు. అనంతరం చంద్రశేఖర్ కుటుంబంతోపాటు లావణ్య తల్లిదండ్రులు, ఆమె సోదరి ఇద్దరు పిల్లలు కలిసి ఇంటికి వచ్చారు. ఎవరి గదిలో వారు విశ్రాంతి తీసుకుంటుండగా ఒక్కసారిగా భారీ శబ్ధాలు వినిపించాయి. దీంతో సీతారామిరెడ్డి బయటికి వచ్చి చూడగా అల్లుడు చంద్రశేఖర్ కనిపించారు. ఏమయిందని ప్రశ్నించగా.. పిల్లలు పడుకున్నారో లేదో చూడటానికి వచ్చానని బదులిచ్చాడు. ఆ తర్వాత కొంత సేపటికి మళ్లీ శబ్ధాలు వినిపించాయి. దీంతో సీతారామిరెడ్డి తన మనుమలు ఉన్న గదికి వెళ్లి చూడగా వారిద్దరితోపాటు చంద్రశేఖర్ రక్తపుమడుగులో పడి ఉన్నారు. పక్కనే బాల్కనీలో లావణ్య మృతదేహం పడి ఉన్నది. తీవ్ర దిగ్భ్రాంతికి గురైన సీతారామిరెడ్డి.. వెంటనే పెద్దగా కేకలు వేస్తూ సహాయం కోసం బయటికి పరుగులు తీశారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. చంద్రశేఖర్ కొన్నాళ్లుగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్టు స్థానికులు తెలిపారు. ఆయన పెద్ద కొడుకు కూడా కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని చెప్పారు.



చెన్నైలో కొందరు కాలేజీ విద్యార్థులు కలిసి 'బస్ డే' పేరుతో చేసిన హంగామా వికటించింది. పదుల సంఖ్యలో విద్యార్థులు టాప్‌పైకి ఎక్కి.. నడుస్తున్న బస్సుపై డ్యాన్సులు చేస్తుండగా డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో దాదాపు 30 మంది విద్యార్థులు టాప్‌పై నుంచి ఒక్కసారిగా ముందువైపు రోడ్డుపై పడ్డారు. ఈ ఘటనలో కొందరికి గాయాలయ్యాయి. పోలీసులు 20 మందిని అరెస్ట్ చేశారు.

## పుల్వామా నిందితుడు సజ్జద్ హతం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఓ జవాన్ ప్రాణాలు కోల్పోయారు. బిజ్‌బెహారా ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. దీంతో ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. బలగాల ఎదురుకాల్పుల్లో జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన సజ్జద్ భట్, తౌసిఫ్ భట్ హతమయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 14న పుల్వామా జిల్లాలో సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై జరిగిన దాడి కేసులో సజ్జద్ భట్ నిందితుడు. ఇతడికి చెందిన కారుతోనే ఆత్మాహుతి దాడి జరిగింది.

నమస్తే తెలంగాణ

ఆట

క్రికెట్ సమరం WORLD CUP

కరీంనగర్ | WWW.NTNEWS.COM | బుధవారం 19 జూన్ 2019 | 10

## పాయింట్ల పట్టిక

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1. | ఇంగ్లండ్ | 5 | 4 | 1 | 0 | +1.86 | 8 |
| 2. | ఆస్ట్రేలియా | 5 | 4 | 1 | 0 | +0.81 | 8 |
| 3. | న్యూజిలాండ్ | 4 | 3 | 0 | 1 | +2.16 | 7 |
| 4. | భారత్ | 4 | 3 | 0 | 1 | +1.02 | 7 |
| 5. | బంగ్లాదేశ్ | 5 | 2 | 2 | 1 | -0.27 | 5 |
| 6. | శ్రీలంక | 5 | 1 | 2 | 2 | -1.77 | 4 |
| 7. | వెస్టిండీస్ | 5 | 1 | 3 | 1 | +0.27 | 3 |
| 8. | దక్షిణాఫ్రికా | 5 | 1 | 3 | 1 | -0.20 | 3 |
| 9. | పాకిస్థాన్ | 5 | 1 | 3 | 1 | -1.93 | 3 |
| 10. | ఆఫ్ఘనిస్థాన్ | 5 | 0 | 5 | 0 | -2.08 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు,

**వరల్డ్‌కప్‌లో నేడు** న్యూజిలాండ్ X దక్షిణాఫ్రికా- 3 గం. స్టార్ స్పోర్ట్స్‌లో

**అత్యధిక పరుగులు** 384 షకీబ్ (బంగ్లాదేశ్)

**అత్యధిక వికెట్లు** 13 ఆమిర్ (పాకిస్థాన్)

# పేలిన మోర్గన్



బెయిర్‌స్టో (90)

మోర్గాన్
బంతులు: 71
పరుగులు: 148
ఫోర్లు: 4
సిక్సర్లు: 17

రూట్ (88)

## 17 సిక్సర్లతో ఇయాన్ ప్రపంచ రికార్డు

### విశ్వసమరంలో ఇంగ్లండ్ అత్యధిక స్కోరు

### ఆఫ్ఘనిస్థాన్‌పై 150 పరుగుల తేడాతో ఘన విజయం.. రాణించిన రూట్, బెయిర్‌స్టో

విధ్వంసం, బీభత్సం, వీరబాదుడు, ఊచకోత.. ఈ పదాలేవి సరిపోవు ఆ ఇన్నింగ్స్‌ను వర్ణించేందుకు. బౌండ్రీల జడివాన, పరుగుల ప్రవాహం, సిక్సర్ల సునామీ.. ఈ ఉపమానాలన్నీ ఆ జోరు ముందు దిగదుడుపే.

ఎడాపెడా.. చెడామడా.. దంచిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్.. ఆఫ్ఘన్ బౌలర్లను దడదడ లాడిస్తూ.. ఫీల్డర్లను గడగడ వణికిస్తూ.. సాగించిన ఆ విధ్వంసకాండ మాటలకందనిది. పట్టపగలే ప్రేక్షకులకు చుక్కలు చూపిన మోర్గాన్.. ప్రపంచకప్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డును తన పేరిట లిఖిస్తూ.. మెగాటోర్నీలో తమ జట్టుకు అత్యధిక స్కోరు అందించాడు. అతడు కొట్టిన బంతుల్ని ప్రేక్షకుల మధ్య నుంచి తిరిగి బౌలర్‌కు అందించడమే ఫీల్డర్లకు ప్రధాన పనైపోయింది. బెయిర్‌స్టో, రూట్ కూడా చక్కటి ఇన్నింగ్స్‌లు ఆడినా మోర్గాన్ మోత ముందు అవి చిన్నబోయాయి. ఇటీవలి కాలంలో మంచినీళ్ల ప్రాయంగా మూడొందల స్కోర్లు చేస్తున్న ఇంగ్లండ్.. ఈ మ్యాచ్‌లో నాలుగొందలకు ఇంచు దూరంలో నిలిచిపోయింది. కొండంత స్కోరును ఛేదించడంలో కాబూలీలు ఖలేజా చూపెట్టారు. పదునైన పేస్‌ను ఎదుర్కొంటూ అదరక బెదరక ఎదురు నిలిచి పోరాట వీరులనిపించుకున్నారు.

**మాంచెస్టర్:** మనవాళ్లు దాయాదిని దంచి కొట్టిన చోట.. ఇంగ్లండ్ పరుగుల వరద పారించింది. ఆ ప్రవాహాన్ని వరదతో పోల్చడం చిన్నబుచ్చినట్లే అయినా.. ఫోర్ల (21) కంటే ఎక్కువ సిక్సర్లు (25) బాదిన ఇంగ్లండ్.. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్న ఆఫ్ఘనిస్థాన్‌పై పిడుగులా పడింది. మంగళవారం ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 150 పరుగుల తేడాతో ఆఫ్ఘన్‌పై జయభేరి మోగించింది. బెయిర్‌స్టో (99 బంతుల్లో 90; 8 ఫోర్లు, 3 సిక్సర్లు), రూట్ (82 బంతుల్లో 88; 5 ఫోర్లు, 1 సిక్స్) వేసిన బలమైన పునాదిపై కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ (71 బంతుల్లో 148; 4 ఫోర్లు, 17 సిక్సర్లు) కెరీర్ బెస్ట్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కడంతో మొదట ఇంగ్లండ్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 397 పరుగులు చేసింది. ఆఫ్ఘన్ స్పిన్ సంచలనం రషీద్ ఖాన్ (0/110) కూడా సెంచరీ చేశాడు. కాకపోతే అది బ్యాటింగ్‌లో కాదు బౌలింగ్‌లో 9 ఓవర్లు వేసిన ఈ మిస్టరీ స్పిన్నర్ వికెట్ తీయకుండా 110 పరుగులు సమర్పించుకొని చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. అనంతరం లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్థాన్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 247 పరుగులు చేసింది. హష్మతుల్లా (76; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), రహ్మత్ షా (46; 3 ఫోర్లు, 1 సిక్స్), అస్గర్ (44; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) పోరాటం.. ఓటమి అంతరాన్ని తగ్గించగలిగిందే తప్ప మ్యాచ్ ఫలితాన్ని మార్చలేకపోయింది. తుఫాన్ ఇన్నింగ్స్‌తో విరుచుకుపడ్డ మోర్గాన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

**ఆకట్టుకున్న ఆఫ్ఘన్**

అసాధ్యమైన లక్ష్యం ముందున్నా ఆఫ్ఘన్ ఏ దశలోనూ పోరాటాన్ని ఆపలేదు. కెప్టెన్ గుల్బదీన్ నైబ్ ఓపెనర్ అవతారమెత్తగా.. మరో ఎండ్‌లో నూర్ అలీ (0) రెండో ఓవర్‌లోనే డకౌటయ్యాడు. కొన్ని చక్కటి షాట్లతో అలరించిన నైబ్ (37; 4 ఫోర్లు, 1 సిక్స్) రెండో వికెట్‌కు 48 పరుగులు జోడించాక ఔటైతే.. నిలకడగా ఆడిన రహ్మత్ షా జట్టు స్కోరును వంద దాటించి పెవిలియన్ చేరాడు. ఈ దశలో ఇంగ్లండ్ పేసర్ల బౌన్సర్లను తట్టుకుంటూ అస్గర్, హష్మతుల్లా నాలుగో వికెట్‌కు 94 పరుగులు జోడించారు. వీరిద్దరి జోరు చూస్తుంటే ఆఫ్ఘన్ మంచి స్కోరే చేసేలా కనిపించినా.. ఈ జోడీ వెనుదిరిగాక నబీ (9), నజీబ్ (15), రషీద్ (8) పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్, ఆర్చర్ చెరో 3 వికెట్లు పడగొట్టారు.

**మామూలుగానే మొదలై..**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ ఇన్నింగ్స్.. పెద్దగా మెరుపులు లేకుండానే ప్రారంభమైంది. బౌలింగ్ దాడిని ఆరంభించిన ముజీబ్ తన స్పిన్‌తో కట్టిపడేయడంతో.. పవర్ ప్లే ముగిసేసరికి ఆతిథ్య జట్టు 46 పరుగులు చేసి విన్స్ (26) వికెట్ కోల్పోయింది. మరో ఓపెనర్ బెయిర్‌స్టోతో జతకలిసిన రూట్ ఆచితూచి ఆడటంతో స్కోరు నెమ్మదిగా ముందుకు కదిలింది. ఆరంభంలో జాగ్రత్తగా ఆడిన ఈ జంట కుదురుకున్నాక వేగం పెంచింది. సెంచరీకి చేరువైన బెయిర్‌స్టో రెండో వికెట్‌కు 120 పరుగులు జతచేశాక నైబ్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఫలితంగా 30 ఓవర్లు ముగిసేసరికి ఇంగ్లండ్ 164/2తో నిలిచింది.



హష్మతుల్లా (76)

### 20 ఓవర్లలో 233..

బెయిర్‌స్టో ఔటవడంతో పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లైంది ఆఫ్ఘన్ పరిస్థితి. అతడి స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన మోర్గాన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. నైబ్ బౌలింగ్‌లో రెండు వరుస సిక్సర్లతో మోత మొదలెట్టిన మోర్గాన్.. ఏ ఒక్క బౌలర్‌ను వదిలిపెట్టలేదు. బంతినందుకున్న ప్రతీ ఒక్కరినీ చీల్చి చెండాడుతూ.. సిక్సర్ల సునామీ సృష్టించాడు. దౌలత్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన ఇంగ్లండ్ కెప్టెన్ అక్కడి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. రషీద్ ఓవర్‌లో 4,6,6 కొట్టిన అతడు.. నబీ బౌలింగ్‌లో సిక్సర్‌తో 36 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ముజీబ్‌ను 4,6తో వదిలేసిన మోర్గాన్.. నబీకి రెండు సిక్సర్లు రుచి చూపించి చూస్తుండగానే 80ల్లోకి వచ్చేశాడు. ఇక రషీద్ బౌలింగ్‌లో 6,6,6తో 57 బంతుల్లో 13వ వన్డే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోసారి రషీద్ ఓవర్‌లో 3 సిక్స్‌లు అరుసుకున్న మోర్గాన్.. దౌలత్ ఓవర్‌లో 4,6 దంచాడు. మోర్గాన్ క్రీజులో అడుగు పెట్టిన సమయంలో 45 పరుగులతో ఉన్న రూట్.. ఆ తర్వాత మరో 43 పరుగులే చేయగా.. ఇయాన్ 148 రన్స్ సాధించాడు. ఈ జోరు చూస్తుంటే స్కోరు అలవోకగా 400 దాటుతుందనిపించినా.. నైబ్ ఓవర్‌లో 3 సిక్సర్లు కొట్టిన మోర్గాన్ మరో భారీ షాట్‌కు యత్నించి క్యాచ్ ఔట్‌కాగా.. రూట్ కూడా అదే ఓవర్‌లో వెనుదిరిగాడు. దీంతో మూడో వికెట్‌కు నమోదైన 189 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ తరఫున ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం. ఆఖర్లో బట్లర్ (2), స్టోక్స్ (2) ఆకట్టుకోలేకపోయినా.. మొయిన్ అలీ (9బంతుల్లో31 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్సర్లు) తనదైన శైలిలో రెచ్చిపోయి నాలుగు సిక్సర్లతో స్కోరును నాలుగొందలకు చేరువ చేశాడు. నైబ్, దౌలత్ చెరో 3 వికెట్లు పడగొట్టారు.

### స్కోరు బోర్డు

**ఇంగ్లండ్:** విన్స్ (సి) ముజీబ్ (బి) దౌలత్ 26, బెయిర్‌స్టో (సి అండ్ బి) నైబ్ 90, రూట్ (సి) రహ్మత్ షా (బి) నైబ్ 88, మోర్గాన్ (సి) రహ్మత్ షా (బి) నైబ్ 148, బట్లర్ (సి) నబీ (బి) దౌలత్ 2, స్టోక్స్ (బి) దౌలత్ 2, మొయిన్ అలీ (నాటౌట్) 31, వోక్స్ (నాటౌట్) 1.
**ఎక్స్‌ట్రాలు:** 9, **మొత్తం:** 50 ఓవర్లలో 397/6.
**వికెట్ల పతనం:** 1–44, 2–164, 3–353, 4–359, 5–362, 6–378,
**బౌలింగ్:** ముజీబ్ 10–0–44–0, దౌలత్ 10–0–85–3, నబీ 9–0–70–0, నైబ్ 10–0–68–3, రహ్మత్ షా 2–0–19–0, రషీద్ ఖాన్ 9–0–110–0.

**ఆఫ్ఘనిస్థాన్:** నూర్ అలీ (బి) ఆర్చర్ 0, నైబ్ (సి) బట్లర్ (బి) వుడ్ 37, రహ్మత్ షా (సి) బెయిర్‌స్టో (బి) ఆదిల్ 46, హష్మతుల్లా (బి) ఆర్చర్ 76, అష్గర్ (సి) రూట్ (బి) ఆదిల్ 44, నబీ (సి) స్టోక్స్ (బి) ఆదిల్ 9, నజీబ్ (బి) వుడ్ 15, రషీద్ (సి) బెయిర్‌స్టో (బి) ఆర్చర్ 8, ఇక్రామ్ (నాటౌట్) 3, దౌలత్ (నాటౌట్) 0.
**ఎక్స్‌ట్రాలు:** 9, **మొత్తం:** 50 ఓవర్లలో 247/8.
**వికెట్ల పతనం:** 1–4, 2,–52, 3–104, 4–198, 5–210, 6–234, 7–234, 8–247,
**బౌలింగ్:** వోక్స్ 9–0–41–0, ఆర్చర్ 10–1–52–3, మొయిన్ 7–0–35–0, వుడ్ 10–1–40–2, స్టోక్స్ 4–0–12–0, ఆదిల్ 10–0–66–3.

**17** ఈ మ్యాచ్‌లో మోర్గాన్ కొట్టిన సిక్సర్ల సంఖ్య. వన్డే క్రికెట్ చరిత్రలో ఇవే అత్యధికం. రోహిత్ (2013లో ఆస్ట్రేలియాపై), డివిలియర్స్ (2015లో వెస్టిండీస్‌పై), గేల్ (2015లో జింబాబ్వేపై) పేరిట సంయుక్తంగా ఉన్న 16 సిక్సర్ల రికార్డు తుడిచిపెట్టుకుపోయింది.

**4** ప్రపంచకప్ చరిత్రలో మోర్గాన్ నాలుగో వేగవంతమైన సెంచరీ (57 బంతుల్లో) నమోదు చేశాడు. కెవిన్ ఓబ్రయన్ (50 బంతుల్లో) అగ్రస్థానంలో ఉండగా.. మ్యాక్స్‌వెల్ (51 బంతుల్లో), డివిలియర్స్ (52 బంతుల్లో) ఆ తర్వాతి ప్లేస్‌లో ఉన్నారు.

**1** ప్రపంచకప్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డు కూడా మోర్గాన్ తన పేరిట లిఖించుకున్నాడు. గేల్ (16 సిక్సర్లు) రెండో స్థానానికి చేరాడు.

**25** ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ కొట్టిన మొత్తం సిక్సర్లు. ఓ వన్డే మ్యాచ్‌లో ఇవే అత్యధికం. గతంలో విండీస్‌పై 24 సిక్సర్లతో తమ పేరిటే ఉన్న రికార్డును ఇంగ్లండ్ మెరుగుపరుచుకుంది.

**11** వన్డేల్లో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (11) సమర్పించుకున్న బౌలర్‌గా రషీద్ ఖాన్ చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు.

**7** రషీద్ బౌలింగ్‌లో మోర్గాన్ కొట్టిన సిక్సర్ల సంఖ్య. వన్డేల్లో ఒక బౌలర్, ఒక బ్యాట్స్‌మన్‌కు ఇచ్చుకున్న అత్యధిక సిక్స్‌లు ఇవే. గతంలో హోల్డర్ బౌలింగ్‌లో డివిలియర్స్ రెండుసార్లు ఆరేసి సిక్సర్లు కొట్టాడు.

**397/6** ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ అత్యధిక స్కోరు. ఇదే టోర్నీలో బంగ్లాపై చేసిన 386/6 స్కోరు రెండో స్థానానికి పరిమితమైంది. ఈ వరల్డ్ కప్‌లో ఇప్పటి వరకూ ఇదే టాప్ స్కోర్ కాగా.. ఓవరాల్‌గా విశ్వవేదికపై ఇది ఆరో అత్యధికం.

**0/110** ఆఫ్ఘన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ గణాంకాలు. వరల్డ్‌కప్‌లో ఓ బౌలర్ చేసిన అత్యంత చెత్త ప్రదర్శన ఇదే. గతంలో న్యూజిలాండ్ ప్లేయర్ మార్టిన్ స్నెడెన్ (0/105; 1983 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై 12 ఓవర్లలో) అత్యధిక పరుగులు ఇచ్చుకున్న జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు.

**25** ఆఫ్ఘన్‌పై ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ కొట్టిన సిక్సర్లు. 2007 వరల్డ్‌కప్ మ్యాచ్‌లన్నింట్లో కలిపి ఇంగ్లండ్ అత్యధికంగా 22 సిక్సర్లు చేస్తే.. ఈ ఒక్క మ్యాచ్‌లోనే అంతకుమించి బాదింది. ఓవరాల్‌గా ఈ మెగాటోర్నీలో ఆడిన 5 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ 47 సిక్సర్లు కొట్టారు.

**6** వన్డేల్లో అత్యధిక సిక్సర్ల జాబితాలో మోర్గాన్ (211) ఆరో స్థానానికి చేరాడు. అఫ్రిది (పాకిస్థాన్; 351), గేల్ (వెస్టిండీస్; 318), జయసూర్య (శ్రీలంక; 270), ధోనీ (225), రోహిత్ (224) తొలి ఐదు స్థానాల్లో ఉన్నారు.

**33** వరల్డ్‌కప్‌లో ఓ మ్యాచ్‌లో నమోదైన అత్యధిక సిక్సర్లు.

### అయ్యో రషీద్..

28 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రషీద్ బౌలింగ్‌లో మోర్గాన్ ఇచ్చిన క్యాచ్‌ను డీప్ మిడ్‌వికెట్‌లో జద్రాన్ వదిలేశాడు. దాన్ని సద్వినియోగం చేసుకున్న ఇంగ్లండ్ కెప్టెన్ తర్వాతి 45 బంతుల్లో 120 పరుగులు చేసి మ్యాచ్ గతిని మార్చేశాడు. ఆ క్యాచ్ మిస్ కావడంతో అందరికంటే ఎక్కువ రషీద్ ఖాన్ ఆవేదన చెంది ఉంటాడు. ఎందుకంటే.. ఇప్పటి వరకు ఒక ఇన్నింగ్స్‌లో రెండు కంటే ఎక్కువ సిక్సర్లు ఇచ్చుకోని రషీద్ బౌలింగ్‌లో ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ 11 సిక్సర్లు దంచారు. అందులో మోర్గాన్ ఒక్కడే 7 సిక్సర్లు బాదడం కొసమెరుపు.

## 2021 జనవరిలో మహిళల క్రికెట్ ప్రపంచకప్

**క్రైస్ట్‌చర్చ్:** ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ తేదీలు ఖరారయ్యాయి. న్యూజిలాండ్ వేదికగా 2021 జనవరి 30న మెగాటోర్నీకి తెరలేవబోతున్నది. టోర్నీకి సంబంధించిన వివరాలను న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు(ఎన్‌జడ్‌సీ) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే మూడు సార్లు ప్రపంచకప్ టోర్నీకి ఆతిథ్యమిచ్చిన న్యూజిలాండ్‌లో ఇది నాలుగవది. మొత్తం 31 మ్యాచ్‌ల సమాహారంతో జనవరి 30న మొదలై ఫిబ్రవరి 20న ముగియనుంది. ఆతిథ్య హోదాలో మెగాటోర్నీకి కివీస్ అర్హత సాధించగా, ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్‌లో టాప్–4లో ఉన్న జట్లు నేరుగా టోర్నీలో పాల్గొంటాయి. మిగిలిన మూడు జట్లు క్వాలిఫయర్ ద్వారా ప్రపంచకప్ ఆడుతాయి. ప్రస్తుత చాంపియన్‌షిప్‌లో ఆస్ట్రేలియా(22), ఇంగ్లండ్(22), భారత్(16), దక్షిణాఫ్రికా(16) తొలి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

## యూఈఎఫ్‌ఏ మాజీ అధ్యక్షుడు ప్లాటిని అరెస్ట్



**పారిస్:** యూరోపియన్ సమాఖ్య ఫుట్‌బాల్ సంఘం (యూఈఎఫ్‌ఏ) మాజీ అధ్యక్షుడు, ఫ్రాన్స్ ఫుట్‌బాల్ దిగ్గజం మైఖేల్ ప్లాటినిని పారిస్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. 2022 ఫిఫా ప్రపంచకప్‌నకు ఖతార్‌ను వేదికగా ఎంపిక చేయడంలో అవకతవకలు జరిగాయనే అభియోగాలపై అవినీతి నిరోధక శాఖ ఆయనను అదుపులోకి తీసుకోగా, ప్రభుత్వ మాజీ సెక్రటరీ జనరల్ క్లాడ్ గుయంట్ ప్రశ్నించారు. 2007లో యూఈఎఫ్‌ఏ అధ్యక్షుడిగా ప్లాటిని ఎన్నికై 2015 వరకు కొనసాగారు. ఆయన ఆ పదవిలో ఉండగానే 2022 ఫిఫా ప్రపంచకప్ అతిథ్యం కోసం ఖతార్‌ను ఎంపిక చేస్తూ 2010లో వెలువడిన నిర్ణయంపై ఆరోపణలు వెల్లువెత్తాయి. అరబ్ దేశమైన ఖతార్‌లో వేసవిలో ఎండలు విపరీతంగా ఉంటాయన్న కారణంగా టోర్నీని ఏకంగా సంప్రదాయానికి విరుద్ధంగా శీతాకాలానికి మార్చాల్సి రావడం, ఆ దేశంలో మానవ హక్కుల ఆందోళనలు, స్వలింగ సంపర్కుల స్థితిగతులు తదితర సమస్యలపై అనుమానాలు రేగాయి. ఇన్ని ప్రతికూలతల మధ్య టోర్నీ నిర్వహణను ఆ దేశానికి ఎందుకు అప్పగించారన్న ప్రశ్నలు అధికమయ్యాయి. ఇందులో భాగంగానే ఫుట్‌బాల్ టోర్నీల కేటాయింపుల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఆయనను 2015లో ఫిఫా ఎథిక్స్ కమిటీ ఆరేండ్ల పాటు సస్పెండ్ చేసి, ఆ తర్వాత నాలుగేండ్లకు తగ్గించి, విచారణ చేపట్టింది. 1998లో ఫిఫా నిర్వహణ కమిటీలో సభ్యుడైన ప్లాటిని.. 2002 నుంచి నిషేధానికి గురయ్యే వరకు ఫిఫా ఎగ్జిక్యూటివ్ కమిటీలో కొనసాగారు.

## ఆ బ్యానర్ వాస్తవం కాదు

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్‌లో అత్యంత ఆసక్తిరేపిన భారత్, పాకిస్థాన్ మ్యాచ్ ముగిసినా..ఇరు దేశాల అభిమానులు సోషల్‌మీడియాను సందేశాలతో ముంచెత్తుతున్న సంగతి తెలిసిందే. దాయాదితో మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఆటతీరును మెచ్చుకుంటుంటే..మరోవైపు ఏడో ఓటమి చవిచూసిన పాక్ ఫ్యాన్స్..కారాలు, మిరియాలు నూరుతున్నారు. ఈ క్రమంలో ఓ ఆసక్తికర ఫొటో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 'మాకు కశ్మీర్ వద్దు..విరాట్ కోహ్లీని ఇవ్వండి' అంటూ పాక్ అభిమానులు ప్రదర్శించిన బ్యానర్ వాస్తవం కాదని తేలింది. ఇబిన్ సినా షేర్ చేసిన ఈ ఫొటోను కొన్ని నిమిషాల్లోనే వందల మంది షేర్ చేయడంతో పాటు లైక్ చేశారు. అయితే గతంలో ఓసారి 'వీ వాంట్ ఆజాదీ' అంటూ ఉన్న ఫొటోను కోహ్లీ పేరుతో మార్ఫింగ్ చేసి పోస్ట్ చేయడంతో ప్రస్తుతం వార్తల్లో హాట్ టాపిక్కైంది.




## పాక్ జట్టుకు తల్లిని కాను

### వీణా మాలిక్‌కు సానియా కౌంటర్



**మాంచెస్టర్:** ప్రపంచకప్‌లో భారత్ చేతిలో పాకిస్థాన్ చిత్తుగా ఓడిపోవడంపై విమర్శల జడివాన కొనసాగుతూనే ఉన్నది. తమ దేశ క్రికెటర్లపై పాక్ మాజీ ఆటగాళ్లతో పాటు అభిమానులు దుమ్మెత్తిపోస్తుంటే...భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా..పాక్ నటి వీణా మాలిక్ ఒకరిపై ఒకరు మాటల యుద్ధానికి దిగారు. టీమ్‌ఇండియాతో మ్యాచ్‌కు ముందు రోజు సానియాతో కలిసి భర్త షోయబ్ మాలిక్, వహాబ్ రియాజ్, ఇమాద్ వసీం, ఇమాముల్ హక్ ఎంజాయ్ చేయడం వివాదానికి కారణమైంది. భారత్‌తో మ్యాచ్‌ను సీరియస్‌గా తీసుకోవాల్సిందిపోయి... హోటల్లో హుక్కా తాగుతూ ఎంజాయ్ చేయడంపై పాక్ అభిమానులు సోషల్ మీడియాలో అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. సానియా, వీణ అయితే మాటకు మాట అనుకున్నారు. మొదట వీణ ట్వీట్ చేస్తూ 'సానియా నీ కొడుకు ఇజాన్‌ను శీషా ప్యాలెస్ తీసుకుపోయావేమోనని చాలా ఆందోళన పడ్డాను. అక్కడ జంక్ ఫుడ్ సర్వ్ చేస్తుంటారు. అది మీకు మాత్రమే కాదు ఆటగాళ్లకు కూడా హాని కల్గిస్తుంది. అయినా ఓ తల్లిగా, అథ్లెట్‌గా ఎలాంటి ఆహారం తీసుకోవాలనే నీకు బాగా తెలుసనుకుంటా' అని ట్వీట్ చేసింది. దీనికి సానియా ఘాటుగా స్పందించింది. 'వీణా..నేను నా కొడుకును శీషా ప్యాలెస్‌కు తీసుకెళ్లలేదు. అయినా నా పిల్లాడిని ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో నాకు బాగా తెలుసు. ఇక రెండోది పాక్ జట్టుకు డైటీషియనో, తల్లినో, ప్రిన్సిపల్, టీచర్‌నో కాదు. వాళ్లు ఏం తింటారు, ఎప్పుడు నిద్రపోతారో నాకేం తెలుసు. మా పట్ల మీరు ఇంత శ్రద్ధ చూపిస్తున్నందుకు ధన్యవాదాలు. కొందరు నెటిజన్లు ఇలాంటి ట్వీట్లు చేస్తూ నాకు పిచ్చెక్కిస్తుంటారు. అలాంటివి పోగొట్టుకోవడానికి వేరే మార్గాలు ఎంచుకోండి' అని ట్వీట్ చేసింది. మరోవైపు మాలిక్ స్పందిస్తూ 'ఆటగాళ్లందరి పక్షాన నేను కోరేది ఒక్కటే. మా కుటుంబాల పట్ల మీడియా, అభిమానులు గౌరవాన్ని పాటించండి. అనవసర విషయాల్లోకి మమ్మల్ని లాగకండి, అది కరెక్ట్ కాదు' అని ట్వీట్ చేశాడు.

## చావో.. రేవో..

### నేడు న్యూజిలాండ్‌తో దక్షిణాఫ్రికా పోరు


విలియమ్సన్ డుప్లెసిస్

**బర్మింగ్‌హామ్:** ప్రపంచకప్‌లో మరో రసవత్తర పోటీకి రంగం సిద్ధమైంది. టోర్నీలో మూడు ఓటముల తర్వాత ఇటీవలే ఆఫ్ఘనిస్థాన్‌పై గెలిచిన దక్షిణాఫ్రికా... ఆడిన అన్నింటిలోనూ గెలిచిన న్యూజిలాండ్‌తో బుధవారం తలపడనుంది. సెమీస్ రేసులో నిలువాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో సర్వశక్తులూ ఒడ్డేందుకు సఫారీ ప్లేయర్లు సిద్ధమయ్యారు. శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ వంటి తక్కువ ర్యాంకు జట్లపై గెలిచి.. పటిష్ఠమైన భారత్‌తో వర్షం కారణంగా మ్యాచ్ రద్దవడంతో కివీస్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉండగా.... దక్షిణాఫ్రికా ఏడో స్థానంలో ఉంది. టోర్నీలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న కివీస్‌ను.. దక్షిణాఫ్రికా ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

**కివీస్ పేస్ బలం:** ప్రపంచకప్‌లో కివీస్ పేసర్లు అద్భుతంగా రాణించి ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోర్లకే కట్టడి చేసి.. తమ బ్యాట్స్‌మెన్ పనిని సులువు చేశారు. మ్యాట్ హెన్రీ, బౌల్ట్, ఫెర్గూసన్, నీషమ్‌లతో పాటు గ్రాండ్‌హోమ్ సైతం రాణిస్తుండడం కివీస్‌కు కలిసివచ్చింది. అయితే ఇంతవరకు కాస్త చిన్నజట్లపైనే విజృంభించిన వారికి దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయడం సవాలే. ఫామ్‌లోకి వచ్చిన ఓపెనర్లు ఆమ్లా, డీకాక్‌ను నిలువరించాలంటే బౌల్ట్ రాణించడం కీలకం. అయితే కివీస్‌కూ బలమైన బ్యాటింగ్ లైనప్ ఉంది. గప్టిల్, కెప్టెన్ విలియమ్సన్, రాస్ టేలర్ ఇప్పటికే మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌లు ఆడారు. వారితో పాటు మిడిలార్డర్‌లో లాథమ్, నీషమ్ రెచ్చిపోతే తిరుగుండదు. అయితే వెటరన్ స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్‌ను ఎదుర్కోవడమే వారికి పెద్దసవాల్.

**ఎంగ్డీ రీఎంట్రీ:** ఎన్నో అంచనాలతో టోర్నీలో అడుగుపెట్టిన దక్షిణాఫ్రికా మొదటి మూడు మ్యాచ్‌ల్లో ఓడి.. వెస్టిండీస్‌తో పోరు వర్షార్పణమయ్యాక.. ఆఫ్ఘన్‌పై గెలిచింది. ఇక సెమీస్ చేరాలంటే ఆ జట్టుకు ప్రతీమ్యాచ్ గెలవడం తప్ప మరో మార్గం లేదు. గాయంతో దూరమైన ఎంగ్డీ తిరిగి జట్టులో చేరడం సఫారీలకు కాస్త ఊరటనిచ్చే అంశం. సీనియర్ బ్యాట్స్‌మెన్ ఆమ్లా బాధ్యతగా ఆడి డికాక్‌తో కలిసి భారీ ఓపెనింగ్ సాధించాల్సిన అవసరముంది. అలాగే కెప్టెన్ డుప్లెసిస్ సైతం స్థాయికి ప్రదర్శన చేస్తేనే బలమైన కివీస్ బౌలింగ్‌ను సమర్థంగా తిప్పికొట్టే అవకాశముంటుంది.

# 22న ఉప్పల్ శిల్పారామం ప్రారంభం

- హాజరుకానున్న మంత్రులు మహమూద్అలీ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఉప్పల్ శిల్పారామం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** భాగ్యనగర ప్రజలకు పల్లె అందాలను, అనుభూతిని పంచేందుకు మరో శిల్పారామం సిద్ధమయింది. హస్తకళలు, చేనేత వస్త్రాలకు నిలయంగా ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో ఏర్పాటుచేసిన మినీ శిల్పారామం ఈ నెల 22న ప్రారంభం కానున్నది. ఈ మేరకు హెచ్‌ఎండీఏ, శిల్పారామం విభాగాల అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రులు మహమూద్‌అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వీ శ్రీనివాస్‌గౌడ్ దీనిని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేస్తున్నారు. హెచ్‌ఎండీఏకు చెందిన ఉప్పల్ భగాయత్‌లోని ఏడున్నర ఎకరాల స్థలంలో రూ. ఐదు కోట్లతో మినీ శిల్పారామాన్ని నిర్మించారు. మాదాపూర్‌లో ఉన్న శిల్పారామం తరహాలోనే హస్తకళలు, చేనేత వస్త్రాల కోసం 50 స్టాళ్లను ఏర్పాటుచేశారు. అలాగే పిల్లలు ఆడుకోవడానికి ప్లే గ్రౌండ్, పెద్దలు సేదతీరడానికి పచ్చని మైదానం, చూపరులను ఆకట్టుకొనే రీతిలో శిల్పారామం ఆర్చీ (ప్రవేశ ద్వారాన్ని) ఏర్పాటుచేశారు. దీనికి ఎదురుగా ఫౌంటేన్‌ను నిర్మించారు. విభిన్న రుచులతో ఫుడ్‌కోర్టు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు పెద్ద యాంఫీ థియేటర్‌ను సిద్ధం చేశారు. వెదురు బొంగులతో నిర్మించిన స్టాళ్లు ఆకట్టుకొంటున్నాయి.

## పర్యాటక అభివృద్ధి మేనేజర్లకు శిక్షణ

- కార్పొరేషన్ చైర్మన్ భూపతిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పర్యాటక అభివృద్ధికి ఒత్తిడిని అధిగమించేందుకు యూనిట్ మేనేజర్లకు నాలుగురోజులపాటు శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పన్యాల భూపతిరెడ్డి తెలిపారు. విద్యానగర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో మంగళవారం ప్రారంభమైన నాలుగు రోజుల సాఫ్ట్‌స్కిల్స్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆతిథ్య రంగంలో ఎదురయ్యే కొత్త సవాళ్లు, అభివృద్ధి గురించి అవగాహన పెంచేందుకు ప్రత్యేక శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఐహెచ్‌ఎం ప్రిన్సిపల్ సంజయ్‌ఠాకూర్, ప్రవీణ్‌జోయల్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు ఇబ్బందిపడకుండా చర్యలు

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ
- వివిధ శాఖల అధికారులతో పలు అంశాలపై చర్చ



మంగళ వారం వివిధ శాఖల అధికారులతో సమావేశమైన మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులను ఎలాంటి జాప్యం లేకుండా జారీచేసేందుకు చర్యలు తీసుకొంటున్నామని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. అక్రెడిటేషన్ గడువు ఈ నెల 30తో ముగియనుండటంతో కొత్త కార్డుల జారీలో ఒకవేళ జాప్యం జరిగినపక్షంలో జర్నలిస్టులకు ఇబ్బందులు తలెత్తకుండా హెల్త్‌కార్డులు, బస్‌పాస్ సౌకర్యాన్ని పాత కార్డుల ఆధారంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మంగళవారం మీడియా అకాడమీ కార్యాలయంలో సమాచార, ఆర్టీసీ, ఆరోగ్యశ్రీ అధికారులతో అల్లం నారాయణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేండ్లలో 4,825 మంది జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులకు 12,783 రకాల వైద్యచికిత్సలు అందించినట్టు తెలిపారు. జర్నలిస్టుల బస్‌పాసులకు ప్రత్యేక రంగు వాడాలన్నారు. కార్పొరేట్ వైద్యం అందించడంలో ఇబ్బందులు ఉన్నాయన్న వార్తలు నిరాధారమని, సరైన పద్ధతిలో హెల్త్‌కార్డులు వినియోగించుకొనేలా చూడాలని అధికారులు వివరించారు. ములుగు, నారాయణపేట జిల్లాలు కొత్తగా ఏర్పాటైనందున.. అక్రెడిటేషన్, బస్‌పాసులు, హెల్త్‌కార్డులు ఆయా జిల్లాల పేరిట ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మీడియా అకాడమీ కార్యదర్శి డీఎస్ జగన్, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ జేఈవో సుధాకర్‌రావు, ఆర్టీసీ చీఫ్ పీఆర్వో కిరణ్‌కుమార్‌రెడ్డి, ఐ అండ్ పీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ హష్మీ, మేనేజర్ లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.





నేరెళ్ల వేణుమాధవ్ యాదిలో రవీంద్రభారతిలో నిర్వహించిన స్వరార్చనలో మాజీ గవర్నర్ రోశయ్యను సన్మానిస్తున్న ప్రభుత్వ సలహాదారు రమణాచారి తదితరులు

## నేరెళ్ల వేణుమాధవ్‌కు శిష్యుల స్వరార్చన

**రవీంద్రభారతి:** విశ్వవిఖ్యాత మిమిక్రీ కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్‌కు మంగళవారం ఆయన శిష్య బృందం 'స్వరార్చన'తో అంజలి ఘటించింది. బుధవారం వేణుమాధవ్ వర్ధంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా, సాంస్కృతికశాఖ సౌజన్యంతో మిమిక్రీ ఆర్టిస్టుల సంక్షేమ సంఘం రవీంద్రభారతిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మిమిక్రీ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రముఖి చంద్రశేఖర్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 80 మంది కళాకారులు వైవిధ్యభరితమైన మిమిక్రీ అంశాలను ప్రదర్శించి వేణుమాధవ్‌కు నివాళులర్పించారు.తమిళనాడు మాజీ గవర్నర్ కే రోశయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. క్రమశిక్షణకు వేణుమాధవ్ నిలువెత్తు నిదర్శనమని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వేణుమాధవ్ ఎన్నో మిమిక్రీ ప్రదర్శనలతో అలరించడమే కాకుండా అనేకమంది శిష్యులను తీర్చిదిద్దారని శ్లాఘించారు. మిమిక్రీ ఆర్టిస్టుల సంక్షేమ సంఘానికి సహాయసహకారాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో నేరెళ్ల రాధాకృష్ణ, నటులు లోహిత్, శివప్రసాద్, మిమిక్రీ కళాకారులు మల్లం రమేశ్, ఆర్సీఎం రాజు, రాజ్‌కుమార్, ఆల్‌రౌండర్ రవి, భిక్షుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం నిల్వలకు గోదాములు ఇవ్వండి

ఎఫ్‌సీఐ, సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ అధికారులను కోరిన అకున్‌సబర్వాల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం దిగుబడులకు అనుగుణంగా బియ్యం నిల్వలకు అవసరమైన గోదాములను కేటాయించాలని భారత ఆహార సంస్థకు (ఎఫ్‌సీఐ) రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్ విజ్ఞప్తి చేశారు. డిమాండ్‌కు అనుగుణంగా ముఖ్యంగా బాయిల్డ్‌రైస్ నిల్వలకు స్టోరేజ్ స్పేస్ కేటాయించకపోవటం వల్ల సమస్యలు ఎదుర్కోవలసి వస్తున్నదని, దీనివల్ల తెలంగాణ ప్రభుత్వంపై ఆర్థికంగా భారం పడుతున్నదని అన్నారు. గోదాముల్లో స్టోరేజ్ స్పేస్‌పై మంగళవారం పౌరసరఫరాల భవన్‌లో ఎఫ్‌సీఐ, సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది వానకాలం, యాసంగిలో 77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాలశాఖ కొనుగోలు చేసిందన్నారు. వీటిలో రాష్ట్ర అవసరాలకు పోను మిగిలిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించేందుకు మిల్లర్లు సిద్ధంగా ఉన్నా స్టోరేజ్ స్పేస్ చూపకపోవటం వల్ల జాప్యం జరుగుతున్నదని చెప్పారు. వచ్చే ఏడాది కూడా దిగుబడులు భారీగా ఉండే అవకాశాలు ఉన్నాయని, దాన్ని దృష్టిలో పెట్టుకొని గోదాములను కేటాయించాలని కోరారు. దీనిపై త్వరలో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం కావాలని నిర్ణయించారు. నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల, పెద్దపల్లి, వరంగల్ (రూరల్), మహబూబ్‌నగర్ జిల్లాల్లో గోదాముల సమస్య తీవ్రంగా ఉన్నదని, దీన్ని వెంటనే పరిష్కరించాలని సూచించారు.

# సర్కారు బడులు కళకళ!

- ప్రైవేటు నుంచి వలసలతో పెరుగుతున్న విద్యార్థుల నమోదు
- బడిబాటతో 1,73,378 మంది విద్యార్థులు కొత్తగా నమోదు
- మరో 1.10 లక్షల మంది చేరే అవకాశం: విద్యాశాఖ కమిషనర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సర్కారు బడులు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం మంచి ఫలితాలిస్తున్నది. ఈ నెల 14 నుంచి రాష్ట్రంలో బడిబాట ప్రచారం కొనసాగుతుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెరుగుతున్నదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ క్రమంలో ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వలస వస్తున్నారని, దీంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఇది సాధ్యమయితుందని అభిప్రాయపడ్డారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులమోత, గ్రామీణ ప్రాంత పాఠశాలలు మెరుగవడంతో విద్యార్థులు తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు వస్తున్నారని తెలిపారు. బడిబాటలో భాగంగా ఈ నెల 17 వరకు సర్కారు బడుల్లో కొత్తగా నమోదైన విద్యార్థుల వివరాలను ఆయన మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 17 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో 1,73,378 మంది విద్యార్థులు నమోదయ్యారని చెప్పారు. ఇంకా రెండురోజులకు సంబంధించిన జిల్లాల వారీ నివేదికలు రావాల్సి ఉందని అన్నారు. మంగళ, బుధవారాల్లో మరో 1.10 లక్షల మంది వరకు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నమోదయ్యే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. బడిబాట ప్రచారంతో 2019-20 విద్యాసంవత్సరంలో దాదాపు 2.85 లక్షల మంది విద్యార్థులు నమోదు పెరిగే అవకాశాలున్నాయని చెప్పారు. ఈ క్రమంలోనే బడి బయట పిల్లలను, బాలకార్మికులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.



# హోదా ఏపీ ప్రజల శ్వాస

- ఇచ్చేదాకా కేంద్రంపై ఒత్తిడి తెస్తాం: ఏపీ సీఎం జగన్
- హోదా తీర్మానంపై అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రత్యేక హోదా ఏపీ ప్రజల శ్వాస అని, హోదా ఇచ్చేవరకు కేంద్రంపై ఒత్తిడితేస్తూనే ఉంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. అందరి జీవితాల్లో మార్పు తేవాలనే లక్ష్యంతో పనిచేస్తామని, తాము ప్రవేశపెట్టిన నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా సామాజిక మంత్రి మండలిని ఏర్పాటుచేశామని చెప్పిన జగన్.. నామినేటెడ్ పోస్టుల్లో కూడా సామాజిక న్యాయం పాటిస్తామని తెలిపారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై చేసిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తీర్మానంపై విపక్ష సభ్యులు మాట్లాడిన అనంతరం.. సీఎం జగన్ సుదీర్ఘంగా ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో పాలనా వ్యవస్థలు నాశనమయ్యాయని, ధ్వంసమైన రాజకీయ వ్యవస్థను సమూలంగా మార్చడం కోసమే సీఎంగా ప్రమాణంచేశానని జగన్ పేర్కొన్నారు. నీతివంతమైన పరిపాలన అందిస్తామని, అలా చేస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని అన్నారు. పారదర్శక టెండర్ల ప్రక్రియ కోసం జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటుచేస్తామని తెలిపారు. ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా రానున్న ఐదేండ్లు తమ ప్రణాళికలు ఉంటాయన్నారు. 'మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ వలే భావిస్తాం. సీఎం, మంత్రుల చాంబర్లు చూస్తే మా మ్యానిఫెస్టో కనబడుతుంది. రైతులకు సున్నా వడ్డీకే రుణాలు ఇస్తాం. అక్టోబర్ 15 నుంచి వైఎస్సార్ రైతు భరోసా ప్రారంభిస్తాం. రైతన్నల సంక్షేమానికి రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేస్తాం. రెండువేల కోట్లతో ప్రకృతి వైపరీత్యాల నిధిని ఏర్పాటుచేస్తాం. విద్యా హక్కు చట్టాన్ని పునరుద్ధరిస్తాం. జనవరి 26న అమ్మఒడి పథకం కింద ప్రతి తల్లికి రూ.15 వేలు ఇస్తాం. వచ్చే ఐదేండ్లలో నిరక్షరాస్యత శాతాన్ని సున్నాకి తీసుకొస్తాం. పారిశుద్ధ్య కార్మికులకు, ఆశా వర్కర్లకు, అంగన్‌వాడీలకు జీతాలు పెంచాం. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంచేస్తాం. అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం చెల్లించాం. ఆగస్టు 15న ఐదు లక్షల మంది గ్రామ వాలంటీర్లను నియమిస్తాం. అక్టోబర్ రెండున గ్రామ సచివాలయాలను ప్రారంభించి పది మందికి ఉద్యోగాలు ఇస్తాం. ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్‌ను రద్దుచేస్తాం. జూలై ఒకటి నుంచి ఉద్యోగులకు 27 శాతం ఐఆర్ ఇస్తాం' అని వివరించారు.

### ప్రత్యేక హోదా సాధించలేకపోయాం: చంద్రబాబు

ఏపీకి ప్రత్యేక హోదాను తాము సాధించలేకపోయామని, హోదా సాధన బాధ్యతను ప్రజలు వైఎస్సార్సీపీకే ఇచ్చారని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఏపీ ప్రత్యేక హోదా తీర్మానంపై చర్చలో భాగంగా మంగళవారం చంద్రబాబు మాట్లాడారు. గడిచిన ఐదేండ్లకాలంలో హోదా సాధన కోసం ప్రయత్నించామని, కానీ తమ వల్ల కాలేదని పేర్కొన్నారు. తాము విఫలమైనందుకు ప్రజలు వైఎస్సార్సీపీకి 151 ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీలను ఇచ్చారని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయడానికి తెలంగాణకు చెందిన ఏడు ముంపు మండలాలను తమ ప్రభుత్వమే ఏపీలో విలీనం చేసిందని గుర్తుచేశారు.

### అసెంబ్లీ నిరవధిక వాయిదా

ఆంధ్రప్రదేశ్ ఉభయసభలు మంగళవారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. కొత్త ప్రభుత్వం ఎన్నికైన తర్వాత తొలిసారిగా జరిగిన అసెంబ్లీ సమావేశాలు ఐదురోజులపాటు (19 గంటల 25 నిమిషాలపాటు) నడిచాయి. 175 మంది సభ్యులు ప్రసంగించారు. ఏపీకి ప్రత్యేక హోదాపై శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది.



కోన రఘుపతిని స్పీకర్ స్థానంలోకి తోడ్కొని వెళ్తున్న ఏపీ సీఎం జగన్

### డిప్యూటీ స్పీకర్ కోన

ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా గుంటూరు జిల్లా బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలుచేయడంతో డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైనట్టు స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం అధికారికంగా ప్రకటించారు. అనంతరం సభానాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు తదితరులు రఘుపతిని స్పీకర్ స్థానం దగ్గరకు సాదరంగా తీసుకెళ్లి కూర్చోబెట్టి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాసనసభ్యులంతా డిప్యూటీ స్పీకర్‌కు అభినందనలు తెలియజేశారు.

## తాసిల్దార్ల వివరాలు పంపండి


కలెక్టర్లకు సీసీఎల్‌ఏ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని తాసిల్దార్ల వివరాలను నిర్దిష్టమైన ఫార్మాట్‌లో గురువారంలోగా పంపించాలని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు అందాయి. జిల్లా, తాసిల్దారు పేరు, పుట్టినతేదీ, సొంత జిల్లా, నియామక తేదీ, హోదా, పనిచేస్తున్న ప్రాంతం, ఎప్పటి నుంచి ఎప్పటివరకు, పదవీ విరమణ తేదీ, పెండింగ్‌లో ఉన్న కేసులు.. తదితర సమాచారాన్ని పంపించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

## రేపటినుంచి డీఈడీ కౌన్సెలింగ్

అందుబాటులో 10,500 సీట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో డీఈడీ కళాశాలల్లో సీట్ల భర్తీకి గురువారం నుంచి కౌన్సెలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 22 వరకు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తిచేసి, 23 నుంచి 25 వరకు వెబ్‌ఆప్షన్ ప్రక్రియ కొనసాగుతుందని డీఈఈసెట్-2019 కన్వీనర్ ఏ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 160 డీఈడీ కాలేజీలు ఉండగా, 10,500 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డీఈఈసెట్ ఫలితాల్లో 12,500 మంది విద్యార్థులు మాత్రమే అర్హత సాధించినట్టు కన్వీనర్ తెలిపారు.



## బాబు విదేశీటూర్లతో ప్రజాధనం దుబారా

ట్విట్టర్‌లో విజయసాయిరెడ్డి ఫైర్

**అమరావతి:** తన పరిపాలనలో ఏపీ మాజీ సీఎం చంద్రబాబు వేల కోట్ల ప్రజాధనాన్ని అవసరం లేని సమ్మిట్లు, విదేశీ ప్రయాణాలకు దుబారాగా ఖర్చు చేశారని వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపించారు. 'చంద్రబాబు విదేశీ టూర్ల ఖర్చుకు సంబంధించి జీఏడీ జారీచేసిన ఒక పత్రం సోషల్ మీడియాలో వైరల్ అయింది. మొదటి ఆరు నెలల్లో సారు నెలరోజులు విదేశాల్లోనే ఉన్నారు. మందీమార్బలాన్ని వెంటేసుకొని సింగపూర్, చైనా, స్విట్జర్లాండ్, జపాన్ సందర్శించారు. ఏం సాధించారో ఎక్కడా కనిపించదు' అని ట్విట్టర్‌లో ఎద్దేవా చేశారు.

## ప్రధాని భేటీకి టీడీపీ దూరం

**అమరావతి:** ప్రధాన మోదీ అధ్యక్షతన బుధవారం జరుగనున్న భేటీకి దూరంగా ఉండాలని టీడీపీ నిర్ణయించింది. ఎన్నికలపై ఏకపక్ష నిర్ణయం తీసుకోకుండా అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలని పార్టీ తరపున కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయించారు. కాగా, చంద్రబాబు తన కుటుంబంతో అమెరికాకు వెళ్తున్న నేపథ్యంలో భేటీకి దూరంగా ఉండాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

## దేశవ్యాప్తంగా శ్రీవారి ఆలయాల నిర్మాణం

**తిరుమల:** దేశవ్యాప్తంగా వేంకటేశ్వస్వామి వారి ఆలయాలను నిర్మించాలని సంకల్పించిన టీటీడీ.. ఇందుకోసం శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణ (శ్రీవాణి) ట్రస్టును ఏర్పాటుచేసింది. శ్రీవాణి ట్రస్టు మంగళవారం తిరుమలలో సమీక్ష సమావేశం నిర్వహించింది. భక్తులు, దాతల నుంచి విరాళాలు సేకరించాలని నిర్ణయించినట్టు ఆలయ సీనియర్ అధికారి తెలిపారు.

## బీజేపీలో చేరిన కొత్తపల్లి గీత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత బీజేపీలో చేరారు. మంగళవారం ఢిల్లీలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సమక్షంలో కాషాయ కండువా కప్పుకొన్నారు. గత ఏడాది తాను స్థాపించిన జన జాగృతి రాజకీయ పార్టీని బీజేపీలో విలీనంచేశారు.




నమస్తే తెలంగాణ
జిందగీ
బుధవారం 19 జూన్ 2019 WWW.NTNEWS.COM /nt.zindagi

# కిస్మిస్ తింటున్నారా?

**ఆరోగ్యానికి కావాల్సిన పోషకాహారం డ్రైఫ్రూట్స్‌లో బాగా ఉంటుంది. ముఖ్యంగా డ్రైఫ్రూట్స్‌లో మనకు బాగా తెలిసింది కిస్మిస్. వీటిని తినడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.**



- ఎండుద్రాక్షలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. కాబట్టి దీన్ని తినడం వల్ల రక్తహీనత సమస్య పరిష్కారమవుతుంది. రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. కిస్మిస్ తినడం వల్ల దంత సమస్యలు, చిగుళ్ల వ్యాధులు తగ్గుతాయి. కాలేయ పనితీరునూ మెరుగుపరుస్తుంది.
- మూత్రపిండాలు, పేగు, మూత్రాశయం సమస్యలతో బాధపడుతున్న వారికి ఎండు ద్రాక్ష ఎంతగానో ఉపయోగపడుతుంది. ఊపిరితిత్తుల పనితీరు సరిగ్గాలేనివాళ్లు ఎండు ద్రాక్షను రోజూ తింటే ఆ సమస్యల నుంచి బయటపడవచ్చు.
- పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరిగేందుకు ఎండుద్రాక్ష బాగా పనిచేస్తుంది. వీటిలో పొటాషియం, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. దాంతో ఇవి ఆర్థరైటిస్‌తో బాధపడేవాళ్లకు ఎంతో మేలు చేస్తాయి. ఇందులోని ఫినాలిక్ పదార్థాలు వివిధ రకాల క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటాయి.
- తరచూ ఎండుద్రాక్ష తింటే రక్తపోటు, మధుమేహం అదుపులో ఉంటాయి. ఆకలి వేసినప్పుడు స్నాక్స్ కంటే వీటిని తినడం మేలు. ఎండు ద్రాక్షలోని పీచు.. జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. ఆహారం సరిగా జీర్ణం కాని వారు రోజూ కిస్మిస్ తింటే మంచిది.
- రోజూ గుప్పెడు ఎండుద్రాక్ష తింటే రోగనిరోధక శక్తిపెరుగుతుంది. మలబద్ధకం, డయేరియా నివారణకు కిస్మిస్ బాగా పనిచేస్తుంది. శరీరంలో మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు ఇది సాయం చేస్తుంది.


## కరివేపాకుతో ప్రయోజనాలెన్నో



**కూరల్లో కరివేపాకు వేస్తారు. కంచంలోకొచ్చేసరికి మాత్రం కరివేపాకే కదాని తీసిపారేస్తారు. కానీ కరివేపాకు చేసే మేలు అంతా ఇంతా కాదు. కరివేపాకు వల్ల లాభాలు తెలిస్తే ఇకపై అస్సలు తీసిపారేయరు!**

- బరువు తగ్గాలనుకునేవారు ఆహారంలో కరివేపాకును తప్పకుండా చేర్చుకోవాలి. రోజూ నాలుగు కరివేపాకులను తినడం వల్ల శరీరంలో కొవ్వు నిల్వలు కరుగుతాయి. తద్వారా బరువు తగ్గేందుకు అవకాశం ఉన్నది.
- కరివేపాకులో లభించే ల్యూటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచి రోగాల బారిన పడకుండా కాపాడుతుంది. దీనిలో ఫోలిక్ యాసిడ్, నియాసిన్, బీటా కెరటిన్, ఇనుము, కాల్షియం, ఫాస్పరస్, పీచు, మాంసకృత్తులు, కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి.
- కరివేపాకును రోజూ ఆహారంలో తీసుకోవడం వల్ల అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలు దూరమవుతాయి. బాలింతల్లో పాలు బాగా పడడానికి కరివేపాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. చిన్నారుల ఆహారంలో కరివేపాకును భాగం చేస్తే వారి ఎదుగుదల బాగుంటుంది.
- కిడ్నీరోగులు కరివేపాకును ఎక్కువగా తింటే త్వరగా కోలుకోవచ్చు. కంటి సమస్యలకు కూడా కరివేపాకు మెడిసిన్‌లా పనిచేస్తుంది. రోజూ దీన్ని ఆహారంలో భాగంగా తీసుకుంటే వయసుతో పాటు వచ్చే కంటి సమస్యలను దూరం చేసుకోవచ్చు.


## ప్రయాణాలే పాఠాలుగా మారాయి



**పిల్లలు చురుగ్గా, తెలివిగతేటలతో పెరుగాలంటే పెద్ద స్కూల్లో చదివిస్తే సరిపోదు. ఇంట్లో కూర్చుని టీవీ చూస్తే నాలెడ్జ్ అంతకన్నా పెరుగదు. పిల్లలకు నేర్పించే ప్రతి విషయాన్ని ప్రాక్టికల్‌గా చూపించాలంటున్నది ఈ మహిళ.**

బెంగళూరుకు చెందిన లక్షనా, శ్రావణ్ దంపతులకు ఒక్కగానొక్క కొడుకు. అతని పేరు నైతిక్. నాలుగేండ్ల నైతిక్‌కు ఫుట్‌బాల్ అంటే చాలా ఇష్టం. తన అబ్బాయి చదువుతో పాటు అన్ని విషయాల్లో ముందుండాలి అనుకున్నది లక్షనా. రోజూ ఉదయాన్నే నైతిక్ మూడు గంటల పాటు ఆటలు ఆడుకుంటాడు. ఈ విధంగా నైతిక్ ఆటలు ఆడిన రోజు చాలా యాక్టివ్‌గా కనబడుతుండేవాడు. కొన్ని రోజులు ఇవేం చేయకుంటే బాగా నిద్రపోయేవాడు. ఆ సమయంలో డల్‌గా అయ్యేవాడు. అందుకే నైతిక్‌ను నిమిషం కూడా ఖాళీగా ఉంచకుండా పాటలు, డాన్స్, రంగులు వేయడం నేర్పిస్తున్నది తల్లి. తన పిల్లాడిలాగే ఇతర పిల్లలూ ఉంటారని అనుకుంది. అందుకే స్కూల్ సెలవుల సమయంలో ఇతర పిల్లలను కూడా పర్యాటక ప్రదేశాలకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ ట్రిప్‌లకి.. 'ట్రిప్‌స్టర్ బడ్డీస్' పేరుతో నెలకోసారి లక్షనా ఫ్రెండ్స్ అందరూ వారి పిల్లలతో టూర్ ప్లాన్ చేస్తుంటారు. ఈ విధంగా ప్రత్యక్షంగా చూసిన ప్రదేశాల నుంచి భూగోళశాస్త్రం, చరిత్ర, గణితం, భాషా, సంస్కృతి, సహనం వంటి విషయాలు సమాజం పట్ల అవగాహన కల్పిస్తుంటారు. ఇప్పటికి మూడు ట్రిప్‌లు అయ్యాయి. భవిష్యత్‌లో మరిన్ని ట్రిప్పులు వేసే దిశగా లక్షనా ఆలోచిస్తున్నది.

## పాదాలు జరభద్రం



**సాధారణంగా మహిళలు ఎక్కువగా నీటిలోనే రోజువారీ పనులు చేయాల్సి ఉంటుంది. ఈ కారణంగా వారి పాదాలు పాడవుతుంటాయి. వర్షాకాలంలో ఈ సమస్య తీవ్ర రూపం దాలుస్తుంది. ఈ చిన్న చిట్కాలు పాటిస్తే చాలు పాదాల పగుళ్ల నుంచి ఉపశమనం పొందవచ్చు.**

- వర్షాకాలంలో వీలైనంత వరకు షూస్ ధరించకూడదు. ఎందుకంటే వర్షంలో తడిసినప్పుడు లేదా వర్షపు నీటిలో నడిచినప్పుడు షూస్ బాగా తడిసి పాదాలకు ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఉంటుంది. కాబట్టి షూస్ కాకుండా తేలికగా ఉండే స్లిప్పర్స్, శాండిల్స్ వేసుకోవాలి.
- వర్షంలో తడిసినా వర్షపు నీటిలో నడిచినా ఇంటికి రాగానే పాదాలను శుభ్రంగా కడుక్కోవాలి. అనంతరం తడి లేకుండా తుడుచుకోవాలి. ముఖ్యంగా కాలి వేళ్ల మధ్య, చేతి వేళ్ల మధ్య తడిగా ఉండకుండా చూసుకోవాలి. పడుకునే ముందు పాదాలకు మాయిశ్చరైజర్ రాసుకోవాలి.
- వారానికి ఒకసారి పెడిక్యూర్ చేసుకోవాలి. ఒక చిన్న టబ్‌లో గోరువెచ్చటి నీళ్లు వేసి.. దానిలో నిమ్మరసం, హ్యాండ్ వాష్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. అందులో పాదాలు పెట్టి.. స్క్రబ్బర్‌తో పాదాలను శుభ్రం చేసుకోవాలి. గోర్లను శుభ్రం చేసుకోవడానికి హైడ్రోజన్ పెరాక్సైడ్ ఉపయోగించవచ్చు. పాదాలను తడిలేకుండా తుడిచి మాయిశ్చరైజర్‌ను అప్లై చేయాలి.
- వర్షాకాలంలో ఎవ్వరికైనా పాదాలకు పగుళ్లు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకని పాదాలకు ఉన్న మృతచర్మం తొలగిపోయేలా స్క్రబ్బర్‌తో రుద్దాలి. డెడ్ స్కిన్‌ను తొలగిస్తే పాదాల పగుళ్లను అరికట్టినట్లే.
- డయాబెటిస్‌తో బాధపడుతున్న వారు పాదాలపట్ల మరింత శ్రద్ధ వహించాలి. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ సోకితే వెంటనే డాక్టర్ వద్దకు వెళ్లి చికిత్స తీసుకోవాలి. ప్రతి రోజు రాత్రి నిద్రించే ముందు సబ్బుతో పాదాలను కడిగి తుడిస్తే మంచిది.



# అభిరుచే.. ఆదాయ బాట!

**కొత్తగా ఏదైనా చేయాలి.. అందరికంటే భిన్నంగా ఉండాలి అనుకునే వాళ్లుంటారు.. కానీ అన్నిసార్లు అనుకున్న రీతిలో పనులు జరుగకపోవచ్చు.. అప్పుడు సమయం వృథా అనే బాధ తప్ప ఏం మిగలదు.. అలా కాకుండా ఏదైనా ఒక అభిరుచిని అలవర్చుకోవడం మంచి ఉద్దేశం.. అదే అభిరుచి మీ ఆదాయానికి బాటలు వేయొచ్చు.. మీ చేతులు అద్భుతాలు చేస్తున్నప్పుడు.. ఆదరణ ఆటోమేటిక్‌గా వస్తుందనేది సత్యం.. ఈ మాట హైదరాబాద్‌కి చెందిన నేహా అగర్వాల్ విషయంలో సరిగ్గా సరిపోతుంది. ఖాళీ సమయంలో క్రాఫ్ట్ డిజైనింగ్ మీద అభిరుచి పెంచుకొని.. దాన్నే ఇప్పుడు వృత్తిగా మార్చుకున్న వైనం గురించే ఈ కథనం.**





Art is the only place you can do what you like. That's freedom.
మీకు నచ్చింది నచ్చినట్టు చేయడానికి వీలుండే ఏకైక ప్రపంచం'ఆర్ట్'. ఇంగ్లిష్‌లో ఇదొక సామెత. కాస్త సమయం కేటాయించి, ఓపికగా ప్రయత్నిస్తే అద్భుతాలే సృష్టించవచ్చు. అలాగే చేసింది నేహా. ఖాళీగా ఉండలేక క్రాఫ్ట్ డిజైనింగ్ నేర్చుకున్న ఆమె కొద్ది రోజుల తర్వాత అది ఆమెకు వృత్తిగా మారింది. బెంగళూర్ పట్టణంలో మొదలైన ఆమె కళా జీవితం ఇప్పుడు హైదరాబాద్‌లో కొనసాగుతున్నది. కేవలం కళాత్మక ఉత్పత్తులను తయారు చేయడమే కాదు. వాటిని ఎలా తయారు చేయాలి, వాటి ప్రాముఖ్యం ఏంటి? అనే విషయాలను మహిళలకు, పిల్లలకు తెలియచేస్తున్నది. ఇప్పటి వరకూ యాభైకి పైగా వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించి వందల మంది మహిళలకు క్రాఫ్ట్ డిజైనింగ్ నేర్పించింది.



### ఇలా మొదలైంది

నేహా అగర్వాల్‌ది రాజస్థాన్. కానీ హైదరాబాద్‌లో స్థిర పడింది. చిన్నప్పటి నుంచి ఆమెకు కరిక్యులర్ యాక్టివిటీస్ అంటే ఇష్టం. స్కూల్‌లో పెయింటింగ్, డ్రాయింగ్‌లో చురుగ్గా ఉండేది. పనికిరాని వస్తువులతో కొత్త కొత్త కళాకృతులు చేసేది. బయోటెక్‌లో ఇంజినీరింగ్ చేసిన నేహా.. జెనిటిక్స్‌లో డిప్లొమా చదివింది. చదువు అయిన తర్వాత దొరికిన ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా ఆమె క్రాఫ్ట్ పనుల కోసం ఉపయోగించుకొనేది. ఇదే సమయంలో నేహాకు పెండ్లయింది. భర్త చార్టర్డ్ అకౌంటెంట్. బెంగళూర్‌లో ఉద్యోగం కావడంతో నేహా కూడా అక్కడికి వెళ్లాల్సి వచ్చింది. అక్కడ కూడా ఆమెకు ఖాళీ సమయం దొరికింది. ఈ సమయంలో తన అభిరుచిని ఎలా అయినా అభివృద్ధి చేసుకోవాలనుకుంది. బెంగళూర్‌లో క్రాఫ్ట్ డిజైనింగ్ సెంటర్ల కోసం వెతికి ఒక దాంట్లో జాయిన్ అయింది. అక్కడ తెలియని ఎన్నో డిజైనింగ్‌లు ఆమెను ఆకర్షించాయి. మొదట్లో నేహా హ్యాండ్‌మేడ్ జువెలరీలు, చిన్న చిన్న ఇయరింగ్స్ చేసేది.

### పట్టు సాధించింది..

రోజులు గడిచే కొద్ది నేహా వివిధ రకాల హ్యాండీ క్రాఫ్ట్‌లు నేర్చుకోవడం, వాటిని తయారు చేయడం ప్రారంభించింది. తయారు చేసిన వాటిని తెలిసిన వాళ్లకు బహుమతిగా ఇచ్చేది. ఇలా వారి నుంచి మంచి స్పందన వచ్చింది. క్రమంగా ఆమె ఉత్పత్తులకు ఆదరణ పెరిగింది. వీటిని బయటి వాళ్లకు కూడా విక్రయించాలని.. అలాగే వీటి తయారీ కూడా అవసరమైన వారికి నేర్పాలని అప్పుడే అనుకుంది. సోషల్‌మీడియా ద్వారా తన ఉత్పత్తులను అందరికీ తెలియజేయడం ప్రారంభించింది. వాటిపై ఆసక్తి ఉన్న వారు కొనుక్కొనేవారు. ఆమె స్ట్రింగ్ ఆర్ట్, టెర్రాకోటా జువెల్లరీ, డెకోపాజ్, క్యాలిగ్రఫీ, క్లే నేమ్ ప్లేట్స్, పేపర్ క్విల్లింగ్, కిరిగామి వంటి హ్యాండీ క్రాఫ్ట్‌లను తయారు చేయగలిగింది.

### టీచింగ్‌పైనా ఆసక్తి

నేర్చుకోవడం వేరు.. దాన్ని ఇతరులతో పంచుకోవాలనుకోవడం వేరు. ఇలా చాలా తక్కువ మంది చేస్తుంటారు. విద్య అనేది పంచుకుంటేనే సార్థకమవుతుందన్న మాటను నిజం చేస్తూ.. తనకు తెలిసిన నైపుణ్యాలను ఇతరులకూ నేర్పించాలనుక్నుది నేహా. ఆమెకు క్రాఫ్ట్ మీద ఎంత ఆసక్తి ఉందో టీచింగ్ మీద కూడా అంతే ఆసక్తి ఉంది. కాబట్టి నేహా తనకు తెలిసిన విద్యను గృహిణులకు, ఇతర మహిళలకు, పిల్లలకు నేర్పించాలనుకుంది. బెంగళూర్‌లో ఉన్నప్పటి నుంచే ఈ పనిలో నిమగ్నమైంది. ఒకవైపు డిజైన్లు తయారు చేయడం, మరో వైపు వర్క్‌షాప్‌లు, క్లాస్‌లు నిర్వహించడం చేసింది. రెండేండ్ల తర్వాత భర్త ఉద్యోగరీత్యా మళ్లీ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ కూడా తన కార్యక్రమాలను కొనసాగించింది నేహా. అపార్ట్‌మెంట్, కాలనీ పరిధిలో మహిళలు, పేరెంట్స్‌తో మాట్లాడి తన క్లాస్‌ల గురించి, డిజైనింగ్ గురించి వివరించింది. వారి నుంచి చక్కటి స్పందన వచ్చింది. ఇట్లా ఉదయం పూట మహిళలకు, సాయంత్రం పూట పిల్లలకు డిజైనింగ్ బోధిస్తున్నది. కేవలం హ్యాండీ క్రాఫ్ట్‌లే కాకుండా పిల్లల కోసం ప్రత్యేకంగా క్యాలీగ్రఫీని కూడా నేర్పుతున్నది.

### మహిళలకు ఉపయోగం

'ఈ జనరేషన్‌లో మహిళలు ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉంది. పిల్లలను సరైన మార్గంలో నడిపించాలన్నా కూడా తల్లిదండ్రులకు ముందు అవగాహన ఉండాలి. రాజస్థాన్‌లో నాకు తెలిసిన ఓ నాలుగేండ్ల అబ్బాయి పెయింటర్. అతని పెయింటింగ్స్‌లో వారి తల్లిదండ్రులు విదేశాలలో అమ్ముతారు. లక్షల ఆదాయం వస్తున్నది. నిజంగా ఇది నమ్మడానికి ఆశ్చర్యంగా ఉండొచ్చు కానీ నిజం. కళా రంగంలో ఉత్పత్తులకు ఇంతటి డిమాండ్ ఉంది. నేను కూడా అభిరుచిగా ఎంచుకున్న పనులు ఇప్పుడు వృత్తిగా మారి ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఇందుకు నాకు సంతోషంగా ఉంది. అట్లాగే మహిళలు, వారి పిల్లలూ ఇలాంటి అభిరుచులు పెంచుకోవాలి' అని నేహా కోరుతున్నది.

### ఆర్ట్ స్టూడియో పెట్టాలని..

నేహా ఏడు రకాల హ్యాండీ క్రాఫ్ట్ డిజైనింగ్ నేర్చుకున్నది. వాటి ఉత్పత్తులను పెంచాలనే ఆలోచనలో ఉన్నది. ఆమెకు డిజైనింగ్‌లో కస్టమైజేషన్ ప్రత్యేకత ఉంది. అదే తన ప్లస్ పాయింట్. ఇష్టమైన మోడల్, డిజైన్ ఇచ్చినా దాన్ని హ్యాండీక్రాఫ్ట్ మీద వేసిస్తుంది. అలాగే మహిళలకు, పిల్లలకు నేర్పించే సంఖ్య పెంచాలనుకుంటున్నది. ఇందుకోసం ఒక ఆర్ట్ స్టూడియో పెట్టాలని భావిస్తున్నది నేహా. కళాకృతుల నైపుణ్యాలను అందరికీ అందించాలనుకుంటున్నది. ఇప్పటి వరకూ అనేక ఎగ్జిబిషన్లలో, ఈవెంట్లలో ఆమె వర్క్‌షాప్‌లు నిర్వహించింది. ప్రత్యేక సందర్భాల్లో తను ఉండే కాలనీలోనూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటుంది. అవసరమైతే నేహా కార్పొరేట్ కంపెనీల్లో, స్కూళ్లలో కూడా వర్క్‌షాప్‌లు నిర్వహించేందుకు సిద్ధం అని చెబుతున్నది.

...✍ వినోద్ మామిడాల,
📷 వీరగోని రజినీకాంత్ గౌడ్

## వంటింటి చిట్కాలు

- అన్నం ఉడికేటప్పుడు అందులో రెండు మూడు చుక్కల నిమ్మరసం పిండితే అన్నం తెల్లగా మల్లెపువ్వులా ఉంటుంది.
- అన్నం ఉడికేటప్పుడు కొంచెం నూనె వేస్తే అన్నం ముద్ద కాకుండా పొడి పొడిగా ఉంటుంది.
- మూత పెట్టకుండా ఉడికించే పదార్థాలలలో 'ఎ' విటమిన్ లోపిస్తుంది. నీళ్లు ఎక్కువగా పోసి ఉడికిస్తే 'బి' విటమిన్ నశిస్తుంది. పదార్థాలు ఎక్కువసేపు ఉడికిస్తే విటమిన్లు నశిస్తాయి.

## తామేమీ తక్కువ కాదని..

లింగమార్పిడి చేయించుకున్న వారంటే సమాజంలో చిన్న చూపు ఉంది. వారిని అవహేళన చేస్తూ, పలు విధాలుగా వేధిస్తున్నారు. సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్ మహిళ సంయుక్త విజయన్ వినూత్న పరిష్కారమార్గాన్ని చూపింది. అమెరికాలో రెండున్నరేండ్లు ఇంజినీర్‌గా పనిచేసిన సంయుక్త తిరిగి భారతదేశానికి వచ్చి సొంతంగా ఏదైనా వ్యాపారం చేయాలనుకున్నది. చిన్నప్పటి నుంచి ఆమెకు ఫ్యాషన్ రంగమంటే చాలా ఇష్టం. పలురకాల డిజైన్లను రూపొందించడంలో కొన్ని మెళకువలను తెలుసుకున్నది. ట్రాన్స్‌జెండర్లు కూడా అందరిలా మనుషులే, బతకడానికి వారికి ఎటువంటి పని లభించకపోవడంతోనే వ్యభిచారం చేస్తున్నారు. అందుకే వారిని ఆ కూపం నుంచి విముక్తి కల్పించేందుకు పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో బెంగళూరులో 'టౌట్ స్టూడియో'పేరుతో బొటిక్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా నలుగురు ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అందిస్తున్నది. ఇతర దేశాల్లో లింగ వివక్షత అనేది కనిపించదు. అక్కడ ఎవరికివ్వాల్సిన గౌరవం వారికి ఉంటుందని సంయుక్త చెబుతున్నది. భారతదేశంలో మాత్రమే లింగవివక్షత ఎక్కువని ఆమె అంటున్నది. దివ్య, రోసా, శక్తి , విజ అనే నలుగురు ట్రాన్స్‌జెండర్లకు సంయుక్త డిజైనింగ్ రంగంలో శిక్షణ ఇచ్చి వారికి తన బొటిక్‌లోనే ఉపాధి కల్పించింది. తన బొటిక్‌లో ఎక్కువ మంది ట్రాన్స్‌జెండర్లకు పని కల్పించి వారి భవిష్యత్‌కు భరోసా కల్పిస్తున్నది. పెండ్లి సమయంలో అవసరమైన దుస్తులు, ఆభరణాలు అద్దెకు ఇస్తూ వినూత్న సేవలనందించేందుకు శ్రీకారం చుట్టింది. నేటితరం యువత అభిరుచులకు తగిన విధంగా పలు డిజైన్లను రూపొందిస్తున్న సంయుక్త అనతి కాలంలోనే మార్కెట్‌లో మంచి బ్రాండ్‌ను క్రియేట్ చేసింది.



ఆమె ట్రాన్స్ జెండర్స్ కోసం ఓ బొటిక్‌ను ప్రారంభించి వారికి ఉపాధి కల్పిస్తున్నది. సమాజంలో తామేమీ తక్కువ కాదని నిరూపిస్తున్నది.

# ఇలస్ట్రేషన్ ప్రియతం



**చదువుతో పాటు ప్రతి ఒక్కరికీ ఏదో ఒక అభిరుచి ఉంటుంది. ఒక్కోసారి అదే వృత్తిగా మారవచ్చు. ఉన్నతస్థాయికి తీసుకు వెళ్లవచ్చు. హైదరాబాద్ కుర్రోడు శ్రీ ప్రియతం విషయంలో ఇదే జరిగింది. ఇంటర్ వరకే చదువుకున్నా ఇప్పుడు దేశవ్యాప్తంగా తన టాలెంట్ ద్వారా గ్రేట్ అనిపించుకుంటున్నాడు.**

ఇలస్ట్రేషన్ ప్రజెంట్ ట్రెండింగ్ ఆర్ట్. ఎన్నో అద్భుతాలు చేయొచ్చు. నెట్‌ఫ్లిక్స్ ఇలస్ట్రేషన్ రంగానికే రారాజు లాంటిది. ఇక్కడ ఈ రెండూ కలిస్తే జరిగే అద్భుతాలే ప్రియతం. మనం నిత్యం చూసే వింతలు.. విశేషాలను నెట్‌ఫ్లిక్స్ ద్వారా ఇలస్ట్రేషన్‌గా మలుస్తున్న ఒకే ఒక్క ఇండియన్ యువకుడిగా గుర్తింపు పొందాడు ఈ 27 సంవత్సరాలు కుర్రాడు. నెట్‌ఫ్లిక్స్ సీజన్-3 ప్రమోషన్స్ కోసం మొత్తం ప్రియతం గీసిన ఇలస్ట్రేషన్సే ఉపయోగించారు. ప్రియతం పదో తరగతి తర్వాత తనవల్ల చదువుకోవడం కాదని డిసైడ్ అయ్యాడు. తల్లిదండ్రులు ఎందుకు అని అడిగితే చదువుకన్నా పెయింటింగ్ పట్ల అభిరుచి ఉన్నదనీ చెప్పడంతో పేరెంట్స్ ఎలాంటి అడ్డు చెప్పలేదు. ఇంటర్ చదవమని సలహా ఇచ్చారు. తల్లిదండ్రుల మాటను తీసేయొద్దని ఇంటర్‌లో చేరాడు. కానీ ఇంటర్ ఫెయిల్ అయ్యాడు. తనకు చిత్రకళ అంటే ఇష్టం. దానినే వృత్తిగా ఎంచుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన నెట్‌ఫ్లెక్స్ సంస్థ అఫీషియల్ ఇలస్ట్రేటర్‌గా ఎంపికయ్యాడు. వింతైన వాటిని తీసుకొని పెయింటింగ్ వేస్తున్నాడు. వీటన్నింటినీ 'ఫ్రీజింగ్ రియాలిటీ ఇన్ ఎ ఫ్రేమ్'గా మలిచి శభాష్ అనిపించుకుంటున్నాడు.

# పిల్లల్లో నైపుణ్యం పెంచుతూ..

**పిల్లలు స్కూల్‌కు వెళతారు. టీచర్లు చెప్పింది రాసుకుంటారు. చదువుతారు. ఇంటికి వచ్చి హోం వర్క్ చేస్తారు. వీలైనవాళ్లు ట్యూషన్లకు వెళతారు. ఇంత చేస్తున్నా వారిలో విద్యా నైపుణ్యం పెరుగుతుందా?**



పిల్లల్లో విద్యా నైపుణ్యం పెంచేందుకు కృషి చేస్తున్నారు కొంతమంది యువతులు. బెంగళూరులోని కన్నింగామ్ రోడ్ వెస్ట్ మినిస్టర్ బిల్డింగ్ దీనికి వేదికైంది. అంజలి ప్రయాగ్, అంజనా చంద్రమౌళి, శ్వేతా కన్నన్ 2015లో పాఠశాలకు వెళ్లే పిల్లల కోసం 'వర్డ్స్ అండ్ విజువల్స్' అనే కార్యక్రమం ప్రారంభించారు. ప్రతీ సంవత్సరం రైటింగ్, రీడింగ్, ఎక్స్‌ట్రా కరిక్యులమ్ యాక్టివిటీస్ నేర్పిస్తున్నారు. ఈ సంవత్సరం జూన్ 22 నుంచి ప్రారంభమైన ఈ ప్రత్యేక శిక్షణా తరగతులు జూన్ 30తో ముగియనున్నాయి. వరల్డ్ వర్డ్ కన్సల్టింగ్ కంపెనీ ద్వారా నామమాత్రపు ఫీజు తీసుకొని వారిని ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నారు.

# ప్రమాదాలపై అవగాహన

**ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోతున్నవారిని రోజూ చూస్తూనే ఉన్నాం. అయినా ఎక్కడైనా మార్పు కనిపిస్తుందా? జరిగేవి జరుగుతూనే ఉన్నాయి. గాల్లో కలిసే ప్రాణాలు కలిసిపోతూనే ఉన్నాయి. స్వీయ నియంత్రణ.. రోడ్డు భద్రతపై అవగాహన ఉంటేనే యాక్సిడెంట్లను కట్టడి చేయగలం అని నమ్మాడు ఓ యువకుడు.**



మహ్మద్ హాఫీజ్ సంజీవ్ కేరళలోని అలాప్పుజాకు చెందిన యువకుడు. వయసు 19 సంవత్సరాలు. కొచ్చిలో వీఎఫ్ఎక్స్, యానిమేషన్ విభాగాల్లో ట్రెయినింగ్ తీసుకుంటున్నాడు. గత సంవత్సరం కేరళలో 40,000 రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. అందులో 4000 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని తెలియగానే అతడు ఆలోచనలో పడ్డాడు. లోపం ఎక్కడుందో అధ్యయనం చేశాడు. రోడ్డు భద్రతపై అవగాహన లేకపోవడం వల్లే ఇలా జరుగుతుందనీ.. స్వీయ నియంత్రణ ద్వారానే మార్పు తీసుకురావచ్చని తెలుసుకున్నాడు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే విధంగా ప్రత్యేకంగా ఫొటో చిత్రీకరణ చేసి సందేశాన్ని ఇస్తున్నాడు. ప్రతీ ఫొటో ఆలోచింపజేసే విధంగా డిజైన్ చేస్తున్నాడు. ప్రమాదాల నుంచి ఇండియాను కాపాడటమే తన బాధ్యత అంటున్నారు మహ్మద్ హాఫీజ్ సంజీవ్.



# నృత్యరూపక సన్నిధి

**కొంతమంది పుట్టుకతోనే సృజనశీలురై ఉంటారు. ఎలాంటి కోచింగ్‌లు తీసుకోకపోయినా ఆరంభం నుంచే అదరగొడతారు. నృత్య రూపకంలో అలాంటి అద్భుతాలు సృష్టిస్తున్న చిచ్చరపిడుగే సన్నిధి వర్మ.**

సన్నిధి బ్యాలె డ్యాన్స్‌లో అద్భుతంగా రాణిస్తున్న అమ్మాయి. వేదిక ఏదైనా తన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నది. ఢిల్లీ, ముంబైలో ఇటీవల ఏర్పాటుచేసిన బ్యాలె డ్యాన్స్‌లో అదరగొట్టింది. ది స్కూల్ ఆఫ్ రష్యన్ క్లాసికల్ బ్యాలెలో వర్క్‌షాప్ ఇచ్చింది. ఇన్ని అద్భుతాలు చేస్తుంది కదా? ఆమె కొరియోగ్రాఫర్ ఎవరనుకుంటున్నారు? ఎవరూ లేరు. ఆమెకు ఆమెనే కొరియోగ్రాఫర్. అమెరికాలో మూడేండ్ల వయసులోనే డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్న తర్వాత హైదరాబాద్ షిఫ్ట్ అయ్యారు. తల్లి సుదేష్ణ సమంత ఎంకరేజ్‌మెంట్‌తో ఇండియాలోని పలు వర్క్‌షాప్‌ల్లో పాల్గొన్నది. వేదిక ఏదైనా తనదైన ప్రదర్శనతో అద్భుతంగా రాణిస్తున్నది. అందరి ప్రశంసలూ అందుకొంటున్నది.

# సాహిత్య సృజనలో.. చిందోళ్ల మోహన్!



**'చిందు భాగవతం'.. కళల కాణాచియైన తెలంగాణ కళా సంపద. నేటితరానికి అంతగా పరిచయం లేని కళ. ప్రజల భావోద్వేగానికి.. ఆనందానికి చిందు భాగవతం అద్దం లాంటిది. అలాంటి కళ కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. చిందు కళా నీడన పెరిగి.. నేర్చుకొని.. కష్టాలు పడి.. తనతోపాటు చిందుకళను బతికించే ప్రయత్నం చేస్తున్న వ్యక్తి గడ్డం మోహన్‌రావు. 2019 సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికై తెలంగాణ చిందుకు వందనం సమర్పిస్తున్న మోహన్ పరిచయం.**

చిందు కళ వారి వృత్తి. తాత.. తండ్రుల నుంచి చిందు కళా ప్రదర్శన వారసత్వంగా వచ్చింది. చిన్నప్పటి నుంచే చిందు కళను ఒంటబట్టించుకున్నాడు. బతుకుబండి లాగుతున్న తండ్రి అనారోగ్యం పాలయ్యాడు. చదువుకు స్వస్తి చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్మికుడిగా మారి.. కసి పెంచుకొని.. పడుతూ లేస్తూ.. కొందరి సహకారంతో చదువు కొనసాగిస్తూ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం స్థాయికి చేరుకున్నాడు. ఈ సంవత్సరం నవంబర్ 14న ఢిల్లీలో ఈ అవార్డును స్వీకరించనున్నారు.

### ఏ రచనకు?

మోహన్ రాసిన 'కొంగవాలు కత్తి' నవలకు ఈ పురస్కారం లభించింది. దీనిని 2017లో రాయగా 2018లో ఆవిష్కరించారు. చిందు, డక్కలి, నులకచందయ్యల పురాణాల ప్రకారం ఆది జాంబవుడిని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు తాతగా భావించి పూజిస్తారు. ఆది జాంబవుడికి కుడి డొక్కలో పుట్టినవాడు డక్కలి. ఆ డక్కలి శరీర భాగాల నుంచి ఆదిజాంబవుడు విశ్వకర్మలకు అవసరమయ్యే పనిముట్లు సుత్తె, ఢాకలి, పట్టుకారు మొదలైన వాటిని తయారుచేసి ఇచ్చాడు. దీనికి కృతజ్ఞతగా విశ్వకర్మ ఆదిజాంబవుడికి ఇచ్చిన ఆయుధమే కొంగవాలు కత్తి. ఇది చిందు కళాకారుల జీవితాలు, చిందు భాగవతం నేపథ్యంలో నడుస్తుంది. చిందోళ్ల భాష, సాహిత్యాలు, చరిత్ర సంస్కృతులను ప్రతిబింబించింది. చిందు కళాకారుల బతుకులు, చిందు కళావైభవం ఒకప్పటి స్థితిని, ఇప్పటి గతిని ప్రపంచానికి చాటింది. ఒకరకంగా చెప్పాలంటే చిందు కళాకారుల బతుకు గాయాలను గేయాలుగా చిత్రీకరించిన నవల ఇది. తెలంగాణ సాంస్కృతిక వైభవం.. తెలంగాణ మట్టివాసనను తనువు నిండా ఈ నవల నింపుకొన్నది.

### కళకు ప్రేమతో..

చిన్నప్పటి నుంచే వ్యాసరచనలపై ఆసక్తి ఉన్న అతను 'అపురూప కళారూపం- చిందు భాగవతం' వ్యాసంతో వ్యాసకర్తగా గుర్తింపు తెచ్చుకున్నాడు. పేదరికం వల్ల చదువుకు ఆటంకం ఏర్పడినా రాయడం మాత్రం ఆపలేదు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ చేస్తున్నప్పుడు 'సైబర్ ప్రపంచం'అనే కవిత విశ్వవిద్యాలయ స్థాయిలో ద్వితీయ బహుమతి పొందడంతో ఇంకా రాయాలనే ఆలోచన కలిగింది. 2010లో 'ఆమె చిందు- కనుల విందు' శీర్షికన చిందు ఎల్లమ్మపై రాసిన వ్యాసం మంచి పేరు తీసుకొచ్చింది. పీహెచ్‌డీలో ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు ప్రోత్సాహంతో 2013లో 'చిందుల ఎల్లమ్మ', చిందు కళాకారుడు గడ్డం సమ్మయ్య జీవిత కథ 'చిందుల హంస' పుస్తకాలు ప్రచురించాడు.

### అధ్యయన రచనలు

మోహన్ తన రచనలను ఏదో ఊహాజనితంగా రాయలేదు. తాను రాసిన ప్రతీ వ్యాసం, కవిత, పుస్తకం అన్నీ క్షేత్రస్థాయిలో పర్యటించి.. చిందు కళతో అనుబంధం ఉన్న వ్యక్తులు. సంస్థలను అధ్యయనం చేసి రాశారు.

కొండగట్టు ఆంజనేయస్వామి గుడిలో అర్చకుడిగా పని చేసిన చిందు కళాకారుడు, కవీశ్వరుడు గడ్డం మచ్చయ్యదాసు అముద్రిత రచనలు 'మంగళహారతులు- భజనకీర్తనలు', 'చిందు జాంబవ పురాణం', 'రేణుకా ఎల్లమ్మ కథ' వంటి రచనలకు సంపాదకుడిగా వ్యవహరించి వెలుగులోకి తీసుకొచ్చాడు. 2017లో తన జీవితాన్నే కథా వస్తువుగా తీసుకొని 'కొంగవాలు కత్తి' నవలను రాశాడు. 'నేను ఎవరిని' పేరుతో రాసిన కవిత చిందు కళాకారుల దయనీయమైన యధార్థ జీవితాలకు ప్రతీక. 2019లో కడియం డేవిడ్‌తో కలిసి 'అతడు అబ్రహాం' నవల రాశాడు. 'ఇచ్చురుగాళ్లు', 'కంచంపొత్తు' కథలు రాశారు. త్వరలో 'ఎంగిలిపూలు' కథాసంపుటి రాబోతున్నది.

### కళతో సహవాసం

యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం హాజీపూర్ మోహన్ ఊరు. తల్లిదండ్రులు గడ్డం సావిత్రి, కిష్టయ్య. నిరుపేద చిందు కళాకారులు. చిన్నప్పటినుంచీ తల్లిదండ్రుల చిందు కళను చూసిన మోహన్ దానిని ఒంటబట్టించుకున్నాడు. అప్పుడు ఇన్ని ప్రసారమాధ్యమాలు లేవు. గ్రామాల్లో చిందు భాగవతమే ప్రధాన కళారూపం. ఆ కళా ప్రదర్శను చూసి ప్రజలు భావోద్వేగానికి, ఆనందానికి గురవుతుంటే కళ గొప్పదనం ఏంటో మోహన్ తెలుసుకున్నాడు. చిందోళ్ల ఇంట్లో పుట్టడం అదృష్టంగా భావించాడు. కానీ గ్రామాల్లో కుల వివక్ష ఉండేది. ఇది అతనిలో బాధ కలిగించి.. ఏదైనా సాధించాలి అనే కసి పెరిగింది.

> **నాన్నకు అంకితం**
> మా నాయన గతనెల 25న అనారోగ్యం కారణంగా చనిపోయారు. పీహెచ్‌డీ పట్టాను స్వీకరించడం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం ఆయన చూసి ఉంటే ఎంతగానో సంతోషించేవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం శతవసంతాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో నిరుపేద చిందు కళాకారుల కుటుంబం నుంచి వచ్చి అత్యున్నత డిగ్రీని అందుకున్న మొట్టమొదటి వ్యక్తిని కావడం కూడా గర్వంగా చెప్పుకొనే విషయం.
> -గడ్డం మోహన్‌రావు

### ఆగిపోయిన చదువు

చదువు మధ్యలోనే ఆగిపోయినప్పటికీ డాక్టర్ నిర్మలారెడ్డి ఆర్థిక సహాయంతో పాఠశాల విద్యను పూర్తిచేయగలిగాడు. తన గురువులు కాటెపల్లి చంద్రారెడ్డి, ఎల్లబోయిన ఆంజనేయస్వామి తెలుగు సాహిత్యంవైపు ఆకర్షించారు. సరోజినీ దేవి, హన్మంతారెడ్డి సాహిత్యంపై ప్రోత్సహించారు. ఏడవ తరగతిలోరాసిన వ్యాసరచన పోటీల్లో ద్వితీయ బహుమతి.. 10వ తరగతిలో ప్రథమ బహుమతి అందుకోవడంతో ఉత్తేజవంతుడయ్యాడు. ఇంటర్ తర్వాత వాళ్ల నాన్న ఆరోగ్యం బాగాలేకపోవడంతో చదువుకు స్వస్తి చెప్పి కూలీగా మారాడు.

### అంచెలంచెలుగా ఎదుగుతూ..

చదువుకోవడం ఇక కుదరదు అనుకున్న సమయంలో హాజీపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విజయకుమారి, కోట శ్రీనివాసరావు ప్రోద్బలంతో విద్యావలంటీర్‌గా చేరడంతో జీవితం కొత్త మలుపు తిరిగింది. కానీ పరిస్థితులు సహకరించలేదు. కుల వివక్ష కారణంగా విద్యా వలంటీర్‌గా స్వస్తిచెప్పి బొమ్మల రామారంలోని ఓ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా చేరాడు. అది చేస్తూనే ఆంధ్రా యూనివర్సిటీ దూరవిద్యా ద్వారా 2005లో డిగ్రీ చేశాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల పరిచయం అతడిని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైపు నడిపించి ఓపెన్ కేటగిరిలోనే ఎంఏ తెలుగులో చేరారు. 2008లో ఎంఏ చేసి అక్కడే ప్రొఫెసర్ గడ్డ అరుణకుమారి పర్యవేక్షణలో 'చిందు భాగవతం - వస్తువు, ప్రదర్శన రీతుల అధ్యయనం' అనే అంశంపై 2009లో ఎంఫిల్ పూర్తి చేశాడు. ఏనాటికైనా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేయాలనే కోరికతో 2011లో ఓయూ తెలుగు శాఖలో అడుగుపెట్టాడు. జాతీయ స్థాయిలో నిర్వహించే యూజీసీ- నెట్ పరీక్షలో అత్యున్నత ప్రతిభ చూపించి ఓపెన్ కేటగిరీలో జేఆర్ఎఫ్ సాధించి ఫెలోషిప్ పొందాడు. ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు పర్యవేక్షణలో 'చిందు కళాకారుల జీవన చిత్రణం- సాహిత్యానుశీలనం' అంశంపై పీహెచ్‌డీ పరిశోధన పూర్తిచేసి 2017లో డాక్టరేట్ అందుకున్నాడు. ప్రొఫెసర్ వెల్దండ నిత్యానందరావు, ప్రొఫెసర్ సూర్యాధనుంజయ, డాక్టర్ ఎస్. రఘు సహకారంతో ప్రస్తుతం కోఠి మహిళా కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తున్నాడని మోహన్ చెప్పారు.



### ప్రతిభకు అవార్డులు

2016లో 'చిందుల ఎల్లమ్మ' పుస్తకానికి భారతీయ దళిత సాహిత్య అకాడమీ 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్' అవార్డు వచ్చింది. 'కొంగవాలు కత్తి' నవల ముద్రితం కాకమునుపే 2017లో భాగ్యరెడ్డి వర్మ స్మారక ద్వితీయ బహుమతి, విశాల సాహిత్య అకాడమీ తృతీయ బహుమతి లభించింది. 2018లో భారతీయ దళిత సాహిత్య అకాడమీ 'సాహిత్య రత్న' అవార్డు పొందారు. 'కొంగవాలు కత్తి' ప్రచురితమైన అనంతరం 2018లో అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ వారు దానికి ప్రథమ బహుమతిని అందజేశారు. రాగసుధ జానపద కళాసాంస్కృతిక సంస్థ వారు 2019లో 'చిందు ఎల్లమ్మ సాహిత్య పురస్కారం' అందజేశారు.

**అజయ్‌కుమార్ సేగూరి**
నమస్తే తెలంగాణ, ఓయూ

# స్నేహమే రక్ష!



**బిజీగా ఉంటున్నారా? ఒత్తిడి మధ్య పనిచేస్తున్నారా? అసంతృప్తితో ఉంటున్నారా? వీటన్నింటికీ చెక్ పెట్టాలంటే అందరితో స్నేహంగా ఉండాలంటున్నారు నిపుణులు. స్నేహంగా ఉంటే ఎలాంటి ఒత్తిడినైనా జయించవచ్చునని అంటున్నారు.**

ఆధునిక జీవనశైలి యువతకు సమస్యగా మారుతున్నదని చెప్తున్నారు అమెరికా శాస్త్రవేత్తలు. యూనివర్సిటీ ఆఫ్ నోట్రెడేమ్‌కు చెందిన పరిశోధకులు తాజాగా 'యువత-సంతోషం' అంశంపై అధ్యయనం చేశారు. కొన్ని కాలేజీ, ఉద్యోగ సముదాయాల్లోని యువతను పరిశీలించారు. స్నేహంగా ఉండేవారిలో 65% ఎక్కువ సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటున్నారట. సామాజిక సంబంధాలు, వృత్తిలో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉన్నవారు జీవితం సంతృప్తిగా గడుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. కొంతమంది సోషల్‌మీడియా వల్ల కూడా శతృత్వాన్ని కొని తెచ్చుకుంటున్నట్లు వారు చెప్పారు. చీటికిమాటికి వివాదాలు మీదేసుకునే వాళ్లు ఎప్పుడూ నిమ్మళంగా ఉండరనీ.. వాళ్లు ఒత్తిడి మధ్య బతకాల్సి వస్తుందనీ.. దీంతో ఆరోగ్యం దెబ్బతింటుందని చెప్పారు. వ్యక్తులను నిందించే స్వభావం కలిగిన వాళ్లు స్నేహం విలువ తెలియక నిత్యం ఏదో ఒక వివాదం ముందరేసు కుంటున్నారని చెప్పారు. వీటన్నింటికీ ఫుల్‌స్టాప్ పెట్టి ఆరోగ్యకరమైన.. ఆనందమయమైన జీవితం గడపాలంటే స్నేహమొక్కటే మార్గమని సూచిస్తున్నారు. స్నేహంగా ఉంటే ఎంతోమందని బతికించవచ్చు అని వారు చెప్పారు.

## సుడోకు

**డైలీ సుడోకు 67 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 1 | 8 | 7 | 6 | 2 | 9 | 3 | 5 |
| 7 | 3 | 2 | 9 | 5 | 8 | 4 | 1 | 6 |
| 9 | 5 | 6 | 1 | 4 | 3 | 8 | 7 | 2 |
| 6 | 8 | 9 | 5 | 2 | 7 | 3 | 4 | 1 |
| 2 | 7 | 3 | 4 | 1 | 6 | 5 | 8 | 9 |
| 1 | 4 | 5 | 8 | 3 | 9 | 6 | 2 | 7 |
| 8 | 6 | 7 | 2 | 9 | 4 | 1 | 5 | 3 |
| 5 | 9 | 4 | 3 | 7 | 1 | 2 | 6 | 8 |
| 3 | 2 | 1 | 6 | 8 | 5 | 7 | 9 | 4 |


**డైలీ సుడోకు -68**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 9 | 2 | | | 8 | 5 | 4 | |
| | 8 | | 1 | 5 | 6 | | | |
| 1 | | | | | 4 | | | |
| 7 | 5 | | | | | | | |
| | | 4 | | | | 9 | | |
| | | | | | | | 5 | 2 |
| | | | 3 | | | | | 9 |
| | | | 5 | 6 | 2 | | 3 | |
| | 2 | 7 | 9 | | | 4 | 6 | |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.


సమాధానం రేపటి సంచికలో

## ట్వీట్



**ఆడవాళ్లకు ఏ టాలెంట్ ఉన్నా.. ఏ టాలెంట్ లేకున్నా హెయిర్ డ్రెస్సింగ్ టాలెంట్ మాత్రం తప్పకుండా ఉంటుంది. అయేషాకు ధన్యవాదాలు నా హెయిర్‌ని స్టయిల్‌గా మార్చినందుకు.**

**ప్రగ్యా జైస్వాల్**
@ItsMePragya



ప్రగ్యా జైస్వాల్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య
6,41,145

## కామన్‌మ్యాన్ వాయిస్

గ్రావిటీ బట్టి నీళ్లు పోతే ఖర్చు ఏముంటది. కానీ లిఫ్ట్ ఇరిగేషన్ అయితే కొన్ని ఎక్కువ పైసలు ఖర్చు అయితాయి. గందుకని పైన ఉన్నోళ్లకి నీళ్లు వద్దా లోక్ సత్తా జేపీ సారు!
-Kris Posts

విద్య, వైద్యం చెయ్యండి చాలు. ఇంకే ఉచితాలు అక్కర్లేదు. ఇంకే ఉచితాలు అక్కర్లేదు. ఇండియాలో లక్షల మంది ఈ రెండిటి వలనే పేదలైపోతున్నారు.
-Narayana Veera

మనిషి తనను దాటి పక్కవాడి గురించి ఆలోచించేంత ఇంకా ఎదగలేదూ. ఎదగలేదూ.
-Sanjeev Polampally

## వైరల్ వీడియో



**ఫాదర్స్ డే సందర్భంగా నాని నిర్మించిన ఓ షార్ట్‌ఫిలిం విడుదల చేశారు. తండ్రులకు అంకితమిస్తూ రూపొందించిన ఈ లఘుచిత్రం యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది.**

Anaganaga Oka Nanna Short Film | Nani | TNR | Deepthi Ganta
Total views : 2,95,768+
Published on Jun 16, 2019

III.

# నమస్తే తెలంగాణ సంకేత

[ కరీంనగర్ ]

బుధవారం 19 జూన్ 2019

టెక్నాలెడ్జీ 2.0

## స్యామ్‌సంగ్ గెలాక్సీ ఏ10ఈ

మార్కెట్‌లోకి స్యామ్‌సంగ్ ఎప్పటిక ప్పుడూ తన బ్రాండ్‌ను విస్తరించు కుంటూనే ఉంది. ఈ వారంలోనే స్యామ్‌సంగ్ గెలాక్సీ ఏ10ఈ ఫోన్‌ను రిలీజ్ చేసింది. బడ్జెట్ ధరలో అద్భుత ఫీచర్లతో ఈ ఫోన్ అందుబాటులో ఉంది.

| | |
|---|---|
| డిస్‌ప్లే | : 5.83 అంగుళాలు |
| స్టోరేజీ | : 32 జీబీ |
| ర్యామ్ | : 3 జీబీ |
| రియర్ కెమెరా | : 13 మెగాపిక్సల్స్ |
| సెల్ఫీ | : 5 ఎంపీ |
| ఆపరేటింగ్ సిస్టమ్ | : ఆండ్రాయిడ్ పీ |
| బ్యాటరీ | : 3000 ఏంఏహెచ్ |
| ధర | : రూ.12,500 |

నయామాల్



## MI నుంచి AI ట్రాన్స్‌లేటర్

టెక్ మార్కెట్‌లో తనదైన శైలిలో దూసుకుపోతున్న షావోమీ మరో ప్రొడక్ట్‌ను వినియోగదారుల కోసం విడుదల చేసింది. మొబైల్స్‌తో సహా ఎన్నో యాక్సెసరీస్‌ను అందించి యూజర్లను ఆకట్టు కుంటున్నది. తాజాగా మరో స్మార్ట్ డివైజ్‌ను ప్రవేశపెట్టింది.



ఎంఐ ఎకోసిస్టమ్ బ్రాండ్ MI AI ట్రాన్స్‌లేటర్ డివైజ్‌ను విడుదల చేసింది. ఈ MIT AI Translator లో oxford dictionary, కొలియన్స్ డిక్షనరీ pre-install అయి ఉంటుంది. దాదాపు 34 భాషలు ఈ డివైజ్‌లో ఉంటాయి. ఈ డివైజ్ లో మూడు చైనీస్ డిక్షనరీలను అందిస్తున్నది. ఇంగ్లీష్‌లో సరైన ఉచ్చారణ నేర్చుకునేందుకు ఈ డిక్షనరీలు సహాయపడతాయి. ఆన్‌లైన్‌లోనే కాదు ఆఫ్‌లైన్ లోనూ ఈ డిక్షనరీలు పని చేస్తాయి. దీని ద్వారా చైనీస్, ఇంగ్లీష్, జపనీస్, కొరియన్, జర్మన్ భాషల ట్రాన్స్ లేషన్ కూడా అందుబాటులో ఉంది. రియల్ టైం ట్రాన్స్‌లేషన్ కు సపోర్ట్ చేసేలా డిజైన్ చేశారు. ఇందులో ప్రపంచ వ్యాప్తంగా 224 దేశాల్లోని అన్ని రీజియన్స్‌లో మొత్తం 34 భాషలను కవర్ చేశారు. ఇందులో 5సెంటీమీటర్ల మ్యాక్రోతో క్లోజప్ షాట్స్ తీసుకోనే సామర్థ్యం ఉంది.

**స్పెషిఫికేషన్లు ఇవే**

4 అంగుళాల డిస్ ప్లే, 16:9 ఆస్పెక్ట్ రేషియో, 2.0GHz మల్టీ కోర్ ప్రాసెసర్, 2GB/3GB ర్యామ్, 16GB/ 64GB ఇంటర్నల్ స్టోరేజీ , 5MP రియర్ కెమెరా, డ్యుయల్ మైక్రోఫోన్, లౌడ్ స్పీకర్, 2200mAh బ్యాటరీ, 25 రోజుల వరకు ఛార్జింగ్. ధర 5వేలు.

ఉదయాన్నే టైంకు నిద్రలేపే అలారమ్ ఉన్నట్టే ఇంటి నుంచి బయటకు వెళ్లగానే ఆటోమేటిక్‌గా ఆఫ్ అయ్యే లైట్లుంటే ఎలా ఉంటుంది?

కుక్కర్ వేడెక్కగానే విజిల్ వచ్చి నట్టే .. కూర వండుతున్నప్పుడు స్టేటస్‌ను చూపిస్తే ఎంత బాగుంటుంది.

అద్దం ముందు నిల్చుంటే బయట వాతావరణాన్ని బట్టి ఎలాంటి మేకప్ వేసుకోవాలో చెప్పే మిరర్లు ఉంటే క్రేజీగా ఉంటుంది కదా!

అలాంటి స్మార్ట్ హోం గ్యాడ్జెట్లే ఇవి..



**స్మార్ట్ పాన్**

కిచెన్ వేర్ ఐటెమ్స్ మార్కెట్లో చాలా అందుబాటులో ఉన్నా స్మార్ట్ ఐటెమ్స్ తక్కువే. ముఖ్యంగా స్మార్ట్ పాన్స్ రేర్‌గా కనబడతాయి. ఈ స్మార్ట్ ప్యాన్స్‌తో వంటలు చేయటం ఇంకా సులువు అవుతుంది. ఈ రకమైన పరికరాల్లో ఉన్న ఫీచర్లతో వీటిని స్మార్ట్ ఫోన్‌కు బ్లూటూత్‌తో కనెక్ట్ చేసి ఆక్సెస్ చేయవచ్చు. ఇవి రీచార్జెబుల్ బ్యాటరీలను కలిగి ఉంటాయి. పాన్లో చేస్తున్న వంటకం స్టేటస్‌ను స్మార్ట్ ఫోన్ ద్వారా యూజర్‌కు కమ్యూనికేట్ చేస్తాయి. ఇవి రియల్ టైం మెజర్మెంట్‌ను కలిగి ఉన్నాయి. అటోమేటిక్‌గా టెంపరేచర్ కంట్రోల్ చేసి ఫుడ్ పాడవకుండా హెల్ప్ చేస్తాయి.




# ఇంటికి డిజిటల్ సొబగుల్



**స్మార్ట్ మిర్రర్**

ఉన్నట్టుండి ఓ ముఖ్యమైన మీటింగ్‌కు హాజరవాల్సి వచ్చిందనుకుందాం, లేదా పెద్ద పార్టీకి వెళ్లాల్సి వచ్చిందినుకుందాం.. అలాంటి టైం వచ్చినప్పుడు ఎలా రెడీ అవ్వాలో చాలా మందికి తెలియదు. కానీ స్మార్ట్ మిర్రర్ ఇంట్లో ఉందనుకోండి ఎలాంటి టెన్షన్ ఉండదు. Facial Gesture Recognition Technology (FGR)తో పని చేసే మిర్రర్లు ఉన్నాయి. ఫేస్‌ను గుర్తించి, బయటి వాతావరణానికి అనుకూలంగా ఉండే మేకప్ టిప్స్ ఇస్తాయి. ఇది సుమారు 70 రకాల ఫేసియల్ యాక్షన్లను గుర్తిస్తుంది. దీంతో పాటు రిమైండర్లను కూడా సేవ్ చేసుకునే వీలుంది. మెడికల్ రిమైండర్లు, డైలీ అపాయింట్మెంట్లను గుర్తుచేస్తుంది. సమయాన్ని వాతావరణ సూచనలను కూడా చూపిస్తుంది. కొన్ని మిర్రర్లకు మధ్యలో కెమెరా కూడా ఉంటుంది. సో మిర్రర్ ముందే నిల్చుని ఫొటోలు కూడా తీసుకోవచ్చు.



**స్మార్ట్ ఫ్రిజ్**

ఇప్పుడు వాడుతున్న ఫ్రిడ్జ్‌లో కేవలం అటోమేటిక్ లైట్, టెంపరేచర్ మాత్రమే ఉంటాయి. అలాకాకుండా ఫ్రిడ్జ్ వైఫైతో స్మార్ట్ ఫోన్‌కు కనెక్ట్ చేసుకునే వీలుంటే ఎంత బాగుంటుంది. దాని దగ్గరకు వెళ్లకుండానే అవసరం ఉన్నప్పుడు ఆఫ్ చేయొచ్చు, ఆన్ చేయొచ్చు. ఇష్టమున్నంత టెంపరేచర్ అడ్జస్ట్ చేయొచ్చు. అంతేనా? ఈ స్మార్ట్ ఫ్రిడ్జ్‌లలో ఇంకా చాలా ఫీచర్లు ఉంటాయి. కొన్ని కంపెనీలు అందించే ఇంటర్నెట్ రిఫ్రిజిరేటర్లో మూడు కెమెరాలు ఉంటాయి. నోటిఫికేషన్స్, షెడ్యూల్ కోసం వైట్ బోర్డ్ ఆప్షన్లు ఉన్నాయి. ఫ్యామిలీలో ఎవరికైనా సమాచారం అందించాలంటే ఇక్కడా డిస్‌ప్లే చేసి ఉంచవచ్చు. ఫొటోలను కూడా అప్లోడ్ చేయవచ్చు. ప్రత్యేకంగా ప్రొఫైల్ క్రియేట్ చేసి, చేయాల్సిన పనులను తెలుపుతూ సేవ్ చేసి ఉంచవచ్చు. ట్రాన్స్‌పరెన్స్ టచ్ స్క్రీన్‌తో ఫ్రిడ్జ్‌లో ఏం ఉన్నాయో డోర్ ఓపెన్ చేయకుండానే తెలుసుకోవచ్చు. స్మార్ట్ ఫోన్‌తో ఐస్ మేకర్‌ను ఆన్‌ఆఫ్ చేయవచ్చు. ఇలాంటి ఫీచర్లు మోడల్‌ను బట్టి, ధరను బట్టి ఉంటాయి.



**డిజిటల్ బార్ టెండర్**

సమ్మర్లో ఏదైనా డ్రింక్ తయారు చేసుకోవాలంటే మిక్సీలపైనే ఆధారపడాలి. పడరాని పాట్లు పడి ఓ డ్రింక్ తయారు చేయడానికి ఎంతో శ్రమించాలి. అనుకోకుండా అతిథులు వస్తే హడావిడిగా డ్రింక్స్ కలిపివ్వాల్సి వస్తుంది. అదే డిజిటల్ డ్రింక్ మిక్సర్లు ఉన్నాయనుకో అంత టెన్షన్ అక్కర్లేదు. 'సోమా బార్' అనే కంపెనీ డిజిటల్ బార్ టెండర్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఆరు రకాల డ్రింక్స్‌ను కలపవచ్చు. ఎలా కావాలి, ఎలాంటి డ్రింక్ కావాలి, లైట్, హర్డ్ మోతాదులో కావాలసిన డ్రింక్‌ను తయారు చేసుకోవచ్చు.



**డిజిటల్ సీసీ టీవి**

ఎన్ని స్మార్ట్ గ్యాడ్జెట్లు వాడినా, ఎంత స్మార్ట్ హోం అయినా సెక్యూరిటీ లేకుంటే ఎలా..? అలాంటి హోంలో సెక్యూరిటీ కూడా స్మార్ట్‌గానే ఉండాలి. ఇప్పుడు దాదాపు సర్వేలెన్స్ మొత్తం స్మార్ట్ ఫోన్‌కు అటాచ్ అయ్యే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే షాపింగ్ మాల్స్, హోటల్ నిర్వాహకులు తమ బిజినెస్ ఏరియాల్లోని సీసీ టీవీలను తమ ఫోన్‌కు కనెక్ట్ చేసుకుని ఎప్పుడంటే అప్పుడు, ఎక్కడి నుంచి అయినా చూడగల్గుతున్నారు. కెమెరా పరిధిలో రికార్డు అవుతున్న విజువల్ మొత్తాన్ని ఓనర్ స్మార్ట్ ఫోన్‌కు పంపుతుంది.

**ఇంటెలిజెంట్ మాట్రెసిస్**

మనం రోజూ నిద్రపోయే పరుపులు మనకు సలహాలిస్తే, ఎలా నిద్రపోవాలో అవే చెబితే ఎలా ఉంటుంది? పోనీ మనం పడుకున్నాక మన హార్ట్ బీట్ ఎలా ఉంది, బ్రీథింగ్ ఎలా ఉందో అనలైజ్ చేసి మార్నింగ్ కల్లా డిస్‌ప్లే చేస్తే.. ఇది ఊహించడానికే వీలులేకుండా ఉంది కదా? అవును ఇప్పుడు ఇంటెలిజెంట్ పరుపులు అదే పని చేస్తున్నాయి. ఈ రకమైన స్మార్ట్ పరుపులు మూడు రకాల టెక్నాలజీని కలిగి ఉన్నాయి. స్లీపింగ్ ప్యాటర్న్ ట్రాక్ చేయడానికి స్లీప్ ఐక్యూ టెక్నాలజీ, స్లీపింగ్ హాబిట్‌ను ఇంప్రూవ్ చేసుకోవడానికి సలహాలు ఇస్తాయి. మొత్తం శరీరాన్ని సెన్సార్ చేసి రిజల్ట్ ఇవ్వడానికి టచ్ ఫ్రీ, బయోమెట్రిక్ సెన్సార్ సిస్టమ్ కూడా ఇందులో ఉంటుంది.



...✍ వినో..

## బగ్ కనిపెట్టిన స్టూడెంట్‌కు
# బంపర్ ఆఫర్

వాట్సప్, ఫేస్‌బుక్‌లో సమస్యాత్మక బగ్‌లను కనిపెట్టిన వారికి ఫేస్‌బుక్ రివార్డు ఇస్తుంటుంది. ఇటీవలే కేరళకు చెందిన ఓ ఇంజినీరింగ్ స్టూడెంట్ వాట్సప్‌లో లోపాన్ని తెలియజేసి ప్రశంసలు అందుకున్నాడు. తాజాగా మణిపూర్‌కు చెందిన కుర్రాడు కూడా వాట్సప్‌లో మరో బగ్‌ను కనిపెట్టి కంపెనీ దృష్టికి తీసుకెళ్లి నగదు ప్రోత్సాహం అందుకున్నాడు.




వాట్సప్‌లో యూజర్ ప్రైవసీకి భంగం కలిగించే ఓ బగ్‌ని మణిపూర్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి జోలెన్ సొగాజం గుర్తించి, కంపెనీకి సమాచారం అందించాడు. అతని సమస్యను పరిశీలించిన కంపెనీ బగ్‌ను తొలగించింది. వాట్సాప్ ద్వారా వాయిస్ కాల్ చేస్తున్నప్పుడు కాలర్ & రిసీవ్ చేసుకునే వ్యక్తికి తెలియకుండానే, అతని ఆమోదం పొందకుండానే వీడియో కాల్‌గా అప్ గ్రేడ్ చేయడానికి ఈ బగ్ ఉపయోగపడుతుందని, దీనివల్ల అవతలి వ్యక్తి ఏం చేస్తున్నాడో అతనికి తెలిసిపోతుందని జోలెన్ అంటున్నాడు. ఈ బగ్ వల్ల రిసీవర్ ప్రైవసీకి భంగం కలుగుతుందని, ఈ విషయాన్ని తాను ఫేస్ బుక్‌కి సంబంధించిన బౌంటీ ప్రోగ్రామ్ నిర్వాహకులకు తెలిపానని ఈ విద్యార్థి పేర్కొన్నాడు. తన రిపోర్టును ఫేస్‌బుక్ సెక్యూరిటీ టీమ్ ఆమోదించి.. ఈ బగ్ విషయంలో తగు 'సవరణలు' చేసిందని వెల్లడించాడు.

దీంతో జోలెన్ ప్రతిభను గుర్తించి బహుమతి ప్రకటించింది. 22 ఏళ్ళ ఈ సివిల్ ఇంజినీర్ జోలెన్. తన ప్రతిభతో బగ్ గుర్తించి ఫేస్‌బుక్ నుంచి 5వేల యుఎస్ డాలర్ల నగదు బహుమతిని అందుకున్నాడు. పైగా ఇతని పేరును 'ఫేస్ బుక్ హాల్ ఆఫ్ ఫేమ్–2019' లో చేర్చింది. ప్రస్తుతం జోలెన్ పేరు 94 మంది జాబితాలో 16 వ స్థానంలో ఉంది.

## ఐకాన్స్ కావాలా?

మీరు డిజైనరా? ఎప్పుడూ ఐకాన్లు వాడుతూ ఉంటారా? అయితే మీరు చేసే పని గూగుల్ ఇమెజెస్ నుంచి వెతుక్కుంటారు కదా? ఇక నుంచి అలా చేయకండి. ఆకర్షణీయమైన ఐకాన్ల కోసం ప్రత్యేకమైన అడ్డాలున్నాయి. బెస్ట్ క్వాలిటీతో ఉచితంగా, 40.40 సైజులో వాడుకోవచ్చు. సుమారు వెయ్యి నుంచి లక్ష ఐకాన్ల గ్యాలరీలు ఉన్న వైబ్‌సైట్లు ఉన్నాయి. మరి కావాలనుకుంటే ఈ కింది సైట్లలో ఓ లుక్కేయండి.. నచ్చితే డౌన్లోడ్ చేసుకోండి.

chittagongit.com, flaticon.com
iconfinder.com/free_icons
icons8.com, iconarchive.com

టెక్‌చిట్కా



# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## సీడీఎస్‌ఈ ఎగ్జామ్ (II) -2019

**త్రివిధ దళాలైన మిలిటరీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో ఉన్నత ఉద్యోగాలకు నిర్వహించే సీడీఎస్‌ఈ-II, 2019 నోటిఫికేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది.**



- కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామ్ (సీడీఎస్‌ఈ)ను ప్రతిఏటా రెండుసార్లు యూపీఎస్సీ నిర్వహిస్తుంది.
- **మొత్తం ఖాళీలు – 417**
- ఇండియన్ మిలిటరీ అకాడమీ (డెహ్రాడూన్) – 100 (వీటిలో ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ అభ్యర్థులకు 13 పోస్టులు కేటాయించారు)
- ఇండియన్ నేవల్ అకాడమీ (ఎజిమల) – 45 (వీటిలో ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ అభ్యర్థులకు 6 పోస్టులు కేటాయించారు)
- ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (హైదరాబాద్) – 32
- ఆఫీసర్ ట్రెయినింగ్ అకాడమీ (చెన్నై) – 225 (పురుషులకు మాత్రమే. వీటిలో ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ అభ్యర్థులకు 50 పోస్టులు కేటాయించారు)
- ఆఫీసర్ ట్రెయినింగ్ అకాడమీ (చెన్నై) – 15 (నాన్ టెక్నికల్, మహిళలకు మాత్రమే)

**విద్యార్హతలు:**

- **ఇండియన్ మిలిటరీ అకాడమీ (ఐఎంఏ) అండ్ ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఇండియన్ నేవల్ అకాడమీ:** ఏదైనా బ్రాంచీలో ఇంజినీరింగ్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **ఎయిర్ ఫోర్స్ అకాడమీ:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులు చదివి ఉండాలి లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2020, జూలై 1 నాటికి 20 – 24 ఏండ్లు (1996, జూలై 2 నుంచి 2000, జూలై 1 మధ్య జన్మించి ఉండాలి)
- ఐఎంఏ/ఇండియన్ నేవల్ అకాడమీ పోస్టులకు 1996, జూలై 2 నుంచి 2001, జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు:** కనీసం 157.5 సెం.మీ. ( నేవీకి 157 సెం.మీ., ఎయిర్‌ఫోర్స్‌కు 162.5 సెం.మీ., మహిళలు 152 సెం.మీ ఎత్తు ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి)
- **ఫిజికల్ కండిషనింగ్:** రన్నింగ్ – 15 నిమిషాల్లో 2–4 కి.మీ. పరుగెత్తాలి.
- పుష్ అప్స్ – సిట్ అప్స్– కనీసం 20, రోప్ క్లైంబింగ్ – 3 – 4 మీటర్లు. చిన్ అప్స్– కనీసం 8.
- **ఫీజు:** రూ. 200/– , ఎస్సీ/ఎస్టీ, మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** రాతపరీక్ష + ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ (ఐపీటీ) ద్వారా

**ఇంటెలిజెన్స్ పర్సనాలిటీ టెస్ట్ (ఐపీటీ)**

- ఎస్ఎస్‌బీ రెండు దశల్లో ఈ టెస్ట్ నిర్వహిస్తుంది.
- స్టేజ్ –1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్టులు ఉంటాయి. వీటిలో పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్టులు ఉంటాయి.
- స్టేజ్ –2లో ఇంటర్వ్యూ, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్క్స్, సైకాలజీ టెస్టులు ఉంటాయి.
- **మిలిటరీ, నేవల్, ఎయిర్‌ఫోర్స్ అకాడమీల్లో ప్రవేశాల కోసం** మొత్తం 300 మార్కుల్లో భాగంగా ఇంగ్లిష్–100, జనరల్‌నాలెడ్జ్–100, ఎలిమెంటరీ మ్యాథ్స్–100 ప్రశ్నలు ఇస్తారు. **ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీలో ప్రవేశాల కోసం** మొత్తం 200 మార్కుల్లో భాగంగా ఇంగ్లిష్–100, జనరల్‌నాలెడ్జ్–100 నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- కాలవ్యవధి – ఒక్కో సబ్జెక్టును 2 గంటల్లో పూర్తిచేయాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరకాస్తులకు చివరితేదీ:** జూలై 8
- **పరీక్షతేదీ:** సెప్టెంబర్ 8
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

## అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీటెక్

**హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఎంపీసీ స్ట్రీమ్ కింద (రైతుల కోటా) 2019-20కిగాను బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- కోర్సు పేరు: బీటెక్ (అగ్రికల్చర్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ)
- మొత్తం సీట్ల సంఖ్య: 36 (అగ్రికల్చర్ ఇంజినీరింగ్–18, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ –18)
- కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్, కంది (సంగారెడ్డి), కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ & టెక్నాలజీ రుద్రూర్ (నిజామాబాద్ జిల్లా) కాలేజీలు బీటెక్ కోర్సును అందిస్తున్నాయి.
- **అర్హత:** ఇంటర్ (మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్) ఉత్తీర్ణత. అభ్యర్థి నాన్ మున్సిపల్ ప్రాంతంలో 1 నుంచి ఇంటర్ వరకు కనీసం నాలుగేండ్లు చదవాలి. తల్లిదండ్రుల పేరిట తప్పనిసరిగా కనీసం ఎకరం భూమిని కలిగి ఉండాలి.
- **వయస్సు:** 2019 డిసెంబర్ 31 నాటికి 17 నుంచి 22 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు 25 ఏండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు 27 ఏండ్ల వరకు సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్/బీసీలు రూ.1800/–, ఎస్సీ/ఎస్టీ/ పీహెచ్‌సీలకు రూ. 900/–
- **ఎంపిక:** ఎంసెట్ –2019 ర్యాంక్ ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 12
- **వెబ్‌సైట్:** www.pjtsau.ac.in

## సీఎల్‌ఆర్‌ఐలో ప్రాజెక్టు అసిస్టెంట్లు

**చెన్నైలోని సెంట్రల్ లెదర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎల్ ఆర్ఐ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రాజెక్టు అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- మొత్తం పోస్టులు: 28
- **పోస్టులు:** ప్రాజెక్టు అసిస్టెంట్ (గ్రేడ్1, గ్రేడ్2, గ్రేడ్3), జేఆర్ఎఫ్. ఎస్ఆర్ఎఫ్, రిసెర్చ్ అసోసియేట్.
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ/మాస్టర్ డిగ్రీ, ఎంఫార్మసీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత.



- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూతేదీ:** జూన్ 21
- **వెబ్‌సైట్:** www.clri.org

## బీఈసీఐఎల్‌లో

**నోయిడాలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్ )లో కాంట్రాక్టు ప్రాతిపదికన స్కిల్డ్ &అన్‌స్కిల్డ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

BECIL
BROADCAST ENGINEERING CONSULTANTS INDIA LIMITED RECRUITMENT

- **మొత్తం పోస్టులు:** 1100 (స్కిల్డ్ –400, అన్‌స్కిల్డ్–700)
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి స్కిల్డ్ పోస్టులకు ఎలక్ట్రికల్/వైర్‌మ్యాన్ ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో రెండేండ్ల అనుభవం ఉండాలి. అన్ స్కిల్డ్ పోస్టులకు ఎనిమిదో తరగతితోపాటు సంబంధిత విభాగంలో ఏడాది అనుభవం ఉండాలి.
- **ఫీజు:** రూ. 500/– (ఎస్సీ/ఎస్టీ/ పీహెచ్‌సీలకు రూ. 250/–)
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూన్ 24
- **వెబ్‌సైట్:** www.becil.com

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ కరీంనగర్ ]
బుధవారం 19 జూన్ 2019


కీర్తి సురేష్

## కీర్తి సురేష్ న్యూలుక్

కొస్త బొద్దుగా, చూడముచ్చటైన రూపలావణ్యంతో అభిమానుల్ని అలరిస్తుంటుంది కీర్తి సురేష్. అయితే ప్రస్తుతం మన కథానాయికలు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యతనిస్తూ సైజ్‌జీరో శరీరాకృతికోసం కసరత్తులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వరుసలో కీర్తిసురేష్ చేరింది. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ అమ్మడు పోస్ట్ చేసిన ఓ ఫొటో చూసిన అభిమానులు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. పూర్తిగా సన్నబడి సరికొత్త రూపంతో దర్శనమిస్తున్న కీర్తిసురేష్ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. చాలా మంది అభిమానులు ఆమె లుక్ బాగుందని కితాబివ్వగా, మరికొందరేమో బొద్దుగా ఉంటేనే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కీర్తిసురేష్ తెలుగు, తమిళ భాషల్లో రూపొందిస్తున్న ఓ చిత్ర షూటింగ్‌లో భాగంగా స్పెయిన్‌లో ఉంది. అక్కడే 45 రోజుల పాటు భారీ షెడ్యూల్ చేయబోతున్నారు. నరేంద్రనాథ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మహేష్ ఎస్ కోనేరు నిర్మిస్తున్నారు. దసరా కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# నటుడిగా నాకు ఇది ఛాలెంజ్!

**''అర్జున్‌రెడ్డి'తో మా సినిమాను పోల్చిచూడొద్దు. మాతృకను కాపీ చేయకుండా కథలోని ఆత్మను నవ్య పంథాలో ఆవిష్కరిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అని అన్నారు షాహిద్‌కపూర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న హిందీ చిత్రం 'కబీర్ సింగ్'. తెలుగులో విజయవంతమైన 'అర్జున్‌రెడ్డి' ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. సందీప్ రెడ్డి వంగా దర్శకుడు. ఈ నెల 21న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో పాత్రికేయులతో షాహిద్ కపూర్ పంచుకున్న ముచ్చట్లివి..**


షాహిద్ కపూర్

**'అర్జున్‌రెడ్డి' సినిమా చూసినప్పుడు ఏమనిపించింది?**

• 'అర్జున్‌రెడ్డి' సినిమాకు నేను అభిమానినే. తెలుగు భాష నాకు అర్థం కాకపోయినా అందులోని పాత్రలు, భావోద్వేగాలు, నటనతో కనెక్ట్ అయ్యాను. రియలిస్టిక్‌గా కొత్తగా ఉందనిపించింది. ముఖ్యంగా విజయ్ అభినయం నన్ను అమితంగా ఆకట్టుకుంటుంది. అద్భుతంగా నటించాడు.

**విజయ్ దేవరకొండతో పోలిస్తే మీరు చాలా సీనియర్ నటుడు కదా. ఈ పాత్రను అర్థం చేసుకొని నటించడంలో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి?**

• కొత్త నటులతో పోలిస్తే సీనియర్ నటుల పట్ల ప్రేక్షకుల దృక్కోణం వేరుగా ఉంటుంది. ఇదివరకు ఎన్నో విభిన్నమైన పాత్రలు చేసి ఉండటంతో కొత్త క్యారెక్టర్‌తో ప్రేక్షకుల్ని సహానుభూతి చెందేలా చేయడానికి సీనియర్ నటులు చాలా కష్టపడాల్సి ఉంటుంది. గత పాత్రల తాలూకూ ఛాయల్ని మర్చిపోయేలా చేయడం ఛాలెంజింగ్‌గా ఉంటుంది. ఈ సినిమాలో నటుడిగా నాకు అలాంటి సవాలే ఎదురైంది. షాహిద్ కపూర్ కాకుండా కబీర్‌సింగ్ జీవితాన్ని ఆవిష్కరించడం ఛాలెంజింగ్‌గా అనిపించింది.

**ఈ రీమేక్‌లో నటించాలన్నది మీ స్వీయ నిర్ణయమేనా?**

• నా ఆలోచన కాదిది. ఓ నిర్మాణ సంస్థ వారు ఈ రీమేక్‌తో నన్ను సంప్రదించారు. నచ్చింది కదా అని అంగీకరించి సినిమాను చెడగొట్టాలనుకోకుండా దర్శకుడు ఆసక్తిని అనుసరించి అంగీకరించాను. ఓ మంచి కథతో ఏ భాషా ప్రేక్షకుల్నైనా ఆకట్టుకోవచ్చుదన్నది నా అభిప్రాయం. హిందీ ప్రేక్షకులకు 'కబీర్‌సింగ్' కథ చెప్పే అదృష్టం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.

**• నా కెరీర్‌లో ముప్పై సినిమాలు చేశాను. పదిహేనేళ్ల ప్రయాణంలో అవి తక్కువే అయినా నా దృష్టిలో అది పెద్ద సంఖ్యగానే భావిస్తున్నాను.**

**మీరు నటించిన తొలి రీమేక్ సినిమా ఇదే కదా? ఆ అనుభవం ఎలా ఉంది?**

• ఇదే నా తొలి రీమేక్ సినిమా. కొన్ని రీమేక్‌లు కథను అనుసరించి సాగితే మరికొన్ని క్యారెక్టరైజేషన్ ఆధారంగా సాగుతాయి. 'కబీర్‌సింగ్' రెండో కోవకు చెందిన సినిమా. ఓ వ్యక్తి భావోద్వేగాలు, ఆటిట్యూడ్ ఆధారంగా సాగుతుంది. పూర్తిగా 'అర్జున్‌రెడ్డి'ని కాపీ చేయకుండా మాతృకలోని ఆత్మను యథాతథంగా నవ్యపంథాలో ఆవిష్కరించే ప్రయత్నం చేశాం.

**'ఉడ్తా పంజాబ్'లో డ్రగ్ ఎడిక్ట్ పాత్రలో నటించారు. ఆ అనుభవం కబీర్‌సింగ్ పాత్ర చేయడానికి ఎంతవరకు ఉపయోగపడిందని అనుకుంటున్నారు?**

• 'ఉడ్తాపంజాబ్'లో చేసిన టామీసింగ్ పాత్రకు కబీర్‌సింగ్‌కు ఎలాంటి పోలికలు ఉండవు. సినిమా పూర్తయ్యాక టామీసింగ్ కాకుండా కబీర్‌సింగ్ ఆలోచనలతోనే థియేటర్ నుంచి ప్రేక్షకులు బయటకు వెళ్తారు.

**విజయ్ దేవరకొండను ఎప్పుడైనా కలిశారా?**

• విజయ్‌ని కలవడం కోసం నేను ఎదురుచూస్తున్నాను. కానీ అతడు చాలా బిజీగా ఉన్నాడు(నవ్వుతూ) విజయ్‌ని కలిపిస్తానని సందీప్‌రెడ్డి చాలా సార్లు అన్నారు. కానీ కుదరలేదు. హైదరాబాద్ వచ్చాను కాబట్టి ఇప్పుడు కలవాలని అనుకుంటే విజయ్ ఇక్కడ లేడు.

**ప్రభాస్ ఈ ట్రైలర్‌ను ప్రశంసించడం ఎలా అనిపించింది?**

• నా హెయిర్‌స్టైలిస్ట్ హకీమ్ ప్రభాస్‌కు స్టైలిస్ట్‌గా పనిచేస్తుంటాడు. అతడి ద్వారా ప్రభాస్ ఈ సినిమా గురించి తెలుసుకొని టీజర్ తనకు నచ్చిందని తప్పకుండా చూస్తానని చెప్పడం ఆనందాన్ని కలిగించింది

**మాతృకతో ఈ సినిమాను పోల్చిచూస్తారనే భయాలు ఉన్నాయా?**

• 'అర్జున్‌రెడ్డి'తో ఈ సినిమాను పోల్చిచూడటం సరికాదు. మాతృకకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చాం. ఈ రీమేక్ కోసం మేము చాలా శ్రమించాం. మా కష్టానికి, నటనకు గౌరవం ఇవ్వాలి. అంతేకానీ పోలికలు పెట్టడం సరికాదు. నాకైతే పోల్చిచూడటం నచ్చదు కానీ ఎంత వద్దని చెప్పిన ప్రేక్షకులు మాత్రం అదే చేస్తారు. 'అర్జున్‌రెడ్డి' తెలుగు ప్రేక్షకుల కోసం తీసిందైతే 'కబీర్‌సింగ్' హిందీ ప్రేక్షకుల కోసం తీశారు.

**రొమాంటిక్ సన్నివేశాల్లో నటించే ముందు మీ భార్య అనుమతి తీసుకుంటారా?**

• 'కబీర్‌సింగ్' చేయమని తనే నాకు సలహా ఇచ్చింది. ఈ పాత్రకు నేనయితేనే న్యాయం చేయగలనని, నా కెరీర్‌లో ప్రత్యేకమైన సినిమాగా నిలుస్తుందని తనే చెప్పింది. నటుల కెరీర్‌లో రొమాన్స్ ఓ భాగమేనని ఆమె అర్థం చేసుకుంటుంది. ఫలానా పని చేయవొద్దని ఆమె ఎప్పుడూ ఆంక్షలు విధించదు.

## పలాసలో జరిగిన కథ


నక్షత్ర, రక్షిత్

రక్షిత్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'పలాస 1978'. కరుణకుమార్ దర్శకుడు. ధ్యాన్ అట్లూరి నిర్మాత. నక్షత్ర కథానాయిక. హీరో రక్షిత్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం చిత్ర ఫస్ట్‌లుక్‌ను దర్శకుడు మారుతి, చిత్ర సమర్పకుడు తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఉత్తరాంధ్రలోని పలాస నేపథ్యంలో జరిగే కథ ఇది. 40ఏళ్ల కాలవ్యవధిలో కథ నడుస్తుంది. 70వ దశకంలో పలాస ప్రాంతంలోని సామాజిక అసమానతలు, కులాల మధ్య పోరును ఆవిష్కరిస్తుంది. నేటివిటీ ప్రధాన కథల్ని ఇష్టపడే ప్రేక్షకులు కొత్త అనుభూతినిచ్చే చిత్రమవుతుంది. పలాస ఆత్మను పట్టిచూపుతుంది' అన్నారు. 'ప్రతి ప్రాంతంలో ఓ మాఫియా ఉంటుంది. ఈ సినిమాలో పలాస ప్రాంత మాఫియా ఎలా ఉంటుందో చూపించారు. తెలుగులో ఓ విభిన్న చిత్రమవుతుంది' అని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు. ఈ సినిమాలో తాను క్రూర స్వభావి అయిన వ్యక్తి పాత్రను పోషించానని రఘు కుంచె తెలిపారు. రక్షిత్ మాట్లాడుతూ 'రెండు నెలల పాటు పలాసలో చిత్రీకరణ జరిపాం. నా పాత్ర నాలుగు భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. హిందీలోని 'గ్యాంగ్స్ ఆఫ్ వస్సేపూర్' తరహాలో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. తిరువీర్, విజయరామ రాజు, తన్మయిబోలి, ప్రవీణ్, జనార్ధన్, మిర్చి మాధవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అరుల్ విన్సెంట్, సంగీతం: రఘు కుంచె, సహనిర్మాత: ఎ.ఆర్.బెల్లన్న, రచన-దర్శకత్వం: కరుణకుమార్.

## సినిమా చూడాలనివుంది!


కె.ఎస్.రామారావు, చిరంజీవి, భీమనేని శ్రీనివాసరావు

''కౌసల్య కృష్ణమూర్తి' క్రికెట్ నేపథ్యంలో వస్తున్న చిత్రమిది. స్పోర్ట్స్ నేపథ్య చిత్రాలకు ప్రతీ ఒక్కరు కనెక్ట్ అవుతారు. జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ నేపథ్యంలో తీసిన ప్రతి చిత్రం ఘన విజయం సాధించింది. స్పోర్ట్స్‌కి అంత ప్రాముఖ్యత వుంది. ఇండియా క్రికెట్ నేషనల్ గేమ్ లాంటిది. ఆ గేమ్ నేపథ్యంలో వస్తున్న సినిమా ఇది' అన్నారు ప్రముఖ హీరో చిరంజీవి. ఐశ్వర్యా రాజేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి'. భీమనేని శ్రీనివాసరావు దర్శకుడు. క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎస్. రామారావు నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్‌ని మంగళవారం హైదరాబాద్‌లో ప్రముఖ హీరో చిరంజీవి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇందులో నటించిన ఐశ్వర్యా రాజేష్ సాధారణ రైతు బిడ్డగా పుట్టి మహిళా క్రికెటర్‌గా అంతర్జాతీయ స్థాయికి ఎదిగే పాత్రలో చక్కగా ఒదిగిపోయింది. క్రికెటర్ పాత్ర కోసం నాలుగైదు నెలల పాటు ఐశ్వర్యా రాజేష్ శిక్షణ తీసుకుని నటించింది. దీన్ని బట్టే ఈ సినిమా పట్ల ఆ అమ్మాయికి వున్న నిబద్ధత, వృత్తి పట్ల వున్న అంకిత భావం, అమె పడిన కష్టం ఏంటో అర్థమవుతోంది. ఐశ్వర్యా రాజేష్ మరెవరో కాదు మా కొలీగ్ రాజేష్ కూతురు. హాస్యనటి శ్రీలక్ష్మి మేనకోడలు. తెలుగు సినిమాల్లో తెలుగమ్మాయిలు కొరవడిపోతున్న ఈ రోజుల్లో ఐశ్వర్య రావడం శుభపరిణామం. ఆమెను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. తెలుగు చిత్రపరిశ్రమలోకి స్వాగతం పలుకుతున్నాను. టీజర్ చూసిన దగ్గరి నుంచి సినిమా ఎప్పుడెప్పుడు చూద్దామా అనే ఆసక్తి మొదలైంది. ఖచ్చితంగా మంచి విజయాన్ని సాధిస్తుంది. మంచి చిత్రాలకు పెట్టింది పేరు క్రియేటివ్ కమర్షియల్స్. ఈ సంస్థకు ఇది మరో హిట్ సినిమా అవుతుంది. దర్శకుడు భీమనేని శ్రీనివాస్‌కు ఇది ఆయన కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలుస్తుంది' అన్నారు.

## మ..మ్మా..రే కల్లు మత్తెక్కింది!


శ్రీరామ్

'రోజాపూలు, ఒకరికిఒకరు, తరువాత తెలుగులో మళ్ళీ నాకు ఆ స్థాయి గుర్తింపును తీసుకొచ్చే చిత్రం 'అసలేం జరిగింది'. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే చిత్రమిది' అన్నారు కథానాయకుడు శ్రీరామ్. తెలుగులో కొంత విరామ తర్వాత హీరో శ్రీరామ్ నటిస్తున్న చిత్రం 'అసలేం జరిగింది'. ఈ చిత్రంలో శ్రీరామ్ సరసన కన్నడ భామ సంచితా పదుకునే నాయికగా నటిస్తోంది. ఎక్సోడస్ మీడియా పతాకంపై శ్రీమతి నీలిమ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కెమెరామెన్ ఎన్‌వీఆర్ దర్శకత్వ బాధ్యతల్ని చేపట్టారు. కాగా ఈ చిత్రంలోని చిర్రావూరి విజయ్‌కుమార్ రచించిన 'మమ్మరే కల్లు మత్తెక్కింది. మమ్మారే కల్లు మతిపోయింది' అనే పాటను ఓ ఎఫ్‌ఎమ్ రేడియో స్టేషన్‌లో కథానాయకుడు శ్రీరామ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే ఒక సస్పెన్స్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని తెలిపారు.







